# లోకానికి నేనే వెలుగు



## పునరుత్థాన ఫలములు - మన పండుగలు

సంపుటి : 46 జనవరి - మార్చి 2023 సంచిక : 1

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.


**సంపాదక వర్గం :**

ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ దాసి సురేష్ కుమార్
ఫాదర్ కుర్మ తోమస్
ఫాదర్ సగినాల ప్రకాష్

**గురు విద్యార్థుల బృందం :**

బ్రదర్ బొమ్ము మత్తయి
బ్రదర్ కదిరేపోగు జయన్న
బ్రదర్ రామంచ శరత్ కుమార్
బ్రదర్ బాపనపాటి అలెక్స్
బ్రదర్ కండి కిషోర్
బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ
బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెండేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగుళ్ళ ప్రదీప్‌కుమార్
బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్
బ్రదర్ పగుర్ల భానుప్రసాద్
బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్
బ్రదర్ బడిపాటి జాకబ్

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా **St. John's Regional Seminary Society, Hyderabad** పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:


**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 91-040-29561761, 29561762
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 46 జనవరి-మార్చి 2023 సంచిక : 1

## పునరుత్థాన ఫలములు - మన పండుగలు

**ఫాదర్ సగినాల ప్రకాశ్**
సంచిక సంపాదకులు

**ఫాదర్ పిల్లి అంతోని దాస్**
ప్రధాన సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 91-040-29561761, 29561762
E-mail : stjohnshyd2@gmail.com
Website : stjohnseminary.org

# విషయసూచిక

సంపాదకీయం.............................................. **05**

**1. ఏప్రిల్ 9 : పునరుత్థాన మహోత్సవము**

*– ఫాదర్ సగినాల ప్రకాశ్* ........................... **07**

**2. ఏప్రిల్ 16 : దివ్యకారుణ్య మహోత్సవము**

*– బ్రదర్ కొమ్మెర పవన్ & బ్రదర్ కాసు అఖిల్* ........ **21**

**3. ఏప్రిల్ 30 : యేసు – మంచి కాపరి**

*– బ్రదర్ పెండెల ఉమేష్ చంద్ర* .......................... **30**

**4. మే 1 : పునీత కార్మిక జోజప్పగారి మహోత్సవము**

*– బ్రదర్ నందిగామ మణిహార్* ............................ **35**

**5. మే 13 : ఫాతిమా మాత పండుగ**

*– బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్* ................................. **41**

**6. మే 21 : క్రీస్తు మోక్షారోహణ మహోత్సవము**

*– బ్రదర్ చాట్ల అలెగ్జాండర్* ............................. **53**

**7. మే 28 : పెంతెకోస్తు మహోత్సవము**

*– బ్రదర్ బాపనపాటి అలెక్స్* .............................. **61**

8. జూన్ 4 : త్రియేక సర్వేశ్వరుని మహోత్సవము
– *బ్రదర్ బడిపాటి జాకబ్* ................................ **71**

9. జూన్ 11 : క్రీస్తు శరీర రక్తముల మహోత్సవము
– *బ్రదర్ కొమ్మెర పవన్* .................................. **77**

10. జూన్ 13 : పునీత పాదువపురి అంతోని స్మరణ
– *బ్రదర్ పాగుర్ల భాను ప్రసాద్* .......................... **87**

11. జూన్ 16 : యేసు పవిత్ర తిరుహృదయ మహోత్సవము
– *బ్రదర్ పెంటారెడ్డి సంజయ్* ............................ **99**

# సంపాదకీయం



పండుగలు మానవ సంస్కృతిలో ఒక భాగం. అవి మనిషిని ఆనందంతో నింపుతాయి. ఆధ్యాత్మిక స్థితిలో అతన్ని నూత్నీకరిస్తాయి. పండుగలోనున్న పరమార్థం, ఉత్సుకత మనిషిలో ఒక క్రొత్త ఊపిరిని ప్రవహింపజేస్తాయి. నిస్తేజంగా ఉన్న జన జీవనాన్ని ఆనందంతో నింపుతుంది. క్రైస్తవ సాంప్రదాయంలో అటు బాహ్య సంతోషానికి, ఇటు అంతర్గత ప్రక్షాళనకు కేంద్ర బిందువులు పండుగలు. అటువంటి పండుగల గురించి ఈ సంచికలో చెప్పదలచుకొన్నాం. క్రీస్తుని పునరుత్థానంతో మొదలు పెట్టి ఆ తరువాత వచ్చే ఆదివారాలు గొప్ప మహోత్సములను మనకు అందిస్తాయి. ఈ పండుల చారిత్రకత, ఆధ్యాత్మిక నేపథ్యం, అంతర్గత భావాలు, అన్వేషించదగిన సత్యాలు, జనజీవనానికి ఆదర్శవంతమైన సందేశాలు ఈ సంచికలో చర్చిండం జరుగుతుంది.

క్రీస్తు పునరుత్థాన పండుగ, దివ్యకారుణ్య పండుగ, క్రీస్తు మోక్షారోహణ పండుగ, పెంతెకోస్తు పండుగ, త్రిత్వైక దేవుని మహోత్సవము, యేసు పవిత్ర శరీర రక్తముల మహోత్సవము, యేసుతిరుహృదయ మహోత్సవము, మంచికాపరి మొదలగు పండుగలు ఇందులో ఉంటాయి.

పండుగలను మ్రొక్కుబడిగా జరుపుకొంటూ, క్రొత్త బట్టలతో, రుచికరమైన వంటతో మురిసిపోయి అయిపోయిందని పించటం చిన్నపిల్లల అమాయకత్వం లాంటిది. అంతకుమించి పండుగనుండి నేర్చుకొని, నేర్పించి ఆచరించే అంశాలెన్నో అందులో ఉన్నాయని గ్రహించడం క్రైస్తవసంస్కృతిని సూచిస్తుంది. పండుగల పరమార్థాన్ని తెలియజేప్పే గురువులు మొదలుకొని, అమాయకపు అల్లరితో కేరింతలు కొట్టే పసిబిడ్డల వరకు అందరూ పండుగల పరమార్థాన్ని

ఆస్వాదించాలి. ఆధ్యాత్మిక భోజనాన్ని గ్రహించే గుడులలోనూ, దివ్యపూజాబలిలో వివరించబడే పవిత్ర అంశాలను జాగ్రత్తగా స్వీకరించడం నేర్చుకోవాలి. ఎంత గొప్పగా హృదయంలో పండగ ఆధ్యాత్మిక సందేశం నిలబడిపోతుందో అంత గొప్పగా బాహ్య ప్రపంచం ఆనందంతో నిండిపోతుంది. దిన జీవన ప్రవాహం సంతోషంగా సాగుతుంది. అందుకే మనిషికి పండుగలు అవసరం. ఆ పండుగలలోని పరమార్థం ఇంకా అంత్యంతవసరం.

ఈ పండుగల వివరణను వ్యాసరూపంలో మనకందిస్తున్న గురువిద్యార్థులను అభినందిస్తున్నాము. ఈ సమయం, సంవత్సరాంతర పరీక్షల సమయం. అయినా తమసమయాన్ని వెచ్చించి, దైవ సేవలో ప్రజలకు ఏదైనా అందివ్వాలన్న తపన ఈ రచయితలలో కనిపిస్తుంది. దేవుడు వారి ఉత్సాహాన్ని, రచనా నైపుణ్యాన్నీ మరింతగా అధికం చేయాలని కొరుకుంటున్నాను.

ఒక్కో పండుగ, మహోత్సవం గురించి వివరించబడిన ఆధ్యాత్మికాంశాలు పాఠకులకు ఉపయోగకరంగా ఉంటాయని విశ్వసిస్తున్నాము. దేవుడు మనందరినీ దీవించుగాక!

భవదీయుడు
**ఫాదర్ సగినాల ప్రకాశ్**
సంచిక సంపాదకులు

# 1. పునరుత్థాన మహోత్సవము

– ఫాదర్ సగినాల ప్రకాశ్



## పరిచయం

పునరుత్థానం అంటే మరణం నుండి జీవనాన్ని పునరుద్ధరించడం లేదా పునరుద్ధరించుకోవడం. అయితే ఈ నిర్వచనాన్ని పోయిన ప్రాణం కొంతసేపటికి తిరిగి రావడం (resuscitation)తో మిళితం చేయకూడదు. రెండూ ఒకటే కాదు. 'పునరుత్థానం' అంటే ఒక వ్యక్తి ఆత్మ శరీరాలతో సహా ప్రభువైన దేవునితో అనంతకాలమూ సహవాసం చేయడం. క్రీస్తుకు సంబంధించినంత వరకు ఆయన పునరుత్థానం ద్వారా దివ్యజీవం పొందటం బైబిలులో చదవగలం. యేసుక్రీస్తు పునరుత్థానం దైవముచే చేయబడిన క్రియ. అది ఆయనకే చెల్లింది.

సువిశేసాలు క్రీస్తు పునరుత్థాన దర్శనాలను విరివిగా పొందుపరచాయి. క్రీస్తు గురించిన సువార్తా ప్రచారం ఆయన మరణపునరుత్థానాలతో ప్రారంభమయ్యాయే గాని ఆయన పుట్టుకతో కాదు. అవన్నీ తరువాత వివరించబడిన విషయాలు. ఆయన జీవించినపుడు నడచినట్లే ఉత్థానమైన తరువాత నడిచాడు అంటాడు లూకా (24:15). ఆయన మాట్లాడటం, భుజించటం, త్రాగటం, తన శరీరాన్ని తాకమని ఇతరులను ఆహ్వానించడం సువిశేషాల్లో వివరించారు. ఈ వివరణలకు కారణం రెండు రకాలుగా చెప్పుకోవచ్చు. మొదటిది క్రీస్తు పునరుత్థాన ప్రత్యక్షత శిష్యులను అమితంగా ఆకట్టుకొని ఉంటుంది. రెండవది వారు పునరుత్థానాన్ని బాగా అర్థం చేసుకొని ఉండాలి. ఏది ఏమైనా ఈ వివరణలు ఒక ప్రగాఢమైన విశ్వాసం నుండి ఉద్భవించి ఉండాలనండంలో సందేహం లేదు. ఒక అద్భుతమైన సాక్షాత్కారాన్ని

అర్థం చేసుకున్న అనుభవం నుండి ఈ అభిప్రాయాలు వివరించబడినాయి. ఇది కథ కాదు. యదార్థ వివరణ. ఇది భ్రమ కాదు. చారిత్రక వాస్తవాల చుట్టూ పరిభ్రమించిన ఒక సదృశ్య సమూలాంశ వివరణ. ఈ భూమ్మీదనడిచిన క్రీస్తే, మరణం తరువాత పునరుత్థానుడై తమకు ప్రత్యక్షమయ్యాడని ఖరాఖండిగా చెప్పిన ప్రత్యక్ష సాక్షుల హృదయస్పందన.

యేసు క్రీస్తు పునరుత్థానం నాలుగు సువిశేషాల్లోనూ మరియు పౌలుని లేఖల్లోనూ కనిపిస్తుంది. క్రీస్తు ఉత్థానమైన ఉదయం ఎన్నో ఆసక్తికర సన్నివేశాలు కనుపిస్తాయి. ఎందరో వ్యక్తులు ఆయన దర్శనంతో ఆశ్చర్యం, అద్భుతానందం చెందటం గమనిస్తాం. వివరణలన్నీ ఒకే క్రమంలో కనుపించవు. పాఠకునికి పఠనా క్రమంలో కొంచెం ఇబ్బంది కలిగినా అవన్నీ సజీవ సాక్ష్యాలేనని గ్రహించాలి. ఒక్కోసారి ఒకే సన్నివేశాన్ని మార్పులతో, చేర్పులతో వివరిస్తారు రచయితలు. ఏది ఏమైనా పునరుత్థాన క్రీస్తు, ఒకరికో లేదా అంతకుమించిన సంఖ్యకో దర్శనమిచ్చారనడం నిర్వివాదాంశం. ఒక్కో రచయిత తాను వివరించిన తీరు ఇలా ఉంటుంది :

**మత్తయి** : క్రీస్తు పుణ్యస్త్రీలకు కనిపించాడు – ఒక పర్వతం మీద తిరిగి కనుపించాడు.

**మార్కు** : మరియ మగ్దలీన ఆయన్ను చూసింది – ఎమ్మావుస్ అనే గ్రామానికి వెళ్తున్న ఇద్దరు శిష్యులు ఆయన్ను చూశారు – మోక్షరోహణకు ముందు పదకొండు మంది శిష్యులు ఆయన్ను చూశారు.

**లూకా** : ఎమ్మావుస్ మార్గంలో ఇద్దరు శిష్యులు ఆయన్ను చూశారు – పేతురు, ఇతర శిష్యులు యెరూషలేములో సమావేశమై ఆయన్ను చూశారు.

**యోహాను** : మరియ మగ్దలీనుకు ఆయన కనుపించాడు – ఒక వారం తరువాత మిగిలిన పదకొండుమందికి కనుపించాడు – తిబేరియా సరస్సు తీరంలో ఏడుగురు శిష్యులకు కనుపించాడు – తోమాసును సందేహనివృత్తి చేసికొమ్మని ఆహ్వానించాడు.

**పౌలు** : పేతురుకు కనిపించాడు – పదకొండుమందికి కనుపించాడు – ఐదువందల మందికి కనుపించాడు.

ఇంతమందికి కనుపించిన ఉత్థానక్రీస్తును పొరబాటుగా ఇంకోవ్యక్తిగా గుర్తించడం లేదా భ్రమలో మాట్లాడడమోనన్న అనుమానాలు ఆధారం లేని వాదాలు. ఇలా చెప్పినవారిలో అధికభాగం నిరక్షరాస్యులు, కల్లాకపటం ఎరుగని పేదప్రజలేనని గుర్తుంచుకోవాలి. వారి నిరాడంబరత, నిజాయితీ, ప్రభువు చూపిన జీవితం పట్ల ఆసక్తి, అంకితభావం వారిని తప్పుడు ప్రచారానికి పురికొల్పి ఉండదు. వారంతా ఏదో పనికట్టుకొని పునరుత్థానం గురించి ప్రచారం చేశారన్న అభిప్రాయం నిరాధారమయింది. పైగా అలాంటి ప్రచారం వల్ల వాళ్ళు సాధించేదేమీ లేదు. కాగా తమ ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదముండి కూడా వారు వెనుకంజ వేయలేదు. ఆ కాలంలో మోసపు ప్రచారానికి కఠినమైన శిక్షలుండేవి. మోసాలను సులభంగా గుర్తించే కాలాలవి. ఉత్థానానికి సాక్షులుగా వారు చూపిన, ధైర్యం వారిలో ప్రగాఢంగా నాటుకుపోయిన నమ్మకం, విశ్వాసమేనని గుర్తించాలి.

మతవిశ్వాసాలలో యూదులకు తిరుగులేదు. తమ మతం మీద వారికి ప్రగాఢమైన నమ్మకవిశ్వాసాలున్నాయి. తమను తప్పుబట్టిన క్రీస్తును, ఒక ప్రవక్తగా ఎదగకుండా అన్ని విధాలా అడ్డుకున్నారు లేదా అడ్డుకున్నామని వారనుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన చనిపోయి లేచాడన్న వార్త దావానంలా వ్యాపిస్తుందని వారికి తెలుసు. దీని ద్వారా క్రీస్తు చనిపోయి కూడా ఎక్కువ ప్రాధాన్యత సంతరించుకుంటాడని వారి మతపెద్దలకు బాగా తెలుసు. ఆదికంటే అంతమే ప్రమాదమవుతుందనీ తెలుసు. అదువల్ల ఈ వార్తలు అసత్యమని శాయశక్తులా ప్రచారం చేసి ఉండవ్చు. కానీ ఆ తరువాత వారి మౌనం పునరుత్థానానికి సాక్షిగా నిలుస్తుంది. అంతేగాక శిష్యులు మోసం చేశారని వారిని కూడా చంపివేసేవాళ్ళే. కానీ అలా జరుగలేదు. సైనికులకు లంచం ఇచ్చి నోళ్ళు మూయించడం (మత్తయి 28:11-15), యేసు పేరిట శిష్యులకు మాట్లాడవద్దని మందలించడం (అ.చ. 4:17) తప్ప ఇంకేప్రయత్నమూ చేయకపోవడం ఇక్కడ గమనార్హం. పురుత్థాన ప్రభావం ఆనాటి ప్రజలలో ప్రభలంగా నాటుకుపోయిందనడానికిదొక నిదర్శనం.

అపోస్తులుల బోధనలలో విశ్వాసముంచిన వేలాదిమంది ప్రజలలో యూదులు, అన్యులు ఉన్నారు. విశ్వాసాన్ని స్వీకరించడంలో వారికి కష్టాలు

తప్ప ఇంకే ప్రతిఫలమూ దక్కలేదు. అయినా ఎవరూ వెనుకంజ వేసినట్లు ఎక్కడా రాయబడలేదు. ఈ తెగువలోనే ఓ సాక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. తెగువతో మృతిచెందిన క్రీస్తును గాక, ఉత్థానుడైన క్రీస్తును వారు విశ్వసించడంలో ఎంతో అర్థముంది. క్రీస్తు పునరుత్థానంలో దినదిన ప్రవర్ధమానమై పెరిగిన శ్రీసభే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. పునరుత్థానం లేకుండా శ్రీసభ పెరిగి ఉంటే, అది పునరుత్థానం కంటే మించిన అద్భుతమయి ఉండేది. పునరుత్థానమే శ్రీసభకు అనాదినుండి పునాది. పునరుత్థానమే శ్రీసభకు పట్టుగొమ్మ.

ప్రాచీన ఇశ్రాయేలీయులలో చనిపోయిన వారి గురించి ఓ నమ్మకముండేది. చనిపోయింతరువాత వారి ఆత్మలు భూమిక్రింది భాగంలో ఉన్న చీకటి స్థలమైన 'షియెల్' లేదా 'హెడెన్' చేరుకుంటాయని వారి నమ్మకం. యేసు జన్మించడానికి షుమారు ఆరువందల సంవత్సరాలకు పూర్వం, యూదులు బాబిలోను చెఱలో ఉండేవారు. మరణానంతరం జీవితముందని అప్పటి నుండే నమ్మడం ప్రారంభించారు. చెఱలోనున్న ఆ నిస్సహాయులకు జీవితంపై ఆశాభావాన్ని పెంపొందించుకోవడానికి ఒక విధంగా ఈ నమ్మకం ఉపయోగపడింది (యెషయ 26:19; యెహెజ్కేలు 37). దేవుని ప్రజలు మరణం తరువాత సజీవులై లేస్తారని దానియేలు ప్రవక్త ప్రవచిస్తూ, దుష్టులకు శిక్ష, నీతిమంతులకు నిత్యజీవితం ఉంటుందన్నాడు (దానియేలు 12:2-3). ప్రాచీన సంస్కృతులలో మరణం తరువాత జీవం ఉన్నట్లు కనిపిస్తుంది. గ్రీకులు అమరత్వాన్ని నమ్ముతారు. శరీరం నుండి కనుమరుగయ్యాక ఆత్మ నిలిచి ఉంటుందని విశ్వసిస్తారు. ఇటువంటి నమ్మకం ఇతర మతాల్లో కూడా కనిపిస్తుంది. మనిషి పార్థివశరీరాన్ని దహనం చేసే హిందూ మతం, మరుజన్మను బోధిస్తుంది. అయితే క్రొత్త నిబంధన వివరించే పునరుత్థానం వేరు. ఇది మనిషి ఆత్మకు, శరీరానికి సంబంధించినది.

నూతన నిబంధనలో ఇతరుల జీవితాన్ని ప్రభువు మూడుమార్లు పునరుద్ధరించడం కనిపిస్తుంది.

యాయీరు కుమార్తెకు ప్రాణదానం మత్తయి 9:18-26; మార్కు 5:21-42
నాయీను విధవ కుమారున్ని బ్రతికించడం లూకా 7:11-17
లాజరును పునర్జీవితున్ని గావించడం యోహాను 11:1-44

ఈ మూడు విషయాలకు పునరుత్థానాలుగా పరిగణించలేం. వీరు ప్రభువు చేత పునర్జీవితులయ్యారు. క్రీస్తు పునరుత్థానానికి (Resurrection), వీరి పునర్జీవానికి (Resuscitation) తేడా ఉంది. క్రీస్తు సర్వశక్తిమంతుడు . జీవన కర్త. ఆయనకు జీవన్మరణాల మీద సర్వాధికారాలున్నాయి. మనుష్యులలో ఒకడిగా మరణాన్ని తన మీద తానే ఆపాదించుకొన్నాడు. సర్వశక్తిమంతుడుగా తిరిగి లేచాడు.

క్రీస్తు పునరుత్థాన సంఘటనలని విశ్లేషించి సువిశేషాల్లో వివరించినట్లు కనుపించదు. అంటే పునరుత్థానమంటే ఏమిటి అది ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? అన్న ప్రశ్నలకు సరయిన సమాధానాలు కనుపించవు. కనుపించేదల్లా కొన్ని ఆనవాళ్ళు మాత్రమే. మనకు వివరించబడింది ఖాళీసమాధి, పునరుత్థానుడైన ప్రభు దర్శనం మాత్రమే. ప్రప్రథమంగా పునరుత్థానం గురించి లోకానికి విపులీకరించిన లేఖ, కొరింతీయులకు వ్రాసిన మొదటి పత్రిక (15:3-8) అని పండితులు భావిస్తారు. ఆ తరువాత పలుచోట్ల నూతన నిబంధనలో ఈ వివరణలు చోటు చేసికొన్నాయి. (ఉదాహరణకు అ.చ. 8:37; రోమా 10:9; 1 కొరింతీ 12:3; ఎఫెసీ 5:14; 1 తిమోతి 3:16). అపోస్తులులు వారి బోధనలో పునరుత్థానం గురించి విరివిగా బోధించినట్లు తెలుస్తోంది (అ.చ. 2:2-18; 3:15,26; 4:10,33; 5:30; 1:41; 13:31-37; 17:3, 31; 26:22 మొదలగు వచనాలు ఇందుకు నిదర్శనం). ఈ వచనాలలోని సారాంశాన్ని బట్టి అపోస్తులుల మౌళిక బోధనాంశం పునరుత్థానమే. ఈ పన్నెండుమంది శిష్యులు పునరుత్థానానికి ప్రత్యేక సాక్షులుగా తమను తాము ప్రకటించుకున్నారు. యూదా ఇస్కరియోతు స్థానంలో ఎన్నుకోబడవలసిన శిష్యుడు (మత్తియాసు) యేసు పునరుత్థానమునకు సాక్షిగా ఉండాలన్నది ఒక నిబంధన (అ.చ. 1:21). ఈ విధంగా శిష్యుల మనస్సులో అప్పుడప్పుడే గాఢమైన ముద్రవేసుకున్న పునరుత్థానం, వారి జీవితాలను, బోధనలను విరివిగా ప్రభావితం చేసిందనడంలో సందేహం లేదు.

సారూప్య సువిశేషాలలో యేసు తన పునరుత్థానం గురించి చాలాచోట్ల ప్రస్తావించారు (మత్తయి 16:21; 17:9; 17:23; 20:19; మార్కు 8:3; 9:3; 9:31; 10:34; లూకా 9:22; 18:3). ఆయన ఎన్నిమార్లు చెప్పినా

వారికి అర్థం కాలేదు అంటారు సువిశేషకారులు. కొంచెం వివాదాస్పందంగా కనుపించే ఈ వ్యాఖ్య పునరుత్థానం ప్రస్తావించినపుడల్లా కనిపిస్తుంది. ఇక పునరుత్థాన సంఘటనలలో శిష్యులకు ఆయన్ను చూసింతరువాత కలిగిన సందేహాలు, సంకోచాలు కోకొల్లలు. ఆయన ఎంత వివరించినా, ఎన్నిమార్లు ప్రస్తావించినా వారు అర్థం చేసికోకపోవడం, పునరుత్థాన సంఘటనలను ఋజువు చేస్తాయి. నాలుగు సంఘటనలలో వారు ప్రభువును ప్రభువుగా గుర్తించలేదు (మార్కు 16:12; లూకా 24:16; యోహాను 20:11; 21:4). అయితే వారికి పునరుత్థానం గురించిన జ్ఞానం, అవగాహన పెంతెకోస్తు తరువాతే లభిస్తుంది. పవిత్రాత్మ సర్వేశ్వరుడు వారికి జ్ఞానవెలుగును, అవగాహనా శక్తిని అనుగ్రహిస్తాడు. క్రీస్తు పునరుత్థానం దేవుని రక్షణ ప్రణాళికలో అత్యున్నతమైన భాగం. మనిషిని రక్షించడంలో దేవుడు చేసిన పరిపూర్ణ ప్రయత్నమిది. దానిని ఒక రక్షణ క్రియగా అభివర్ణించడం కంటె దాన్నుండి దొరికిన రక్షణను స్వీకరించడం ముఖ్యం. ఎలా కనుపించాడు అని అడగడం కంటె అసలు కనుపించాడా లేదా అన్నది ముఖ్యం. పునరుత్థాన విషయాల్లో తర్కవితర్కాలకు తావు లేదు. దాని మీద చూపిన విశ్వాసమే మనిషిని రక్షిస్తుంది. అనుమానపడిన తోమాసు విషయంలో (యోహాను 20:29) పునరుత్థానం మీద విశ్వాసం ఉంచబోయే భావితరాలను ప్రభువు మెచ్చుకొన్నాడు. పునరుత్థానాన్ని ప్రత్యక్షంగా చూడకపోయినా, విశ్వసించే మనందరమూ దన్యులమని ప్రభువే చెప్పాడు. అంతేగాని పరిశీలన పేరుతో అర్థం పర్థంలేని తర్కం దారి చూపించదు. దారి చూపేది ఒక విశ్వాసమే. పునరుత్థానం సంపాదించిన రక్షణ ఫలితం బైబిలులో తెలియజేయడమైంది. పునరుత్థానంలోనే క్రీస్తు తనను విశ్వసించిన వారికి ఒక నూతన జీవతాన్నిస్తున్నాడు. మనిషి పాపాల కోసం మరణించిన క్రీస్తు మన నీతికోసం (righteousness) తిరిగి లేచాడు (రోమీ 4:24). క్రైస్తవులు పాపంలో మరణించి, దేవునిలో తిరిగి సజీవులగుతారు (రోమీ 6:4–11)

పునరుత్థానం యొక్క ప్రాముఖ్యత ఈ క్రింది కారణాలలో చూడవచ్చు.

1. పునరుత్థానం దేవుని న్యాయాన్ని, ధర్మాన్ని సూచిస్తుంది. ఎందుకంటే క్రీస్తు వినయుడై, తన మరణం ద్వారా మనిషికి రక్షణ సంపాదించాడు. ఆయనను అత్యున్నత స్థానానికి చేర్చినది పితయైన సర్వేశ్వరుడే (ఫిలిప్పీ 2:6–11).

2. మన పాపాలకు శిలువ వేదన పొందిన క్రీస్తు, మననలు దేవునికి అంగీకార యోగ్యులుగా చేసేందుకు తిరిగి లేచాడు (రోమీ 4:25)
3. తన పునరుత్థానంతో అమరుడైన క్రీస్తు, మన పునరుత్థానానికి నాందీ ప్రస్తావన అయ్యాడు (1 కొరింతీ 15:21; పిలిప్పీ 3:20-21). తద్వారా మరణం నుండి క్రీస్తు లేవనెత్తబడినట్లే, మనమునూ ఒక క్రొత్త జీవితము గడపాలని దేవుని ఆకాంక్ష (రోమీ 6:4).

## క్రీస్తు పునరుత్థానం – ప్రాముఖ్యత

క్రీస్తు శిష్యుల, అనుచరుల అనుభవాలు ఒక చారిత్రక సంఘటనలుగా గుర్తించడం ముఖ్యం. అవి వారి ఆధ్యాత్మిక జీవన ఎదుగుదలలో స్పష్టంగా కనుపిస్తాయి. వాళ్ళుచూపిన పటిష్టమైన జీవనవిధానం మనందరికీ ఆతర్శప్రాయం. అది మన ఆధ్యాత్మిక జీవనానికి దోహదం చేస్తుంది (2 పేతురు 3:18). శిలువలో మరణించిన క్రీస్తూ, ఉత్థానుడై క్రీస్తూ ఒక్కడే. ఆయన శిలువలో మన రక్షణకోసం ప్రాణాలర్పించాడు. మన పాపాలను కడిగివేశాడు. మనకు రావలిసిన శిక్షను తానే శిలువలో అనుభవించాడు. అయితే మనల్ని దేవునికి అంగీకార యోగ్యులనుగా చేసేందుకు తిరిగి లేచాడు. ఆయన పునరుత్థానంలో ఒక నూతన క్రమం మనుషులకు పరిచయమయింది. మరణాన్ని కాలదన్నిన యేసు పునరుత్థానంలో నూతన ప్రపంచంలో అడుగుపెట్టాడు. తన మరణంతో పాపాన్ని జయించిన క్రీస్తు, తన ఉత్థానంతో సైతానుమీద, పాపంమీద, మరణం మీద విజయం సాధించాడు. పౌలుని మాటల్లో : **"మన పాపమునకుగాను ఆయన మరణమునకు అప్పగించబడెను. మనలను దేవునకు అంగీకారయోగ్యులనుగా ఒనర్చుటకు ఆయన లేవనెత్తబడెను" (రోమీ 4:25).** "సమస్తమును ఆయనయే. ప్రథముడగుటకు ఆయన ఆదియై ఉండి మృతులనుండి లేచుటలో ప్రథమపుత్రుడయ్యేను (కొలస్సీ 1:18). పాతతరం అంతరించింది. క్రొత్తదనానికి ఆయననాంది పలికాడు. **"ఎవ్వడైనను క్రీస్తునందున్న యెడల అతడు నూతన సృష్టి! పాత జీవితము గతించినది. క్రొత్త జీవితము ప్రారంభమైనది" (2 కొరింతీ 5:17)**

# పునరుత్థానానికి చారిత్రక ఆధారాలు

సువిశేషంలో వివరించిన చారిత్రక ఆధారాలు పునరుత్థానానికి సాక్షిగా నిలుస్తాయి. అందులో కొన్ని విశేషాలను చూద్దాం.

## 1. రాతి మీద ముద్ర

ఒక నేరస్థుని సమాధిని ఇంకెవరూ సమీపించకుండా రోమను ప్రభుత్వం సమాధికి అడ్డుగా పెట్టిన రాతి మిద ముద్రవేయడం ఆనవాయితీ. ఇది రోమను సామ్రాజ్య అధికారానికి గుర్తు. దాన్నెవరైనా పగుల గొడితే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. అందుకు బాధ్యులను వెదకి పట్టుకొని తలక్రిందులుగా శిలువవేసి చంపడం శిక్షలో ఒక భాగం. అందుకొని ప్రజలు ఈ ముద్రను తగలాలంటేనే భయపడేవారు. క్రీస్తును శిలువ వేసినపుడు శిష్యులు దాగుకొని ఉండటం. పేతురు తనకు క్రీస్తు తెలియదని బొంకడం బహుశా ఇటువంటి శిక్షలకు భయపడి అలా చేసి వుండవచ్చు. కానీ పునరుత్థాన సమయంలో రాయి తొలగింపబడి, ముద్ర విరిగిపోయి ఉంటుంది. అందుకే కావలివారు భయపడి జరిగినదంతా ప్రధానర్చకులతో చెప్పుకొన్నారు (మత్తయి 28:11-15). కనక రాతిమీద ముద్ర పగిలిపోయి ఉండటంలో మానవ ప్రమేయం లేదని తెలిసిపోతోంది. అందుకు పై చట్టాలూ, శిక్షలే ఆధారాలు.

## 2. ఖాళీ సమాధి (యోహాను 20:1-9)

యేసు భౌతిక దేహాన్ని భూస్థాపితం చేసిన సమాధిని ముందుగా మగ్ధలా మరియ, తరువాత పేతురు, "యేసు ప్రేమించిన మరియొక శిష్యుడ" (యోహాను) దర్శించినట్లు - యోహాను సువార్త తెలియజేస్తుంది. ఇవి చారిత్రకమైన గడియలు. చిరస్మరణీయమైన క్షణాలు; వారిలో గూడుకట్టుకొని ఉన్న దుఃఖము విచారము తొలగిపోయి అనిర్వచనీయమైన ఆనందం అంచలమైన విశ్వాసం వెల్లివిరిసే సమయం; "...మీ దుఃఖము సంతోషముగా మారును" (యోహాను 16:20) - అని ప్రభు యేసు పలికిన మాట అక్షరాలా నెరవేరుతున్న

అపురూపమైన సంఘటన. ఈ సంఘటనలో మనం గమనించవలసిన అంశాలు రెండున్నాయి.

**మొదటిది :** "చిరు చీకటి". మగ్దలా మరియ (ఇతర స్త్రీలు – వ. 2) "తెలతెలవారక ముందే" (20:1) – అంటే "చిరుచీకటిలోనే" యేసు సమాధి వద్దకు వెళ్లారు. ఈ "చీకటి"ని పునీత యోహాను – శిష్యులలో గూడుకట్టుకున్న దుఃఖానికి సంకేతంగా ఉపయోగించినట్లు కనిపిస్తుంది; "కొంతకాలము అయిన తరువాత మీరు నన్ను చూడరు" (యోహాను 16:19) అని ప్రభువు పలికినట్లే – ఆయన తమతో లేకపోవడం వలన శిష్యులు మనసులు విచారగ్రస్త మయ్యాయి. నిజానికి – మగ్దలా మరియ (ఇతర స్త్రీలు) యేసు సమాధివద్దకు వెళ్లింది తమ దుఃఖాన్ని ప్రభు సన్నిధానంలో వ్యక్తం చేయడానికి గానీ యేసు మృతదేహానికి తైలాభిషేకం చేయడానికే కాదు; ఎందుకంటే – బెతానియాలోనే ప్రభువుకు అలాంటి అభిషేకం జరిగిపోయింది (చూడండి: యోహాను 12:1–8).

అలాగే – యేసు సమాధి ఖాళీగా ఉందో లేదో మగ్దలా మరియ కళ్లారా చూడలేదు; "సమాధి మీద రాయి తీసివేయబడి ఉండుటను" మాత్రమే చూసింది (20:1). బహుశా శత్రువులు "ప్రభువును సమాధి నుండి ఎత్తుకొని పోయిరి" (20:1) – అనుకొంది. దీనిని బట్టి యేసు పునరుత్థానం గురించి మగ్దలా మరియకు బొత్తిగా తెలియదనే అనుకోవాలి. అసలు ప్రభువు పునరుత్థానుడవుతారనే ఆలోచనే ఆమెకు ఉన్నట్లు లేదు. ఈ అజ్ఞానానికే "చీకటి"ని ప్రతీకగా ప్రతీకగా చెప్పాడు యోహాను; విశ్వాస కాంతి లోపించినపుడు అజ్ఞానమనే చీకటి మానవుల అంతరంగాలను ఇలాగే ఆవరించి ఉంటుంది. అయితే – మగ్దలా మరియలోని ఆ అవిశ్వాసపు టంధకారం – పునరుత్థాన ప్రభు దర్శనంతో పటాపంచలైపోయింది (20:11–18)

**రెండవది :** యేసు ప్రేమించిన శిష్యుడు ఒక్కడే – యేసు సమాధి లోపలికి వెళ్లి "చూచి... విశ్వసించాడు" (20:8). నిజానికి – పేతురు యోహాను లిద్దరూ ఖాళీ సమాధిని చూచారు; అందులో పడి ఉన్న నారవస్త్రాలను చూచారు, యేసు తలకు కట్టిన తుండుగుడ్డను చూచారు, ఈ తుండుగుడ్డ విడిగ చుట్టి పెట్టి ఉండడాన్ని కూడా గమనించారు. మగ్దలా మరియ చెప్పినట్టు యేసు

దేహాన్ని ఎవరూ ఎత్తుకొని పోలేదని గ్రహించారు. అసలు అక్కడ దొంగతనం జరగడానికి ఆస్కారమే లేదని తెలుసుకున్నారు. కనుక ఖాళీ సమాధి ఒక చిహ్నంగాను, ఒక సవాలుగాను మిగిలిపోతుంది. కానీ ఖాళీ సమాధినీ, సమాధిలో పడివున్న నారవస్త్రాల్నీ చూచి కూడా పేతురు ఏం జరిగింతో అర్థం చేసుకోలేకపోయాడు. బహుశా క్షణకాలం "ఏం జరిగి ఉంటుందబ్బా" అనుకుని "ఆశ్చర్యపోయి" ఉంటాడు (చూడండి, లూకా 24:12).

అయితే - యేసు ప్రేమించిన శిష్యుడు, యేసు ప్రేమను చవిచూచిన శిష్యుడు (యోహాను) మాత్రం - యేసు సశరీరుడుగా (శరీరంతో సహా పునరుత్థానుడయ్యారని (జీవంతో లేచాడని) అర్థం చేసుకోగలిగాడు. దీనిని బట్టి మనం గ్రహించవలసింది ఏమిటంటే - పునరుత్థానుడైన యేసును కనుగొనాలంటే ఆయన ప్రేమను వ్యక్తిగతంగా తెలుసుకొనగల పవిత్రాత్మను మనం కలిగి ఉండాలి.

యేసు ప్రేమించిన శిష్యుడు (యోహాను) - వ్యక్తిగతంగా ఆయన ప్రేమాభిమానాలను పొందినవాడు, ఆయన అంతరంగాన్ని అర్థం చేసుకున్నవాడు; గనుకనే అతడు "ముందుగ సమాధి యొద్దకు" చేరాడు. చూచిన వెంటనే నమ్మాడు (20:4,8). యేసు పునరుత్థానాన్ని గ్రహించగలిగాడు.

మగ్దలా మరియ కూడా యోహాను మాదిరి - "ఖాళీ సమాధి"ని యేసు ప్రేమ సంకేతంగా చూడగలిగినట్లయితే, ఆయన పునరుత్థానుడయ్యారన్న సత్యాన్నీ తానూ విశ్వసించగలిగేది. ఏది ఏమైనా ఆమె నిరాడంబరత, స్వచ్ఛమైన ప్రేమ, అమాయకత్వమే ఆమెను కాపాడింది. ఆమె చూడాలనుకొన్న ప్రభువును చూసింది.

ప్రభువు సెలవిచ్చినట్లు - "చూచి విశ్వసించేవారి కంటె, చూడక విశ్వసించే వారే ధన్యులు" (యోహాను 20:29)

పునరుత్థానాన్ని నిర్ధారణ చేసికోవడానికి శిష్యులు యెరూషలేముకు వెళ్ళడం గమనించాలి. ఖాళీసమాధి తేలికగా తీసిపారవేసే విషయం కాదు. యూదుల రోమనుల సంప్రదాయాలు కూడా ఖాళీ సమాధిని గుర్తిస్తున్నాయి. యూదయ చరిత్రకారుడైన యేసేపుస్ ఫ్లేవియస్ మొదలుకొని 5వ శతాబ్దపు యూదయా

గ్రంథాల వరకు ఈ విషయాన్ని వెల్లడించాయి. శత్రుత్వమున్న వర్గం నుండి ఈ విధమైన ఆధారాలు లభించడం చాలా అరుదని, ఇవే చరిత్ర ఆధారాలకు గట్టి పునాదులని డాక్టర్ పాల్ మయ్యర్ అనే పండితుని అభిప్రాయం. నిజమేకదా! తమవైపులేని సత్యాన్ని గుర్తించడం, ఆ సత్యం యొక్క యోగ్యతను గొప్పతనాన్ని సూచిస్తుంది. గమాలియేలు యూదయా చట్టసభలో ఒక సభ్యుడు. ఆయన ప్రకారం క్రైస్తవ మతం దేవుని క్రియ. ఈ విషయమే ఆయన పదే పదే తన తోటి సభ్యులకు చెప్పాడు. యేసు పురుత్థానమైన తరువాత అతను కల్పించుకొని యేసు గొప్పతనాన్ని,, దివ్యత్వాన్ని తనతోటి సభ్యులకు వివరించాడు. ఒకవేళ సమాధిలో యేసు మృతదేహం ఉండి వుంటే ఇంత ధైర్యం అతనికి వచ్చి ఉండేది కాదు. అలాగే యూదయ నాయకులకు ఆయన శరీరం ఎక్కడ ఉండేది తెలిసి ఉంటే దాన్నెలగయినా తీసుకొచ్చి, శిష్యుల నోళ్ళు మూయించేవాళ్ళే. పై కారణాలను బట్టి, అరిమత్తయి తనకోసం నిర్మించుకొన్న సమాధి, ప్రభువు మృతదేహాన్ని తనలో ఇముడ్చుకొన్నాక, ఖాళీ పడింది. ఇంతవరకు, ఈ సత్యాన్ని నిరాధారమని, అర్థరహితమని నిరూపించిన వారు లేరుగాకలేరు. ఇది యదార్థమని చెప్పినవారు ఎంతో మంది ఉన్నారు. యదార్థం కాదని నిరూపించేవారే లేరు.

## తొలగించబడిన బండరాయి

ఆదివారం ఉదయం, సమాధియొద్దకు వచ్చిన వారందరికి కొట్టొచ్చినట్లు కనిపించిన విషయం, బండరాయి తొలగించబడి ఉండటం. యూదయ సమాధులు గుహల్లా ఉంటాయి. శరీరాన్ని లోపల ఉంచింతరువాత, గృహద్వారానికి ఒక పెద్ద బండరాతిని ఉంచుతారు. లాజరు విషయంలో ఇటువంటి రాయి ప్రస్తావించ బడింది. ఈ రాయి దాదాపు ఒకటిన్నరటన్ను బరువు ఉంటుంది. ఈ రాతిని ప్రక్కకు జరుపాలేగాని ఎత్తివేయడానికి వీలుండదు. స్త్రీలు ఈ రాయిని తొలగింపలేరు గనుకనే “సమాధి ద్వారమునుండి ఆ బండను తొలగించి మనకు ఎవరు తోడ్పడుదురు” అని స్త్రీలు ఒకరితోనొకరు చెప్పుకున్నారు (మార్కు 16:3). మరి ఇంత పెద్ద రాతిని తొలగించడం, తొలగించేప్పుడు కావలివారి కళ్ళుగప్పడం సాధ్యంకాదు. కాబట్టి ఇక్కడ

ఖచ్చితమైన ప్రణాళికా ప్రకారం బండరాయి ప్రక్కకు తొలగించబడింది. ఒకవేళ మనుషులు చేసి ఉంటే కావలివారి దృష్టి నుండి తప్పించుకోవడం సాధ్యం కాదు. దైవీకమైన విషయమేదో ఇక్కడ జరిగిందని బండరాయే సాక్షిగా నిలుస్తోంది.

## కావలివారి ఆందోళన

కావలివారు, రోమను సైనికులు. క్రమశిక్షనకు, బాధ్యతాయుత ప్రవర్తనకు వారు పెట్టింది పేరు. ఇక్కడ వారి నిర్లక్ష్యాన్ని, బాధ్యతారాహిత్యాన్ని శంకించలేం. ఎందుకంటే వారి క్రమశిక్షణా నిబంధనలను బట్టి, తప్పుచేసిన వారికి శిక్షలు తీవ్రస్థాయిలో ఉండేవి. అవి దాదాపు మరణశిక్షలుగా ఉండేవి. తమ ఉన్నతాధికారుల ఆగ్రహం, మరణశిక్షలు, తమ బాధ్యతలను భయంగా క్రమంగా చేసుకొనేందుకు తోడ్పడేవి. నిర్లక్ష్యంగాని, తప్పుగాని చేసిన సైనికున్ని ఈ విధంగా శిక్షిస్తారు. మొదట అతని బట్ట తీసి కాల్చివేస్తారు. ఆ తరువాత అతన్ని కాలే మంటలలో వేస్తారు. అందరిలో తప్పు చేసినవాడెవరో తెలియకపోతే చీట్లు వేసి మరీ శిక్షించేవాళ్ళు. పై కారణాలను బట్టి సైనికులు అందరూ అప్రమత్తంగా ఉంటారన్నది తిరుగులేని సత్యం. ఈ నిషూ రాత్రివేళ ఇంకా జాగ్రత్తగా చేసేవాళ్ళు. ఎందుకంటే నేరాలు చీకటిలో జరుగుతాయి కాబట్టి. కనుక వచ్చే శిక్షలను దృష్టిలో ఉంచుకొని సైనికులు సమాధి విషయంలో నిర్లక్ష్యంగా ఉంటారనడంలో అర్థం లేదు. వారు తప్పుచేయలేదు కాబట్టే పారిపోకుండా ధైర్యంగా వెళ్ళి అధికారులతో చెప్పుకొన్నారు (మత్తయి 28:11)

## భూస్థాపన వస్త్రాలు

ఒక విధంగా సమాధి పూర్తిగా ఖాళీగా లేదు. యోహానును మొదట ఆకట్టుకొన్నది ఖాళీ సమాధి కాదు. అందులో చక్కగా అమర్చిన నార వస్త్రాలు. భూస్థాపనకు కొన్ని వస్త్రాలు ఉపయోగిస్తారు. యేసు శరీరానికి ఉపయోగించిన వస్త్రాలు తాను వదలి వెళ్ళినట్లుగా కనిపించాయి. అప్పుడే పడక మీద నుండి విశ్రాంతి తీసుకొని లేచిన వ్యక్తి, సంస్కారవంతంగా వస్త్రాలను ఒక ప్రక్కగా అమర్చినట్లు వాళ్ళు గమనించారు. శరీరానికి చుట్టిన వస్త్రాలు మాత్రం ఖాళీగా ఉన్నాయి. శరీరం అందులో లేదు. తలకు చుట్టిన గుడ్డమాత్రం చక్కగా మడిచి

ఒక ప్రక్కగా అమర్చిన విధానం యోహానును ఆకట్టుకొంది. దాన్ని గురించి అతను ప్రత్యేకంగా ప్రస్తావించడం ముచ్చట గొలుపుతుంది: "ఆయన తలకు చుట్టిన తుండుగుడ్డ... నారవస్త్రములతో పాటు కాక, విడిగ చుట్టి ఉంచబడెను" (యోహా 20:7). ఈ వస్త్రాలు ప్రభువు ఏదో సంకేతాన్ని విడిచి వెళ్లినట్లుగా ఉండటం గమనార్హం.

ప్రేమగలవారు తాము ప్రేమించేవారికి కొన్ని సంకేతాలను పంపుతారు. అవి వారి ప్రేమను వెల్లడిస్తాయి. ఈ నారవస్త్రాలు ఏదో సంకేతాన్ని శిష్యులకిస్తోంది. యేసును గాఢంగా ప్రేమించిన శిష్యుడే, ఈ సంకేతాలను అర్థం చేసికోగలిగాడు. అందుకే పునరుత్థానాన్ని అర్థం చేసికోవడానికి యోహానుకు అంత కష్టమనిపించలేదు.

## సజీవసాక్షాలు

ఈ క్రింది వచనాలు సాక్షాత్తు పౌలు వ్రాసుకొన్నవి. గమనించండి :

"... క్రీస్తు మన పాపముల కొరకై మరణించెను. పరిశుద్ధ గ్రంథముతో వ్రాయబడినట్లు ఆయన సమాధి చేయబడి, మూడవ దినమున సజీవుడై లేవనెత్తబడెను. ఆయన పేతురునకు తదుపరి పండ్రెండు మంది అపోస్తులులకు కనపడెను. పిమ్మట ఆయన ఒకే పర్యాయము తన అనుచరులలో ఐదువందల మందికి పైగా కనపడెను. వారిలో కొందరు మరణించిన పెక్కుమంది జీవించే ఉన్నారు. ఆ పైన యాకోబునకును తదుపరి అపోస్తులుల కందరికిని ఆయన కనపడెను. అకాలమందు జన్మించినట్లున్న వాడనైనను చివరకు నాకును ఆయన దర్శమిచ్చెను" (1 కొరింతీ 15:3-8).

పౌలు ఈ మాటలు వ్రాసేసరికి ఆయన ప్రస్తావించిన వారిలో కొందరైనా బ్రతికి ఉండాలి. నిజానిజాలేమిటో ప్రజలు వారినుండి తెలిసికొని ఉంటారు. ఇక్కడ ఆయన్ను చూచిన వారి సంఖ్య అధికంగా ఉంది. ఇది నాలుగు గోడల మధ్య జరిగినతంతు కాదు. బహిరంగంగా అందరి ఎందుటా జరిగిన దర్శనం. పునరుత్థాన క్రీస్తు ఇంతమందికి కనుపించాడు గనుకనే ఆయన 'సజీవుడు' అన్నాడు పౌలు. మగ్దల మరియ ఓ అమాయకపు స్త్రీ. ఆమెకు తెలిసింది కేవలం తనను క్షమించిన క్రీస్తు. ఆమెకు పునరుత్థానం గురించి ఏమీ తెలిసినట్లు

లేదు. సమాధి మీద రాయి తీసివేయబడుటను మాత్రమే ఆమె చూసింది (యోహాను. 20:1). బహుశా శత్రువులు ప్రభువును సమాధి నుండి ఎత్తుకొని పోయారనుకొంది (20:1). అసలు ప్రబువు పునరుత్థానుడవుతారనె ఆలోచనే ఆమెకు ఉన్నట్లు లేదు. అటువంటి స్త్రీ, క్రీస్తు కనుపించగానే 'రబ్బూనీ' (బోధకుడా!) అంటూ ఆయన జీవించి ఉన్నట్లే ఆయన్ను సంబోధించింది. పునరుత్థానానికి అంత సజీవ లక్షణం లేకపోతే, ఓ సాధారణ స్త్రీ అలా గుర్తించి ఉండేది కాదు. ఇలాంటి సంఘటనలెన్నో పునరుత్థాన సంఘటనలలో కనిపిస్తాయి.

# 2. దివ్యకారుణ్య మహోత్సవము

- బ్రదర్ కొమ్మెర పవన్ &
బ్రదర్ కాసు అఖిల్



## ఉపోద్ఘాతం

దివ్యకారుణ్య మహోత్సవాన్ని పాస్కా ఉత్సవము తరువాత రెండవ ఆదివారం కొనియాడుతాము. ఇది కథోలికులు ఎక్కువగా జరుపుకనే మతపరమైన ఆచారం. ఈ పండుగ క్రైస్తవ విశ్వాసాన్ని ప్రతిబింబించే మఖ్యమైన పండుగ. పునీత రెండవ జాన్‌పాల్ పాపుగారు చెప్పినట్లుగా, "ఇది సిలువ వేయబడిన క్రీస్తు హృదయం వలన మనలను చేరుకోవడం ద్వారా మనం దైవిక దయతో ఆశీర్వాదింపబడిన సమయం". క్రీస్తు ప్రభుని కారుణ్య ఆదివారం ప్రభుని మరణం, భూస్థాపితం మరియు పునరుత్థానం నుండి ప్రవహించిన కృపావరములపై, ఫలములపై దృష్టిపెడుతుంది. క్రీస్తు ప్రభునికి ద్రోహముగ ఈ లోకము ఆయనను మోసగించి, ముద్దుపెట్టినను, మరణానికి గురిచేసినను ఆయన అంతులేని, అపారమైన ప్రేమ మాత్రం మనలను విడిచిపెట్టలేదు. ప్రభుని కారుణ్యం వెల్లువలై పొంగి పొరలింది. ఎందుకంటే "నేను నీ పేరు నా అరచేతుల మీద చెక్కుకొంటిని. నీ ప్రాకారములు నిత్యము నా కన్నుల ఎదుట నిలిచియున్నవి" అని ఆయనే వివరించాడు (యెషయా 49:16). క్రీస్తుని మనం బలికోరాము. ఆయన పతానాన్ని, దుర్భలస్థితిని, చూసి ఆనందపడ్డాము. పై శాచికమగు మన పాపపు హృదయాలు బలికోరుకుంటే ప్రభువు మాత్రము "నేను మీ నుండి కోరునది కారుణ్యమునేగాని, బలులుకాదు" అని పలికారు (హోషే 6:6). ఇంతటి మహోగొప్ప హృదయం కాలవాడు క్రీస్తునాదుడు. సైనికుడు ఆయన ప్రక్కన పొడవగ రక్తము, నీరు ధారలుగా ప్రవహించింది. రక్తము, నీరు దైవ, మానవ

సంబంధంగా మారిపోయాయి. చరిత్రకు అర్థంకాని, చరిత్ర పుటలు గుర్తించలేనిది ఏమిటంటే మరణించే సమయంలో కూడా కారుణ్య క్షమను వ్యక్తపరిచిన మృదుస్వాభావి, నిర్మల హృదయుడు క్రీస్తు ప్రభువు అని. ఈ పండుగను కొనియాడుతూ ప్రభుని ప్రేమను, కారుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెబుదాం.

**దివ్యకారుణ్య ఆదివారం యొక్క చరిత్ర :** దివ్యకారుణ్య ఆదివారం కథ వేల సంవత్సరాల నాటిది. అయితే, ఈరోజుకు అధికారిక గుర్తింపు 2000లో వాటికన్ ద్వారా మాత్రమే ప్రామాణికరించబడింది. పునీత రెండవ జాన్‌పాల్ పాపుగారు పాస్కా మహోత్సవం తరువత వచ్చే ఆదివారాన్ని "దివ్యకారుణ్య ఆదివారంగా" ప్రకటించారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా కతోలికుల మతపరమైన ఆచారంగా జనరల్ రోమన్ క్యాలెండర్‌లో గుర్తించబడింది.

క్రీస్తునుండి స్వయంగా దర్శనాలను అనుభవించిన ఒక పోలిష్ మఠకన్యక అయిన పునీత ఫౌస్టినా కోవాల్స్కకు, ఈ ప్రత్యేక దినాన్ని అపాదించవచ్చు. ఎందుకంటే ఈమె దివ్యకారుణ్య అపోస్తురాలు. దివ్యకారుణ్య ఆదివారం అనేది దేవుని ప్రేమ మరియు యేసు అంగీకారానికి అనర్హులుగా భావించే వారి కోసం ప్రత్యేకంగా నియమించబడిన స్థలం. ఫౌస్టినమ్మగారికి ఒక దర్శనంలో, ప్రభువు ఇలా అంటున్నారు. "నా కారుణ్య కొలను వద్దకు చేరుకొనే వారిపై నేను దయతో కూడిన మొత్తం సముద్రాన్ని కురుపిస్తాను". దివ్యకారుణ్య ఆదివారం, దాని ఆగమనం నుండి, విశ్వాసం మరియు దేవుని దయతో నిండి ఉంది. ఇది జీవితంలోని అన్ని వర్గాల ప్రజలు దేవుని ముందు తమను తాము వినయాత్ములు కావడానికి మరియు అతని దయ, ప్రేమ మరియు క్షమాపణ కోసం అడగడానికి ఒక నిర్దిష్ట రోజును అందిస్తుంది, నోరార ప్రభుని దివ్యకారుణ్య క్షమకై వేడిన వారికి తన ప్రేమనంతటిని క్రుమ్మరించి క్షమాపణను నిండుగ అనుగ్రహిస్తాడు ప్రభువు.

**దివ్యకారుణ్య చిత్రపటం :** దివ్యకారుణ్య చిత్రపటం అనేది పునీత పౌస్టినమ్మగారి చేత ప్రారంబించబడిన భక్తిపై అధారపడిన యేసు క్రీస్తు యొక్క చిత్రం ఫౌస్టినమ్మగారి, డైరి ప్రకారం, యేసు ప్రభువు అమెతో ఇలా అన్నారు: "ఈ

స్వరూపాన్ని పూజించే ఆత్మ నశించదని నేను వాగ్ధానం చేస్తున్నాను. ఇప్పటికే ఇక్కడ భూమిపై ఉన్న శత్రువులపై విజయం చేకురుస్తాను". మరి ముఖ్యంగా మరణసమయంలో, నేను వారిని రక్షించి, మహిమ పరుచుకుంటాను అని పలికారు (డైరి 48). చాలా రకాల చిత్రపటాలలో, యేసు ప్రభువు తన కుడి చేతిని ఆశీర్వదిస్తున్నట్లుగా మరియు ఎడమ చేతిలో పవిత్ర హృదయాన్ని చూపుతున్నట్లు చూపబడింది. దాని నుండి రెండు కిరణాలు ప్రవహిస్తాయి. ఒకటి ఎరుపు రెండవది లేతవర్ణపు తెలుపు. క్రింద, "యేసువా నేను మిమ్ము నమ్ముచున్నాను," అని లిఖించబడింది. ప్రవహించే రెండు కిరణాలు గొప్ప అంతర్థాన్ని కలిగి ఉన్నాయి. యేసు రక్తాన్ని ఎరుపు, మరియు నీటిని లేత తెలుపుగా చెప్పవచ్చు. మొత్తం చిత్రం క్రీస్తు ప్రభుని దాతృత్వం, క్షమాపణ మరియు ప్రేమకు సంకేతంగా ఉన్నాయి.

**చిత్రం యొక్క భక్తి ప్రాముఖ్యత :** ఈ చిత్రం యొక్క గొప్పతనం రంగు యొక్క అందంలో లేదా కుంచెలో లేదు, కాని నా దయలో ఉంది, అని ప్రభువు ఫౌస్టినమ్మగారితో పలికియున్నారు.

ఫౌస్టినమ్మగారికి ఏప్రిల్, 2000వ సంవత్సరంలో పునీత పట్టం వచ్చిన తరువాత, క్రీస్తు ప్రభువు దైవకారుణ్యం పట్ల దివ్యకారుణ్య చిత్రం పట్ల భక్తిపెరిగింది. ఫౌస్టినమ్మగారి సందేశానికి, భక్తికి పెద్ద సంఖ్యలో బలం పెరిగింది. పౌస్టినగారి డైరిలో ఉన్న దివ్యకారుణ్య చిత్రంలోని రెండు కిరణాలు జీవితానికి, మోక్షానికి సంబంధించినవి. కతోలిక విశ్వాసంలో దివ్యకారుణ్య చిత్రపటం అనేది దయకు ద్వారంగా నిలుస్తుంది.

## దివ్యకారుణ్య ప్రార్థన చేసేవారందరికీ క్రీస్తు ప్రభువు ఒసగు వాగ్దానములు

1. ఈ దివ్యకారుణ్య ప్రతిమను గౌరవించే ఆత్మ నశించదని నేను వాగ్ధానం చేస్తున్నాను. అలాగే ఇప్పటికే భూమిపై ఉన్న శుత్రువులపై విజయం పసాదిస్తానని. ముఖ్యంగా మరణ సమయంలో ప్రసాదిస్తానని, వాగ్ధానం చెస్తున్నాను.
2. నా హృదయాన్ని సిలువపై ఈటెతో తెరిచినప్పుడు, ఆ సున్నిత దయ యొక్క లోతు నుండి వెలువడిన ఈ రెండు కిరణాలు, రక్తం మరియు, నీటిని సూచిస్తాయి. ఈ కిరణాలు, నా తండ్రి కోపం నుండి సకల ఆత్మలను

రక్షించాయి. ఉత్థాన పండుగ తర్వాత మొదటి ఆదివారం దివ్యకారుణ్య పండుగ ఉండాలని నేను కోరుకుంటున్నను. ఈ రోజున జీవ జలాల వద్దకు చేరుకునే వ్యక్తికి పాపాలు మరియు శిక్షల నుండి పూర్తి విముక్తి లభిస్తుంది.

3. దివ్యకారుణ్య పండుగ ఘనంగా ఉత్థాన పండుగ తర్వాత మొదటి ఆదివారం జరగాలని, ఆ రోజు పాపసంకీర్తనము చేసి దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించే ఆత్మలకు పాపములు ద్వారా కలుగు శిక్షనుండి క్షమాపణ దయచేస్తాను.
4. ఎవరు ఈ దివ్యకారుణ్య జపాన్ని జపిస్తారో, వారు మరణ సమయంలో గొప్ప దయను పొందుతారు.
5. గురువులు, పాపులకు మోక్షం పొందుటకు చివరి ఆశగా దివ్యకారుణ్య జపాన్ని ఫార్సు చేయాలి. ఎంతటి పాపస్థితిలో ఉన్న పాపి అయినప్పటికి, ఒకసారియైన దివ్యకారుణ్య ప్రార్థిన చేసినట్లైతే, నా అనంతమైన దయ నుండి అనుగ్రహన్ని పొందగలడు. నా దయను, కనికరముల నమ్ము కున్న ఆత్మలు ఉహించలేని కృపావరములు పొందుతాయి.
6. నా కృప దివ్యకారుణ్య ప్రార్థనను చేసే ఆత్మలకు, వారి జీవిత సమయంలో మరియు ముఖ్యంగా వారి మరణ సమయాలో వారిని నా హత్తుకు చేర్చుకుంటాను.
7. నా దివ్యకారుణ్య గౌరవాన్ని వ్యాప్తి చేసే ఆత్మలకు (మనుషులు) నేను ఒక న్యాయముర్తిని కాదు, దయగల రక్షకుణ్ణి.
8. నాకు అత్యంత సంతోషకరమైన ప్రార్థన పాపుల పరివర్తన కోసం చేసే ప్రార్థన. నా కుమార్తె! ఈ ప్రార్థన నాకు ఎల్లప్పుడు వినబడుతుంది మరియు సమాధానం ఇవ్వబడుతుంది.
9. నా దయ మీ పాపముల కంటెను మరియు ప్రపంచం మొత్తం చేసే పాపములకుంటెను గొప్పది.
10. నా దయను ప్రకటించి, కీర్తించే గురువులకు, నేను అద్భుతమైన శక్తిని ఇస్తాను, నేను వారి మాటలను అభిషేకం చేస్తాను మరియు వారు ఎవరితో మాట్లాడతారో వారి హృదయాలను హత్తుకుంటాను.

11. మీరు ఈ ప్రార్థన ద్వారా కోరినది నా చిత్తానికి అనుగుణంగా ఉంటే, ఈ ప్రార్థనలో అడిగిన ప్రతిదీ పొందుతారు.
12. ఈ ప్రార్థనను, కఠినమైన పాపులు చేసినప్పుడు, నేను వారి ఆత్మలను శాంతితో నింపుతాను, మరియ వారి మరణ సమయాల్లో వారిని ఆదుకుంటాను.
13. చనిపోతున్న వారి సమక్షంలో వారు ఈ ప్రార్థనను చెప్పినప్పుడు, నేను నా తండ్రికి మరియు మరణిస్తున్న వ్యక్తికి మధ్య న్యాయమూర్తిగా కాకుండా, దయగల రక్షకునిగా నిలబడతాను.
14. మూడు గంటల సమయంలో, నా దయ కోసం ప్రాదేయపడండి, అతిముఖ్యంగా పాపులకోసం ప్రార్థించండి. మరియు, కొద్ది క్షణాలు నీవు, నా శ్రమలు, దుఖ్ఖంలో ఇమడకలిగినట్లైతే, నా శ్రమల ద్వారా నీవు చేసిన ఏ మనవిని నేను తిరస్కరించను.

**ఎవరైతే దివ్యకారుణ్య భక్తిని పెంపొందించుకొని జీవిస్తారో, వారు పొందే వాగ్ధానాలు: ఇవి పౌస్టినమ్మగారి డైరీలో వ్రాయబడ్డాయి.**

## దివ్యకారుణ్య క్రియలు

మీ తండ్రి వలె మీరును కనికరము గలవారైయుండుడు (లూకా 6:36). మనము దేవుని దయను పొందటమే కాదు, ఆ దయను మన క్రియలు ద్వారా మాటల ద్వారా మరియు మన ప్రార్థనల ద్వారా చూపించాలి. అవే భౌతిక కారుణ్య క్రియలు, ఆధ్యాత్మిక కారుణ్య క్రియలు. క్రీస్తు ప్రభువు, "ఈ కారుణ్య క్రియలను చేయుడు" అని పిలుచుచున్నాడు, ఎందుకన క్రియలు లేని విశ్వాసము నిర్జీవము.

## భౌతిక కారుణ్య క్రియలు - (మత్తయి 25:34-40)

1. ఆకలిగొన్నవారికి అన్నము పెట్టుట
2. దాహము గొన్నవారికి దాహము తీర్చుట
3. వస్త్రము లేనివారికి వస్త్రమునిచ్చుట
4. పరదేశులను ఆదరించుట

5. వ్యాధిగ్రస్తులను పరామర్శించుట
6. చెరసాలలోనుండు వారలను సందర్శించుట
7. చనిపోయిన వారలను భూస్థాపనము చేయుట

**ఆధ్యాత్మిక కారుణ్య క్రియలు**

1. సందేహించువారల సందేహము తీర్చుట (1 పేతురు 3:15).
2. వేద సత్యములు తెలియని వారలకు వానిని నేర్పుట (1 తెస్స 2:3-4).
3. పాపాత్ముల మనస్సు త్రిప్పుట (1 తెస్స 17-18).
4. కష్టాలలో ఉన్నవారిని ఓదార్చుట (1 తెస్స 3:3).
5. నిందించెడు వారలను మన్నించుట (2 తెస్స 3:14-15).
6. కష్టపెట్టు వారలను ఓర్పుతో సహించుట (2 తెస్స 3:16).
7. జీవించువారల కొరకు, చనిపోయిన వారల కొరకు ప్రార్థించుట (1 తెస్స 4:16)

## పాత నిబంధనలో దేవుని కారుణ్యము

పాతనిబంధనలో, మొట్టమొదటగా యావే ప్రభువు యిస్రాయేలు ప్రజలను, ఐగుప్తుబానిసత్వం నుండి తన దయ, కనికరము, ద్వారా వారిని విముక్తులను చేస్తాడు. మరి ఆ దేవుని కారుణ్యం ఎంత గొప్పదంటే ఆ దయగల దేవుడే మోషేను పిలిచి, "ఐగుప్తు దేశములో నా ప్రజలు అనుభవించు బాధలు కన్నులారా చూచితిని. ఐగుప్తుయుల బారి నుండి విడిపింపుమని వారు చేసిన మనవి వింటిని. వారు పడు పాట్లు గుర్తించితిని. ఐగుప్తు దేశీయుల ఇనుప పిడికెళ్ల నుండి వారిని విడిపించుటకై క్రిందికి దిగివచ్చితిని" (నిర్గమ 3:7-17). కాని యిస్రాయేలు ప్రజలు దేవుని కారుణ్యానికి కృతజ్ఞులుగా, నమ్మకస్తులుగా జీవించలేదు. అంతేకాదు అన్యదైవాలను పూజించి నమ్మక ద్రోహాన్ని తలబెట్టారు. అయితే ఆ యావే దేవుని దయ తన ప్రజల నమ్మక ద్రోహాన్ని క్షమించడంలో ఎప్పుడు వెనుకంజవేయలేదు ఎందుకంటే "ప్రభువు! ప్రభువు! ఆయన కరుణామయుడు, దయాపరుడైన దేవుడు సులభముగా కోపపడువాడుకాడు. స్థిర ప్రేమయందు విశ్వాసమందు అనంతుడు. ఆయన వేయితరముల వరకు

తన స్థిర ప్రేమను చూపువాడు. దోషములను, అపరాధములను, పాపములను మన్నించువాడు" (నిర్గమ 34:6–7). ఈ వచనాలు ఎంత ముఖ్యమైనవి అంటే పాత నిబంధనలో ఆరు సార్లు వివిధ రూపాల్లో పునరావృత మవుతాయి (కీర్తన 86:15, 103:8, 145:8, నెహ 9:17, యోనా 4:2). అబ్రహాము, ఇస్సాకు, యాకోబును పిలిచిన ఆ దేవుడు. వారి వంశాన్ని, ఒక మహాజాతిగా, ఆశీర్వదిస్తాను అని పలికిన దేవుడు, వారు (యిస్రాయేలు ప్రజలు) చేసిన ఘోరమైన పాపాలకు బందీలుగా అన్యదేశాలలోకి కొనిపోబడినప్పటికీ, వారిని ఎన్నటికీ విడిచిపెట్టలేదు.

## నూతన నిబంధనలో దేవుని కారుణ్యము

"మన యేసుక్రీస్తు ప్రభువు తండ్రియగు దేవునకు స్తుతులను అర్పింతము. మన తండ్రి కృపామూర్తి. ఆ దేవుని నుండియే ఆదరణ సర్వదా మనకు లభించును" అని పౌలు తన కృతజ్ఞతలను అర్పిస్తున్నాడు (2 కొరింతీ 1:3). ఎందుకనగా, దేవుడు లోకమును ఎంతో ప్రేమించి, తన ఏకైక కుమారుని ప్రసాదించెను. ఆయనను విశ్వసించు, ప్రతివాడును నాశనము చెందక నిత్య జీవమును పొందుటకై అట్లు చేసేను (యోహాను 3:16). మన దేవుని కృప అపారము. మన పట్ల ఆయన ప్రేమ అమితము. కనుకనే అపరాధముల వలన ఆధ్యాత్మికముగా నిర్జీవులమై ఉన్న మనలను, క్రీస్తుతో ఆయన పునర్జీవులను చేసేను. ఆయన కృప, కనికరము వలననే మనము రక్షింపబడితిమి. మరి ఆ కృపా, కనికరములు (దయ) ఇప్పుడు వచ్చినవి. కావు, మన పితరులు అబ్రహాము, ఇసాకు, యాకోబులకు వాగ్ధానము చేసినవి కేవలము యిస్రాయేలీయులకే కాకుండా, సకల జాతి ప్రజలకు ఆయన కనికరము వలన కలుగు రక్షణము లభిస్తుంది.

పునీత పౌలుగారు ఆది క్రైస్తవులను హింసించడంలో ప్రదాన దోషిగా ఉన్నపటికి దేవుని దయను పొందుకొని, ఒక నూతన జీవితమును ప్రారంభించాడు. ప్రారంభించడమే కాకుండా, "క్రీస్తుని భోదించడంలో ఒక సుమాతృకగా నిలిచాడు. ఎందుకనగా మృతులలో నుండి యేసు క్రీస్తును, ఆయన పునరుత్థాన మొనరించి, దాని మూలమున మనకు నూత్న జీవమును

ప్రసాదించెను, విశిష్టమగు ఆయన కనికరమే దీనికి కారణము" (1 పేతురు 1:34). దేవుడు తన ప్రజల కొరకై ఏర్పరచిన దీవెనలు మహత్తరమైనవి. కనుకనే, వానిని పొందుటకు మనము ఎదురు చూచెదము. ఆయన వానిని మీ కొరకై పరలోకములో భద్రపరచెను. అట అవి క్షీణించవు, చెడవు, నాశనము కావు. నిత్య ప్రధాన యాజకుడైన క్రీస్తు ప్రభువు ద్వారా ఆ దీవెనలను మనం పొందవచ్చు. ఎన్నుకోబడిన జాతిగా, రాచరీకపు యాజక బృందముగా, పవిత్రమైన జనముగా, దేవుని సొంత ప్రజలుగా దేవుని అద్భుత కార్యములను ప్రకటింప ఏర్పరుపబడిన వారిగా ఆయన మనలను చేసెను కాబట్టి చీకటి నుండి అద్భుతమైన వెలుగు లోనికి పిలిచి, ఆయన దయకు, దీవెనలకు మనలను పాత్రులుగా చేసెను. మానవజాతి, పాపకూపంలో పడిపోయినప్పటికీ, అందులోంచి మానవ జాతిని రక్షించుటకు దేవుడు చూపు శ్రద్ధలో ఆయన ప్రేమ తేటతెల్లం అవుతుంది. అది క్రీస్తు ప్రభువు మోసిన శిలువ ద్వారా అర్థమవుతుంది. ఆ క్రీస్తు ప్రభువు సిలువే మన పాపములకు మనింపుని దయచేసింది, మనలో నూతన జీవితాన్ని ప్రసాదించింది.

**దివ్యకారుణ్య పరిమళం వెదజల్లుట** (యోహాను 8:1-11) : వ్యభిచారంలో పట్టుబడిన స్త్రీ సమాజ దృష్టిలో పాపిగ పరిగణింపబడింది. కనీసం అమెపై కనికరం లేనివారు హింసాత్మకమైన శిక్షను విధించి చంపివేయాలని తలంచారు. కాని క్రీస్తు ప్రభువు అమెపై కరుణనుచూపాడు. ఆమెను కారుణ్య ప్రేమతో నింపాడు. తద్వారా అమె పాపము చేయక తాను పొందిన పరిమళ కారుణ్యమును పంచింది (లూకా 19:1-10). అప్పటిదాక జక్కయ్యను అందరు ఒక పాపిగ పరిగణించారు. ప్రభువు ఆయన గృహ ద్వారములు చెరగానే పశ్చాతాపంతో ద్రవింబడిన హృదయం తాను ఎవరి దగ్గరైతే మోసంతో, అన్యాయంతో డబ్బును సంపాదించాడో దానికి రెట్టింపుగ తిరిగి ఇస్తూ కారుణ్య పరిమళం వెదజల్లాడు.

## ముగింపు

**దివ్యకారుణ్య సందేశం :** దివ్యకారుణ్య ప్రభువు తన సందేశాన్ని మూడు భాగాలుగ తెలియజేస్తున్నారు. దానిని తప్పక పాటించినచో ఆయన ప్రేమను మనం సముద్రమంత ప్రేమను పొందగలము.

1. ప్రభుని దయ, కారుణ్యం కోసం ప్రార్థించాలి. మన స్థితి గతులను అయనకు అర్పించి అర్థించాలి. మన పాపాల గురించి పశ్చాత్తాపడుతూ, మనపై మరియు ప్రపంచం మొత్తం మీద తన దయను కుమ్మరించమని కొరుతూ నిరంతరం ప్రార్థనలో ఆయునను సంప్రదించాలని ప్రభువు కొరుకుంటున్నారు. శిలువ మీద దొంగవాడు తన పరిస్థితిని ఎరిగి, పాపానికి పశ్చాతాపడి అర్థించి ప్రభువు కనికరాన్ని కారుణ్యన్ని రుచి చూశాడు. అందుకే దివ్యకారుణ్య సందేశం మనల్ని ప్రార్థించమని, పశ్చాత్తాపపడమని సందేశాన్నిస్తుంది.
2. ప్రభువు తన దయను మనపై కురిపించమని వేడుకోవాలి. అయన దయకు నోచుకొని దానిని పొందిన మనము, మన ద్వారా ఇతరులకు ప్రవహింపజేయమని ప్రభువు కొరుకుంటున్నారు. ప్రభువు మనపై కరుణను, ప్రేమను కురిపించారు, తద్వారా మనము కూడా ఇతరులకు ప్రేమ, మరియు క్షమాపణను అందించాలని కొరుకుంటున్నారు, మనం ప్రభుని నుండి దేనినైతే ఉచితంగ స్వీకరించామో, దానిని పొరుగువారికి అందించాలి. అప్పడే దివ్యకారుణ్యం మరింత ఎక్కువగ విరాజిల్లుతుంది.
3. యేసు ప్రభుని పరిపూర్తిగా నమ్మండి. మన జీవితాలు అయన దయ, కృప పైన అధారపడి ఉన్నాయని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఆయన కోరుకుంటున్నారు. ప్రభుని ఎంత ఎక్కువగా విశ్వసిస్తామో, అంత ఎక్కువగ పొందుతాము. ఇంత గొప్ప సందేశం దైవీక దయగా, కారుణ్యంగా పునీత ఫౌస్టైనమ్మగారి డైరి నుండి పొందియున్నాము. అమె తన జీవితంలోని కారుణ్య ప్రభుని తన ఆధ్యాత్మిక గురువుతో పంచుకుంటూ 600 పేజిలలో తన డైరిని పొందుపరిచింది. ప్రభుని దయ, కనికరం ప్రతి ఒక్కరికి అత్యవసరం. అప్రభుని కారుణ్య సముద్రంలో మునిగి కారుణ్యానికి ప్రతినిధులుగ మనల్ని మలుచుకోమని దయగల ప్రభువు సందేశం ఇస్తున్నారు.

# 3. యేసు - మంచి కాపరి

- బ్రదర్ పెండెల ఉమేష్ చంద్ర



**ఉపోద్ఘాతం**

**"మంచి కాపరి - మార్గ చూపరి,**
**మార్గ చూపరి - మన్నించే కాపరి,**
**మన్నించే కాపరి - మానవుల కాపరి,**
**మానవుల కాపరి - జీవం ఇచ్చే కాపరి,**
**జీవన కాపరి - రక్షించే కాపరి".**

"మంచి కాపరి" అనే పదం పరిశుద్ధ గ్రంథంలో ఎంతో ప్రాముఖ్యతతో కూడియున్నది, ఎందుకన, జీవన కాపరియైన - మంచి కాపరి యేసు, తాను సమస్తమును అర్పించి, సాక్షత్కారించుకున్నారు. 'నేను మంచి కాపరిని" అనగా దీని అర్ధం మనం లోతుగా ధ్యానించి పరిశీలించినట్లైతే "మంచిని చిగురింపజేస్తూ, కాపుదలలో పదిలపరుస్తూ, రక్షించేవాడు మన ప్రధాన కాపరి యేసు. ఒక రచయిత మంచి కాపరి యేసును స్మరించుకుంటూ ఈ విధంగా రచించాడు: "తల్లి ఇచ్చునా, తండ్రి ఇచ్చునా, మన కోసం ప్రాణం, మంచి కాపరియైన యేసు మాత్రమే ఇచ్చువారు". జీవం అనేది ప్రతి జీవికి ఎంతో విలువ కలది. ఈ మానవ జీవితానికి ఎంతో ప్రాధాన్యత ఉందో స్వయంగా క్రీస్తు ప్రభువు మనకు తన జీవితం ద్వారా ఒక మార్గం చూపించి, తన తండ్రి సన్నిధిని చేరుకొని ఉన్నారు. మరి జ్ఞానస్నానం పొందిన బిడ్డలుగా మనం యేసుని వలె క్రమశిక్షణతో, పవిత్రమైన జీవితం జీవించి ఆయన చూపిన ప్రేమ బాటలో నడుస్తూ, తోటి వారిని గొర్రెల మందలలో చేర్చాలని ప్రభువు మనలను ఆహ్వానిస్తున్నారు. మన దగ్గర ఎధైనా ఉంటేనే, ఇతరులకి ఇవ్వగల్గుతాం. మరి ముందుగా క్రీస్తు మందలలో మనం చోటు సంపాదించుకున్నామా, లేదా అని ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

## మంచి కాపరి నుండి మనం నేర్చుకోవాల్సిన విషయాలు

### 1. ఇతరులకి మార్గ చూపరిగా ఉండుటయే కాపరి ఆదర్శం

ప్రతి మానవ జీవన గమనంలో మనం ఒక్క ఉన్నత స్థానం చేరాలంటే మార్గచూపరిగా ఉండాలి. అనగా ఒక ప్రత్యేకమైన విషయం పట్ల మంచి అవగాహన కల్గినవారుగా ఉండాలి. పరిశుద్ధ గ్రంథ పరిశీలనలో ఎంతో మంది మహానుభావులు మనకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆదికాండంలో అబ్రహాము ఈ మానవ జాతిని, ఇస్రాయేలులను, ఒక విశ్వాస మార్గంలో నడిపించాలని ముందుడగు వేసారు. వారి సమాజిక పరిస్థితిలో, పిల్లలు లేని వారంటే, శాపంగా భావించే వారు. కాని దేవుడు ఆబ్రహాము ద్వారా విశ్వాస, విత్తనమును నాటి, ఫలింపజేసారు. ఈ రకంగా ఆయన తన జీవితం ద్వార మనందరికి ఆదర్శమూర్తిగా నిలుస్తున్నారు. మన జీవితంలో ఎన్నో సమస్యలు, బాధలు, కష్టాలు వచ్చినా, ప్రభువునందు విశ్వాసం కలిగి జీవిస్తే, ఆబ్రహాము వలె మనలను తోటివారికి మార్గచూపరిగా ఉండాటానికి, కృపను ప్రసాదిస్తారు. చీకటిలో ఉన్నవారికి వెలుగుగా ఉండటం అంటే ఎంతో మహా భాగ్యం. యెషయ ప్రవక్త పల్కిన వాక్కు, “చీకటిలో నడచే ప్రజలు ఒక గొప్ప వెలుగును చూచిరి”. ఈ వాక్కును మనలో ఫలింపచేయులాగున. ప్రభుని వేడుకోవాలి. ఈ భూలోకంలో జీవితం గడుపుచున్న ప్రతి ఒక్కరు వారి వారి జీవిత స్థితిగతిలో, వారికి అనుగ్రహించిన బాధ్యతను బట్టి అన్ని వేళల్లో క్రీస్తు వలె ఆదర్శ కాపరిగా ఉండాలి.

### 2. కాపరి చూపించే మార్గం – నిత్య జీవితం వైపు నడిపిస్తుంది

అంధకారంలో ఉన్న మన జీవితాలను, కాపరి సరిదిద్దుతారు. ఎప్పుడంటే మనం కాపరి స్వరం విన్నప్పుడు. ఎందుకంటే అది జీవావాక్కు. కాపరి తమ ప్రజల క్షేమాన్ని ప్రతినిత్యం కోరుతారు. కాని చాల సార్లు మనం కాపరి చూపించే మార్గంలో పయనించకుండా – వెనకడుగు వేసి త్రోవ తప్పుచున్నాము. యేసు మార్గం – మనకి సురక్షితమైనది. మానవులందరు సత్యం తెలుసుకోని నిత్య జీవం పొందడమే దేవుని అభిలాష అనే వాక్కు మన అందరిని ప్రేరేపించాలి. ఇలాంటి మంచి మనస్సుతో జీవించినప్పుడు మార్గచూపరి మనలను వెలుగు

బాటలో నడిపిస్తారు. అంధకారములో ఉన్న మన జీవితాలను, ఆత్మయందు, సత్యమునందు, పవిత్ర పరుస్తూ, నూత్న బిడ్డలుగా యేసు మనలను మారుస్తారు. కాపరి వేలు పట్టుకొని, ప్రభువా! నేను తప్పుడు మార్గంలో ప్రయణిస్తున్నా నన్ను కాపరిగా సరిచేయుము, నూత్న పరచుము అని ప్రభుని నిరతరం వేడుకోవాలి. ఎందుకనగా మంచి సువార్తతో తమ బిడ్డలకు ఆధ్యాత్మిక మేతను సమకూర్చువాడు ప్రభువు కనుక (రోమీ 8:28). దేవుని ప్రేమించేవారికి, ఆయన ఉద్ధ్యేశానుసారముగా పిలువబడిన వారికి అన్నియు మంచికే సమాకూర్చునట్లు చేయును అనే వాక్కును. మన కష్టాల కడలిలో గుర్తుకుంచుకోవాలి. ఎంతో మంది పునీతులు, వేదసాక్షులు జీవితం నేటి తరం వారికి ఎంతో ఆదర్శం. ప్రధాన కాపరియైన యేసు తండ్రి మార్గన్ని అనుసరించి, దైవ చిత్తాన్ని నేరవేర్చి, తండ్రితో నిత్య జీవం పొందారు. అందుకే ప్రభువు సువార్తలో బోధించారు: "నన్ను ప్రేమించువాడు, నా మాటలను పాటించును. నా బోధనలు ఆలకించి, పాటించు ప్రతివాడు నిత్య జీవం పొందుతారు" అని ఈ విషయాలపై అనుదినం మనం ధ్యానించాలి.

### 3. జ్ఞానస్నానంలో మంచి కాపరి బాధ్యతల్ని తీసుకున్నాము అని గుర్తించాలి

జ్ఞానస్నానం ద్వారా మనం దేవుని బిడ్డలం అయ్యాం. అనగా ఆయన శరీరంలో భాగస్తులమగుటకు శ్రీసభ ఆహ్వానించింది. కావున ప్రతి యొక్క క్రైస్తవుడు మంచి కాపరిగా తమ జీవితాలను జీవించాలి. ఈ బాధ్యత అనేది క్రీస్తు ప్రభు పునీత పేతురు ద్వార అనుగ్రహించి, క్రీస్తు అనుచరులమైన మనకు కూడ వర్తింపజేసారు. చెడు క్రియలను పరిత్యజించి, మంచిని చేపట్టి ప్రోత్సాహించే వారందరు కూడ మంచి కాపరులని మనం గుర్తించాలి. మంచి కాపరి ఏ విధంగా అయితే తమ గొర్రెలను ప్రేమించి, ముద్దుగా ప్రేమతో పిలచి, ఆదరించి కావాల్సిన ఆహారం దయచేస్తారో. తోడెళ్ళ బారి నుండి వాటిని రక్షిస్తారో, ప్రభువు మనల్ని కూడా అలాగే రక్షిస్తాడు. అనుదినం ప్రభువు తన వాక్కు అనే మాట ద్వారా ప్రేమతో సాధరంగా బలి పూజకు ఆహ్వానించి "భారముచే ఆలసిసోలసియున్న సమస్త జనులారా! నా యొద్దకు రండి (మత్తయి 11:28) అంటూ పిలుపునిచ్చి పోషిస్తాడు. నా శరీరం నిజమైన ఆహారం

దీనిని మీరు స్వీకరించి నిత్యజీవం పొందండి అని ప్రధాన కాపరి ఆహ్వానం పల్కుచున్నారు. మరి ఎంత వరకు స్పందిస్తూన్నాం అని ఆలోచనజేసుకోవాలి. ఆయన యొక్క ప్రేమ గుణాలు, మన దగ్గర ఉండాలంటే, మందలో చేరాలి. మరియు ఇతరులను చేర్పించాలి, వారిని వాక్కుతో, మంచి జీవన సువార్త విలువలతో పోషించాలి, పరిరక్షించాలి, ప్రభు దరికి చేర్చాలి. తద్వారా ఇతరులకు సుమాతృకమైన కాపరిగా నిలుస్తారు. ఇదే జ్ఞానస్నానం పొందిన ప్రతి ఒక్కరి బాధ్యత, కర్తవ్యం అని మనం గ్రహించాలి. కాపరి మరియు గొర్రెల మంద అనే బంధాన్ని పటిష్టపరుస్తూ, సురక్షితమైన, స్వచ్ఛమైన పొలంలో చేరి ప్రభు మార్గానికి ఆదర్శంగా జీవించుదాం, నిలుద్దాం.

## సంతృప్తికరమైన జీవితము ఒసగే కాపరి

మన అనుదిన జీవితంలో, కుటుంబాలలో తల్లితండ్రుల ఏ విధంగా అయితే తమ పిల్లలకి అన్ని రకాలుగా, వారికి సంతృప్తి కరమైన జీవితాన్నిచ్చి వారిని పోషిస్తారో, క్రీస్తు ప్రభు తన బిడ్డలమైన మనకు అన్ని వేళల్లో, సమయాలలో, తన జీవితమును సంపూర్ణంగా కేటాయించడానికి తన పరిచర్యను ప్రారంభించియున్నారు (యోహాను 10:10). “నేను జీవమును ఇచ్చుటకు, దానిని సమృద్ధిగా ఇచ్చుటకు, ఫలింపజేయుటకు వచ్చియున్నాను”, అనే ప్రభు మాటలను మదిలో అనునిత్యం స్మరించుకుంటూ క్రీస్తు ప్రభు మందలో చేరిన బిడ్డలుగా మనం నడచుకోవాలి. ఈ ఆనందకరమైన, సంతృప్తికరమైన జీవితం జీవింపదలచినప్పుడు, మన జీవన బాటలో, విశ్వాస ప్రయాణంలో ఎన్నో ఆటంకాలు, సమస్యలు, ఇబ్బందులు,ఎదురైనా, భయపడక, చెదరక, గర్జించు సింహము వలె ప్రభుపై నమ్మకం కలిగి జీవించినట్లేతే. మన ఆత్మకు కావాల్సిన సంపూర్ణ మేతను, జీవముగల ఆహారమును, ఇచ్చి మనలను పోషిస్తారు, రక్షిస్తారు. ఈ కృప దైవానుగ్రహము, కష్టాల కడలిలో అనుభవించిన దావీదు రాజు తన కీర్తన ద్వార “ప్రభువే నాకు కాపరి, ఇక ఏ కోదవయులేదు” అంటూ, దేవునిపై తన సంపూర్ణ నమ్మకాన్ని, విశ్వాసాన్ని వ్యక్తపరచారు. నేటి సమాజంలో ఈ ఆనందం, సంతృప్తికోసం ఎంతో మంది ఎన్నో చోట్ల ప్రయత్నిస్తున్నారు. కాని వారికి అది కరువు అవుతుంది. ప్రభువు దరికి, సన్నిధికి

చేరటంలో, నూరంతలుగా, ఫలంవతమైన జీవితం ఉందని చెప్పిన ఎంతో మంది పునీతుల అడుగుజాడలు మనకు ఆదర్శం, మహోన్నతం. కనుక మార్గ చూపరియైన యేసు మన, జీవితాలను సరియైన మార్గంలో, పచ్చికబయళ్ళలో నడిపించే కృపను, దయచేయులాగున మన మంచి కాపరియైన యేసును వేడుకుందాం.

## ముగింపు ప్రార్థన

ఓ! ప్రేమగల కాపరియైన యేసువా! మీరు మాకు మార్గచూపరిగా ఉండి, అన్ని సమయలయందు ప్రేమిస్తూ, సంరక్షించి, పోషిస్తున్నందులకు వందనాలు. మీ జీవిత నడవడిక, విలువల ద్వారా కాపరి యొక్క లక్షణాలను మాకు నేర్పించి. ఈ సమాజంలో తోటివారికి ఏ విధంగా ఒక మార్గచూపరిగా, కాపరిగా ఉండాలోని మీరు బోధించారు. కనుక మీకు కృతజ్ఞతలు. మీ మాట చాల బలము కలది, శక్తిగలది అని మేము వాక్యంలో ధ్యానిస్తున్నాము. మేము తప్పుద్రోవ పట్టే సమయంలో వాక్కులో కాపరిగా ఉంటూ, మంచి వైపు అడుగులు వేసే మీ గొర్రెలుగా మమ్ము మలచండి. తద్వారా మేము మీరే మా జీవన కాపరి అని గుర్తెరిగి, గాడాంధకారములో, లోయలో మేము పయనించినప్పుడు, మీరు మా వెంట ఉంటారన్న అభయంతో జీవిస్తాం. మా పొరుగువారు చెడు మార్గంలో, ఆ విధేయత చెందిన సమూహంలో ప్రయాణిస్తూంటే నాకేందుకులే అనే స్వభావం కాకుండా, నన్ను నేను ప్రేమించుకునే మారుగా, ఇతరులను ప్రేమించే కృపను అధికమధికముగా దయచేయండి. ‘‘ఇతరులకి మార్గచూపరిగా”, మార్గచూపరి వేలు నిత్యజీవం వైపు నడిపిస్తుందని, జ్ఞానస్నానం పొందిన ప్రతి ఒక్కరి కర్తవ్యం అని గురైరిగి, ఇతరులకి సంతృప్తికరమైన జీవితం చూపించే, మీ శిష్యులుగా, బిడ్డలుగా, సువార్తకు సాక్షులుగా జీవించే కృపను ప్రసాదించుమని, వెలుగు బాటలో నడిపించే ప్రధాన కాపరియైన యేసు నామంలో ప్రార్థిస్తున్నాం. ఆమెన్.

❋ ❋ ❋ ❋

# 4. పునీత కార్మిక జోజప్పగారి మహోత్సవము

– బ్రదర్ నందిగామ మణిహార్



## ఉపోద్ఘాతం

మానవాళి రక్షణ చరిత్రలో యేసు ప్రభువుకు మరియు మరియమాతకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. అలాగే మానవ రక్షణ చరిత్రలో మరియమాత తరువాత ఇంకొకరికి ప్రాముఖ్యత ఉంది. వారు పునీత యోసేపుగారు. ఆదిలో మానవుని అవిధేయత వలన పాపము ఈ లోకములోనికి వచ్చింది. ఆ పాపము ముల్లను విరిచి మానవ రక్షణ ప్రణాళికను దేవుడు తనదివ్య కుమారినికి అప్పగించితే, ఆ దివ్య కుమారుని మరియు ఆ దివ్యకుమారుని తల్లి అయిన మరియతల్లి సంరక్షిణను దేవుడు పునీత యేసేపుగారికి అప్పగించారు. బాలయేసుని సంరక్షిస్తూ, పోషిస్తూ మరియు చిన్నరి బాలయేసు జ్ఞానముయందు, ప్రాయమందు ఎదిగే విధంగా చూసే బాధ్యత పునీత యోసేపుగారికి తండ్రి దేవుడు అప్పగించారు.

మనిషి తాను జీవించినంతకాలం శ్రమించాలి. శ్రమయేవ జయతే, కష్టేఫలి అంటారు పెద్దలు. శ్రమ అనగా నేమి? శ్రమ పవిత్ర గంథం ప్రకారం శ్రమ పాపఫలం అంటారు. అదాము, హవ్వ ప్రభువు తినవద్దు అన్న పండును తిని ప్రభువు యెడల అవిధేయత చూపించారు. అందుకు ప్రభువు నరునితో ఇట్లనెను: "నీవు నీ భార్య మాటవిని నేను తినవలదనిన పండును తింటివి. నీ వలన భూమి శాపము పాలయినది. నీవు బ్రతికినన్నాళ్ళు కష్టపడి కండలు కరిగించి, భూమి నుండి నీకు కావలసిన పంట పండింతువు (అదికాండము 3:17). అప్పటి నుంచి మానవుడు తనకు కావలసిన అవసరాలను, కోరికలను పొందడానికి నిత్యము శ్రమిస్తున్నాడు.

దేవుడు సృష్టిని ఎంతో అందంగా చేసారు. దేవుని సృష్టికి మనిషి తన శ్రమ ద్వారా మెరుగులు దిద్ది ఆకర్షణీయంగా చేస్తాడు. మానవ శ్రమలో ఔన్నత్యముంది. దేవుడు మానవుని తనరూపులో చేసాడు. తనరూపి అయిన మనిషి, దేవుని సృష్టి పనిలో భాగస్వామి. తాను చేసిన పని ద్వారా మానవుడు మన్ననలను పొందుతాడు. కొన్ని సార్లు తన శ్రమకు తగ్గిన ప్రతిఫలం పొందుతాడు.

"కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి!" ఇది మేడే నినాదం. కార్మికుల ఐక్యత, కార్మికుల సంఘీ భావం మేడే అంశాలు. ఇది కమ్యూనిష్టులు, మార్క్సిస్టులు ప్రచార ఫలితం కావచ్చు. వారి పుణ్యమా అని కార్మికులకు గుర్తింపు వచ్చింది.

అది 1955 మే 1వ తేదిన ఇటలీ దేశములోని రోమ్ నగరంలో ఉన్న పునీత పేతురు దేవాలయ, ఆవరణమంతా ఎంతో సందడిగా ఉంది. ఇటలీ కతోలిక కార్మిక సంఘ సభ్యులతో కిటకిటలాడుతోంది. కార్మిక సంఘం పదవ వార్షికోత్సవం సందర్భంగా 10వ పయస్ (భక్తినాధ) పాపుగారు మే నెల 1వ తేదిని కార్మికుడైన పునీత యోసేపుగారికి అంకితం చేశారు.

పాపుగారు ప్రసంగిస్తూ ప్రపంచంలోని యావత్తు శ్రామిక వర్గానికి కాపరిగా, సంరక్షకుడుగా తండ్రిగా పునీత యోసేపుగారు సహాయంగా సహకారిగా, ఉంటారని ప్రకటించారు. పునీత యోసేపుగారు తన కాయకష్టంతో చెమటోడ్చి వడ్రంగి పనిచేసి ఆ వృతిపై వచ్చిన ఆదాయంతో యేసు, మరియలను పవిత్ర తిరుకుటుంబాన్ని పోషించారు. మరియు పరిశుద్ధ 13వ లియో (సింహారాయలు) పాపుపుగారు 1889లో పునీత యోసేపుగారిని శ్రామికులు, కార్మికులు, కష్టజీవులు నిర్లక్ష్యం చేయబడిన దీన జనావళికందరికీ పాలకునిగా మార్గ దర్శకునిగా ప్రకటించారు.

కార్మికులు, చెమటోడ్చి కుటుంబ పోషణ భారాన్ని మోసేవారంతా పునీత యోసేపుగారిని మాతృకగా గైకొని తమ ప్రత్యేక మార్గచూపరిగా భావించి, వారిని స్వర్గరాజ్య పోషకునిగా గౌరవించాలని 1వ బెనడిక్ట్ పాపుగారు ఆదేశించారు.

పునీత యేసేపుగారు మంచి బాధ్యతగల భర్తగా మంచి సాకుడు తండ్రిగా అత్యుత్తమ బాధ్యతాయుత సంరక్షకుడుగ సువార్త పఠనములు తెలియజేస్తున్నాయి.

## దేవుని ప్రేషిత కార్యములో పునీత యేసేపుగారు

"దావీదు కుమారుడవగు యెసేపు! నీ భార్యయైన మరియమ్మను స్వీకరించుటకు భయపడవలదు". అని దూత మాటలను విశ్వసించి ఎప్పుడు అయితే మరియతల్లిని భార్యగా స్వీకరించారో, ఆ సమయం నుండి దేవుని ప్రేషిత కార్యమును నెరవేర్చే భాగ్యం పునీత యెసేపుగారు పొందుతున్నారు. ప్రభువు చూపిన ప్రతి మార్గంలో నడిచి దేవుని ప్రేషిత కార్యమును నెరవేర్చారు. దేవుని ప్రేషితకార్యము కొరకు ఎంతో శ్రమించారు. ఎంత కష్టం వచ్చినా, శ్రమలు వచ్చినా ఇరుకు ఇబ్బందులు వచ్చినా ఎదురించి నిలబడిన ధీరుడు పునీత యోసేపుగారు.

దేవుని ప్రేషిత కార్యమును నెరవేర్చుడం కోసం మరియమ్మ గర్భం దాల్చడం వలన సమాజనం నుండి సుటిపోటి మాటలను, దూషణలను, అవమానములను అన్నింటిన్ని మనస్సులో మౌనంగా అనుభవించిన మౌనమూర్తి పునీత యెసేపుగారు.

"శిశువును చంపుటకు హేరోదు వెదక బోవుచున్నాడు". అని ప్రభువు దూత మాటలను నమ్మి ఆ అర్ధరాత్రి చలిలో మరియ్మను, బాలుడిని తీసుకొని వెళ్ళిన వినయశీలి పునీత యెసేపుగారు.

## దేవరాజ్య స్థాపనకు అలుపు లేకుండా శ్రమించిన ధీరుడు యోసేపుగారు

ధీరుడు అనగా ధైర్యం కలవాడు, శక్తిమంతుడు అని అర్థం. ఒక రాజ్యం కాపాడాలి అన్నా, రాజ్యస్థాపన చేయాలి అన్నా, రాజ్యంలోని ప్రజలను కాపాడాలి అన్నా, మనకు ఒక ధీరుడు, బలవంతుడు మరియు శక్తిమంతుడు కావాలి. తండ్రి దేవుడు కూడా తన దేవ్యరాజ్య స్థాపనకు తన కుమారున్ని సంరక్షించడానికి, పునీత యేసేపుగారిని ఎన్నుకున్నారు.

యేసుకు పండ్రెండేల్ల ప్రాయమప్పుడూ మరియమ్మగారు, యెసేపు దివ్య బాలుని తీసుకొని పాస్కాపండుగ కొనియాడటానికి యోరుషలేము వెల్లారు

తిరుగు ప్రయాణంలో పురుషుల గుంపు ముందు నడుస్తుండగా స్త్రీల గుంపు వెనుక నడచుకుంటు వస్తున్నారు. బాలయేసు తండ్రితో ఉన్నాడని తల్లి, తల్లితో ఉన్నాడని తండ్రి అనుకొని ఒక మజిలికి చేరుకున్నాక బాలుడు తమ ఇద్దరితోను లేడని గ్రహించి కలతచెందారు, ఆ వేదనపడ్డారు. ఆతృతతో వెనుకకు వెళ్లి వేదపండితులను తన ప్రజ్ఞతో దైవసత్యలను వెల్లడించి విస్మయపరుస్తున్న బాలయేసుని కనుగొన్నారు. మరియమాతతో పాటు ఆ కలవరాన్ని తానూ పంచుకున్నారు. ఒక భర్తగా ఒక తండ్రిగా సంరక్షణ బాధ్యతకు న్యాయం చేశారు. బాలయేసు జ్ఞానమందును, ప్రాయమందును పెరిగే విధంగా చూసుకున్నారు. మరియు బాలునికి విద్య, వృత్తిపని నేర్పించడంలో మరియమ్మ గారితో పాటు తనవంతు కృషి సల్పారు. ఈ విధంగా యేసు ప్రభువును తండ్రి దేవుని రాజ్య స్థాపనకు సిద్ధ పరిచారు.

## తిరు కుటుంబ పోషకుడు పునీత యెసేపుగారు

పవిత్ర గ్రంథము పునీత యెసేపుగారుని యేసు, మేరిమాతకు సంరక్షకుడుగా బాలయేసుకు సాకుడు తండ్రిగా గొప్ప విశ్వాసం కలవాడిగా, విధేయత, విరక్తత్వం, తానను తాను తగ్గించుకోవడం, దయ, దానధర్మ గుణం, దిక్కులేనివారిని ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ఇలా అనేక మంచి గుణాలు ఉన్న మహామనిషిగా తెలియజేస్తోంది.

మానవ జీవితంలో కుటుంబం ఎంతో విలువైనది. మంచి కుటుంబం, ఎప్పుడూ మంచి విలువలు కలిగి ఉంటుంది. భర్త కుటుంబ పోషణకు శ్రమిస్తూ ఉంటే భార్య కుటుంబమును చక్కదిద్దుతుంది. నేటి కుటుంబాలను చూస్తుంటే నువ్వా–నేనా అన్నట్లు ఉంటున్నాయి. నీవు ఎంత అంటే నువ్వు ఎంత అంటున్నారు. కాని పూర్వం అలా ఉండేది కాదు. భార్య భర్తకు, భర్త భార్యకు విధేయులుగా జీవించేవారు. చక్కటి కుటుంబ విలువలను కలిగి జీవించేవారు.

తిరుకుటుంబంలో మరియ, యెసేపులు కూడా ఎంతో అన్యోన్యంగా జీవించారు. యెసేపుగారు తాను వడంగ్రి పని చేయగా వచ్చిన డబ్బుతో మరియ్మను, బాలయేసు పోషించేవారు. మరియు కుటుంబ పోషణకు ఎంతో శ్రమించేవారు. మరియకు భర్తగా ప్రేమను పంచారు. అదే విధంగా బాలయేసుకు

సాకుడు తండ్రిగా తాను చేయవలసిన బాధ్యతలను నిర్వర్తించారు.

## యెసేపుని పనీతీరునందు గుణాలు

**యెసేపు పనిని ప్రేమతో చేసేవారు :-** యెసేపు తన పనిని ప్రేమతో చేసాడు. పనియందు హృదయాన్ని నిమగ్నం చేసి ప్రేమను జతచేసి పనిని ముగించేశాడు. తన పని ద్వారా దేవునిని మహిమపరిచేవాడు.

**యెసేపుగారు పనిపట్ల అంకిత భావం కలిగి ఉంటారు :-** మనం ఏ పని చేస్తున్నా. దాని యందు పూర్ణమనస్సు ఉంచి చేయడం మంచి లక్షణం. దేవుని ప్రేషిత కార్యం కోసం ఎంతోగానో శ్రమించి తన అంకితభావం చూపిన ప్రేమమూర్తి యోసేపు.

**యెసేపు కష్టపడే తత్వం ఉన్న మనిషి :-** మనం పని యొక్క కఠినతను పట్టించుకోకుండా ఎంత శ్రమించాల్సి వస్తే అంత శ్రమించి దానికి తగిన ప్రతిఫలం పొందుకోవాలి. ప్రభువు మార్గంలో నడిచేటప్పుడు వచ్చే ప్రతి కష్టమైన వాటిని సులువుగా అధిరోహించిన ధైర్యశాలి పునీత యెసేపుగారు. పునీత యెసేపుగారు ఎప్పుడు కష్టంచూడలేదు కాని దాని వలన వచ్చు ప్రతిఫలం పొందుకున్నారు.

## ముగింపు


మనం పని చేస్తున్నపుడు పనియొక్క కాఠిన్యతను పట్టించుకోకుండా మనం చేయవలసినది శ్రమను చేయాలి. పనిని ప్రేమతో చేయాలి మనం చేస్తున్న పని యందు పూర్ణమనస్సు కలిగి చేస్తాతున్న పనిపై ఏకగ్రత ఉంచాలి. పని చేస్తున్నప్పుడు అనందంను, సంతృప్తిని పొందాలి మరియు కష్టపడి పని చేస్తున్న వారిని మెచ్చుకోవాలి. వారిని విమర్శించడం, వారిపై వ్యంగ్యాస్త్రాలను చేయడం మానుకోవాలి.

ప్రియ మిత్రులారా! పునీత యెసేపుగారు ప్రభువు తనకు అప్పగించిన పనిలో ఏకగ్రత, ప్రేమ, విధేయత, వినయం కలిగి ఉండేవారు. ప్రభువు కార్యం కోసం ఎన్నో అవరోదాలను ఎదుర్కొన్నారు, అవమానాలను భరించారు. దేవుని చిత్త ప్రకారం పని చేస్తూ ఆయనతో సహకరిస్తూ, ఆయన కార్యాలను నెరవేర్చ

ప్రయత్నించిన నీతిమంతుడు. దేవుని సృష్టికార్యంలో దేవునికి సహసృష్టికారునిగా, శ్రామికునికి ప్రేరణగా నిలిచారు. కాబట్టి ప్రియమిత్రులారా! మనం కూడా దేవుని కార్యమును నెరవేర్చ శ్రమించాలి. పునీత పౌలుగారు చెబుతున్నారు. “పనిచేసినవాడు భోజనం చేయడానికి అర్హత ఉన్నవాడు అని. కాబట్టి ప్రియమిత్రులారా! మన జీవితంలో ప్రతిరోజు, ప్రతిగంట, ప్రతి నిమిషం, మన అభివృద్ధికి, మన పొరుగువారికి ప్రోత్సాహం ఇస్తూ, మన పనులతో దేవుని మహిమ పరుద్దాం. అందుకు కావలసిన కృపావరములు ఇవ్వమని, మన కోసం దేవునికి ప్రార్థన చేయమని పునీత యెసేపుగారిని ప్రార్థిద్దాం.

# 5. ఫాతిమ మాత పండుగ

– బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్



## ఉపోద్ఘాతం

అది ప్రజలు సృష్టికర్తను మరచి, సృష్టి వస్తువులకు ప్రాధాన్యతను ఇస్తున్న సమయం. ప్రభు ఆజ్ఞలను మరిచి, పాపమునకు దాసోహవుతున్న సమయం. సహోదర ప్రేమను మరచి, ప్రపంచం యుద్ధం – I ముమ్మరంగ సాగుతున్న సమయం. లక్షలాది సైనికుల రక్తధారలతో, భూప్రపంచం ఘోషిస్తున్న సమయం. సైనికుల వీరమరణ గాధలను చూచి, కుటుంబీకులు విలపిస్తున్న సమయం. నీతి నియమాలు మరచి, దుష్ట ప్రవర్తనలతో సమాజం అడుగులేస్తున్న సమయం. అనునిత్య ఆందోళనలతో, ప్రపంచంలో శాంతి బధ్రతలకు తావే లేని సమయం. రష్యా కమ్యూనిజం ప్రభావం, నలువైపులా వ్యాపిస్తున్న సమయం. అదియే, వెలుగుచున్న జ్యోతిగ మరియమాత దర్శన సమయం. హృదయ పరివర్తన చెంది తన కుమారుడైన క్రీస్తును అనుసరించమని పిలుపునిచ్చిన సమయం.

## చారిత్రక విశేషాలు

యుద్ధాల వలన, పాపక్రియల చేత చిన్నాభిన్నం అవుతున్న మానవాళి బ్రతుకులు మార్చుటకు 13 మే 1917 సం॥లో పోర్చుగీసు దేశంలోని ఫాతిమా అనే గ్రామంలో గొర్రెల కాచుకొను ముగ్గురు పిల్లలకు మరియమాత దర్శనమిచ్చారు. వారి పేర్లు వరుసగా – ఫ్రాన్సిస్, లూసి మరియు జెసింత. సూర్యుని కంటె కాంతివంతంగా, మిల మిల మెరుస్తున్న తెల్లని వస్త్రములు మరియు చేతిలో జపమాలను ధరించి, మరియమాత ఆ ముగ్గురి పిల్లలకి

దర్శనమిచ్చి ఒక సందేశాన్ని తెలియజేశారు. ఆ పిల్లలు కనులారా చూచి చెవులారా విన్న సందేశమును ఇతరులకు తెలియజేయుటకు మొదటగా సంకోచించిన, తరువాత వారి తల్లిదండ్రులకు, బంధుమిత్రులకు, గ్రామస్తులకు మరియు విచారణ గురువులకు తెలియజేశారు. కానీ వారెవరుకూడ వారి మాటలను విశ్వసింపరైరి. పైగా, వారు అబద్ధ ప్రచారం చేస్తున్నారని వారి మాటలను కొట్టివేసి వారిని ఖండించారు. మరల అటుల చేయకుండా ఉండుటకు వారి తల్లిదండ్రులను హెచ్చరించారు.

అలా 13 మే 1917 నుండి 13 అక్టోబర్ 1917 మధ్యకాలంలో మరియమాత ఆ పిల్లలకి వివిధ దఫాలుగా 6 సార్లు కనిపించారు. కాలక్రమేన ఊరి ప్రజలు ఆ దర్శనం నిజమోనేమో అని విశ్వసించుటకు ప్రారంభించిరి. సంపూర్ణంగా విశ్వసించుటకు వారు ఒక సంకేతాన్ని కోరగా, కారు మబ్బులు కమ్మిన ఆకాశంలో వెలుగుచున్న జ్యోతిగా 13 అక్టోబర్ 1917న చివరి సారిగా మరియమత దర్శన మిచ్చారు. పిల్లల మాటచొప్పున వేలాది మంది ప్రజలు ఆ ప్రాంతమును చేరిరి. వారందరి సముఖంలో మరియమాత దర్శనమై సూర్యుని కంటె కాంతిముతమైన వెలుగుచున్న జ్యోతిగా కనిపించింది. ఆమె వెలుగు నుండి ప్రసరించిన కాంతి కిరణాల తాకిడికి వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారందరు స్వస్థత పొందారు.

ఆ సంఘటన (దర్శనం) గురించి కొన్ని సంవత్సరాల పోటు పరశోధనలు జరిపి ఎంతో సమాచారాన్ని సంగ్రహించి, 13 అక్టోబర్ 1930 సం॥లో అక్కడి ప్రాంతీయ పీఠాధిపతులు Jose Alves Correia da Silva (Bishop of Leiria), మరియమాత పలుమార్లు ఆ గొర్రెలు కాచుకొను పిల్లలకు దర్శనమిచ్చిన మాట సత్యమేనని అధికారికంగా వెల్లడి చేశారు. 25 ఏప్రిల్ 1946 సం॥లో 12వ భక్తినాథ పాపుగారు ఆ దర్శనం సత్యమని విశ్వా ప్రపంచానికి ప్రకటించి, ఆ తల్లి నిష్కలంక హృదయానికి మానవాళిని అర్పించి ప్రార్థనలు జరిపారు. ఆ తల్లి సందేశాను సారంగ నడుచుకోవడం అంటే క్రీస్తు బాటలో నడవడమే అని వక్కానించారు. మరియమాత దర్శనమిచ్చిన ప్రాంతంలో ఆ తల్లి పేరున దేవాలయంను నిర్మించారు. 2017 నాటికి శతవార్షిక సంబరాలు జరుపుకొని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా పేరుగాంచింది.

ఆ తల్లి ప్రార్థన ద్వార ఎన్నో అద్భుతాలు చోటు చేసుకున్నాయి. ఎందరో జీవితాలలో వెలుగులు నింపి, మంచి మార్గంలో, తన కుమారుని మార్గంలోనడిపింది. నేటికిని, ఆ ప్రాంతం నిరంతర భక్తుల, యాత్రికులతో కలకలలాడుతుంది నిత్యప్రార్థనలతో ఆధ్యాత్మికతను పెంపొందిస్తుంది. ఆ తల్లి ప్రార్థన సహాయం పొందిన ప్రతి ఒక్కరి జీవితంలో మేలులు / అద్భుతములు చోటు చేసుకున్నాయి. క్రీస్తును నిండుమనస్సుతో అనుసరించడానికి దోహదపడ్డాయి. తనవలె పవిత్ర జీవితం జీవిస్తూ తన దివ్య కుమారుడైన క్రీస్తును అనుసరించి జీవించుటకు ఆ తల్లే ఆదర్శం. ఆమె ప్రార్థనలే తన కుమారుని అనుసరణకి పిలుపు.

## మరియమాత నేర్పిన ప్రార్థన

"ఓ! నా జేసువా! నా పాపములను మన్నించండి, నిత్యనరకం నుండి నన్ను కాపాడండి. అందరి ఆత్మలకు, ముఖ్యముగా ఎవరికి మీ కృపావరం అత్యవసరమో వారందరినీ మీ మోక్షదరికి చేర్చుకొనండి".

మరియమాత ఈ ప్రార్థనను పిల్లలకి నేర్పించి నిత్యం ప్రార్థించమని తెలియజేశారు. ప్రస్తుతం ఈ ప్రార్థనను మనం జపమాల ప్రార్థనలో బాగంగా ఉపయోగిస్తాము.

## మరియమాత వ్యక్తపరచిన అంశాలు

1. వ్యక్తీకరణ శుద్ధి (Personal Sanctification)
2. ఆత్మలకోసం ప్రార్థన (Prayer for the Souls in purgatory)
3. యుద్ధ నివారణకై, శాంతి స్థాపనకై జపమాల ప్రార్థన. (Reciting Rosary)

## 1. వ్యక్తీ కరణ శుద్ధి

కేవలం పాపక్రియలను త్యజించడంతోనే వ్యక్తీకరణ శుద్ధి జరగదు. చేసిన పాపములకు, పశ్చాతాపపడి, క్రీస్తు క్షమాపణను పొంది, తనను నిండుమనస్సుతో, పూర్ణ హృదితో అనసరించడమే సంపూర్ణ వ్యక్తీకరణ శుద్ధి. లోహం అగ్నితో ఏకమై సంపూర్ణ శుద్ధిని పొందుతుంది. అలాగే మనం

కూడ క్రీస్తుతో ఏకమైతేనే సంపూర్ణ శుద్ధిని పొందుతాము. కాబట్టి, క్రీస్తుతో ఏకమవుదాం, శుద్ధినొంది పవిత్ర జీవితానికి నాంది పలుకుదాం.

**(a) పాపము :** దేవుడు ఈ సృష్టియంతయు ఆరు దినములలో చేశారు. అది ఆయన కంటికి బాగుగానుండెను (ఆది 1:31). అంతయు దేవుని దృష్టిలో బాగుగా ఉంటే, మరి దేవుడు అసహ్యించుకొను పాపం ఎక్కడ నుండి వచ్చింది? ఎవరు చేశారు? అను ప్రశ్నలు తలెత్తడం సహజం. వాటికి సమాధానంగా, తన పోలికలో, తన రూపంలో సృజించబడిన మానవుడు, తనవలె పవిత్రంగా తనకు విధేయిస్తూ ఉంటాడు. నమ్మకముతో దేవుడు మానవున్ని స్వేచ్ఛా పరునిగ సృష్టించి మోసపోయాడు. ఎందుకంటే, మానవుడు తన స్వేచ్ఛను ఉపయోగించుకొని తనను సృష్టించిన దేవునికే వ్యతిరేకంగా మారాడు.

ఇహలోకంలో పాపమునకు పునాదులు వేశాడు. కాలక్రమేన మానవులు చేస్తునటువంటి దుష్టక్రియలను చూచి దేవుడు పరితాపంతో చింతించాడు (ఆది 6:5-6). ఎందుకంటే తాను సృజించిన వాడు తనకు దూరం అయ్యాడు కావున, పాపం అనగా, మానవుడు తన స్వేచ్ఛను ఉపయోగించుకొని దేవునికి దూరమవ్వటం. దేవుడు ఒసగు పవిత్రమైన మరియు నీతియుక్తమైన జీవితమును వదిలి లోకాశల వెంట, శరీర సుఖాలవెంట పరుగెత్తాడమే పాపమునకు పురికొల్పు అంశములు.

**పాపఫలితములు**

i) దేవుని ప్రేమను, ఆత్మను కోల్పోతాము (1 తెస్స 5:19, 1 సము 16:14)

ii) శ్రీసభ నుండి వేరుచేయబడతాము

iii) మనం చేసే పాపాలు ఇతరులపై ప్రభావితం చూపిస్తాయి (1 సమూ 2:32-34, 4:17-18)

iv) చేసిన పాపమును కప్పిపెట్టుకుంటూ అనేక పాపములు చేస్తారు (2 సమూ 11:1-27)

v) పాపఫలితాన్ని జీవితంలో తప్పక అనుభవిస్తాము (యిర్మాయేలు బానిసత్వం) (2 రాజులు 24)

vi) శాంతి సమాధానం, సంతోషం కరువైతాయి.

vii) ఇతరులలో దేవున్ని గుర్తించలేము (1 యోహాను 3:11-18)

viii) చివరికి ఒంటరివారైపోతాము (మత్తయి 27:3-10)

ix) మరణానికి దారితీస్తుంది (రోమీ 6:23)

x) నరకానికి చేర్చబడతాము.

ఫాతిమాపురంలో మరియమాత దర్శనమిచ్చినపుడు కూడ పాప ప్రభావం మానవులపై అధికంగా ఉంది. అధికార వ్యామోహంతో నాయకులు యుద్ధాలు జరిపేవారు. ధనవ్యామోహంతో అక్రమంగా, అన్యాయంగా డబ్బు సంపాదించెడివారు. ఇలా సకల మానవాళి పాపపు ఊబిలో ఇమిడి సృష్టికర్తయైన దేవున్ని మరచి జీవిస్తున్న మానవాళినంతటిని తిరిగి దేవుని సన్నిధి చేర్చుటకు మరియమాత దర్శనమిచ్చి పాపమును త్యజించి ప్రాయశ్చిత్తం కోరమని తెలియజేశారు.

**(b) పశ్చాతాపం :** పాప త్యజింపుయే పశ్చాతాపమునకు సూచిక. అనగా చేసిన పాపములను ఒప్పుకొని పశ్చాతాపంచెంది, మరల అటువంటి పాపములు చేయను అని ప్రభు సముఖములో ప్రమాణం చేయడమే. పశ్చాతాపమును వివిధ రకాలుగా వ్యక్తపరచవచ్చును. కన్నీటి ప్రార్థన ద్వారా, ఉపవాస ప్రార్థన ద్వారా, బూడిద పూసుకొని గోనె దరించి ఉపవాస ప్రార్థన మరియు నిండు మనస్సుతో, చేసిన తప్పుకు ప్రత్యామ్నాయం చెల్లించడం. అయితే వీటన్నింటిలోను నిర్మల హృదయం మరియు చేసిన తప్పును పూర్ణ హృదితో ఒప్పుకునే మనస్థత్వం ప్రధానమైనది. పశ్చాతాప హృదితో ప్రభు చెంతకు వచ్చిన ప్రతి ఒక్కరిని ఆయన క్షమిస్తారు మరియు స్వీకరిస్తారు (కీర్తన 51:17). యిస్రాయేలు ప్రజలు, రాజులు, ప్రవక్తలు అనేకమార్లు పాపంలో పడినప్పటికీ, వారి పశ్చాత హృదాయాలను చూచి పరితపించిన ప్రభువు వారిని మన్నించారు మరల తన చెంతకు చేర్చుకున్నారు. క్రీస్తు ఆగమనంలో, తండ్రి స్థానంలో తానే పాపములు క్షమించాడు. తన తరువాత, మన్నించే అధికారమును క్రీస్తుచే స్థాపింపబడి, పవిత్రాత్మ పర్యవేక్షణలో ఉన్న శ్రీసభను అధికారంను ఇచ్చారు (మత్తయి 18:18). మనలను శుద్ధీకరించటానికి దైవమే దిగివచ్చింది అని గుర్తించి పశ్చాతాపం

చెంది, క్రీస్తు అనుగ్రహించు ఫలాలకు అర్హులం అవుదాం.

## పశ్చాతాప ఫలాలు

**(i) రక్షణ లభిస్తుంది :** పశ్చాతాపం చెందిన వారికి దేవుని రక్షణ లభిస్తుంది. నినెవే ప్రజలు పాపం చేసి దేవుని కోపాన్ని రెచ్చగొట్టి, ఆయకు అయిష్టులయ్యారు (యోనా 1:2). వారి దుష్టక్రియలకు గాను, దేవుడు ఆ పట్టణాన్ని నాశనం చేయదలిచాడు. కాని, ఆయనకు మానవాళిపై ఉన్న 'ప్రేమ' అడ్డువచ్చింది ఆ ప్రేమే వారు పాపక్రియలను విడిచి, పశ్చాతాపం పొందుటకు ఓ అవకాశాన్నిచ్చింది. ఆ అవకాశాన్ని సద్వినియోగ పరచుకున్న నినెవే ప్రజలు పశ్చాతాప హృదితో రాజు స్థాయి నుండి సామన్యులు వరకు, పశువులతో సహా గోనెదాల్చి. బూడిద పూసుకొని ఉపవాస ప్రార్థనలు చేస్తూ తమను రక్షించమని దేవున్ని అర్థించారు. వారి పరిస్థితిని చూచి పరితపించిన ప్రభువు వారిని శిక్షింపక రక్షణ కలిగించాడు (యోనా 3:1-10). అదే విధంగా పశ్చాతాపం చెందిన సుంకరి జక్కయ్య తన ఇంటికి రక్షణ తెచ్చుకున్నాడు (లూకా 19:1-10). మన పశ్చాతప హృదియే మనకు రక్షణసాధనం మరియు పరలోక ఆనందం అని గుర్తించి జీవించాలి (లూకా 15:7).

**(ii) పరలోక రాజ్య ప్రవేశం :** పశ్చాతాప పూరిత హృదయం మనల్ని పరలోకానికి చేరుస్తుంది. క్రీస్తుతో పాటు సిలువపై కొట్టబడిన ఒక దొంగ, క్రీస్తు రక్షకుడు అని గుర్తించి, ప్రభూ! నీవు నీ రాజ్యంలో ప్రవేశించినపుడు నన్ను జ్ఞాపక పరచుకొనుము అని పలికి తన పశ్చాతాప హృదయాన్ని క్రీస్తునకు సమర్పించుకున్నాడు. అలా పశ్చాతాపం చెందిన దొంగ పాపవిముక్తి పొంది పరలోక రాజ్యంలో చేరాడు (లూకా 23:39-43). దేవదూతలతో, పునీతులతో కలిసి ప్రభుని ఆరాధించే భాగ్యాన్ని పొందాడు.

**(iii) నూతన జీవనానికి నాంది :** పశ్చాతాప హృదయం నూతన జీవనానికి నాంది. వ్యభిచారం అనేది యూద మత సాంప్రదాయాల్లో ఘోరమైన పాపం. అలా చేసిన స్త్రీలను రాళ్ళతో కొట్టి చంపేస్తారు. అలా పాపం చేసి మరణశిక్షకు అర్హురాలైన ఓ స్త్రీ ప్రభు చెంతకు తీసుకొని రాబడుతుంది (యోహాను 8:1-11). ఆమె పశ్చాతాప పూరితురాలై ప్రభు పాదముల చెంతా చేరి కన్నీటితోను,

మేలైన తైలముతో ప్రభువు పాదముల కడిగే, తన తలవెంట్రుకలతో తుడిచి తన పశ్చాతాపాన్ని ప్రభువునకు సమర్పించు కుంటుంది. ప్రభు మన్ననను పొంది పాప జీవితంనకు స్వస్తి చెప్పి, క్రీస్తుతో నూతన జీవాన్ని పొందింది (యోహాను 12:3). ఒకప్పుడు క్రైస్తవులను హింసిస్తున్న పౌలుగారు సహితం క్రీస్తు రక్షకుడని గుర్తించి పశ్చాతాపం చెంది క్రీస్తును దరించాడు. నూతన జీవాన్ని పొంది క్రీస్తు సాక్షిగ నిలిచాడు (అ.పో. 9:1-9)

దేవుడు తన కార్యాలను జరిపించుటకు తనకు ఇష్టం వచ్చిన వారిని ఎన్నుకుంటారు. వారు పాపులైనను, బలహీనులైనను, చిన్నవారైనను, మరియు పిరికి వారైనను, ఎన్నుకొని తన ఆత్మతో వారిని నింపుతాడు. తద్వారా తన కార్యాలు జరిపిస్తాడు (1 కొరింతీ 1:27). యోనా ద్వారా దేవుడు నినెవేకి రక్షణనిచ్చాడు (యోనా 3:10). తన కుమారుడైన క్రీస్తు ద్వారా ఈ లోకానికి రక్షణనిచ్చాడు. అయినప్పటికీ, మానవాళి బలహీనతల వల్ల తిరిగి పాపంలో పడిపోతున్నాము. అలా పడిపోతున్న ప్రజలందరిని తిరిగి దేవుని చెంతకు చేర్చుటకు మరియమాత దేవుని రక్షణ సాధనంగా మారింది. ఫాతిమాపురంలో పిల్లలకి దర్శన మిచ్చి పశ్చాతాపం చెంది తన కుమారుడైన క్రీస్తును అనుసరించమని కోరింది.

**(c) క్రీస్తు అనుసరణ :** సాధారణంగా ఒక వ్యక్తిని అనుసరించాలంటే ముందుగ ఆ వ్యక్తిని గురించి తెలుసుకోవాలి. అపుడే ఆ వ్యక్తి యొక్క జీవితం, జీవన విధానం మనకి ఆదర్శంగా నిలుస్తుంది మరియు ఆ వ్యక్తిని అనుసరించడానికి సిద్ధపరుస్తుంది. అదే విధంగా క్రీస్తును అనుసరించాలంటే ముందుగ క్రీస్తును గురించి తెలుసుకోవాలి. అపుడే క్రీస్తు జీవితం, జీవన విధానం మనకు ఆదర్శం అవుతుంది. అంతేగాక, ఆయన నడిచిన బాటలో అనగా, ప్రేమ, శాంతి, సత్యం, త్యాగం....మొ॥ గుణాలతో నడచుటకు మనల్ని సిద్ధపరుస్తుంది. ఆయన బాటలో నడుస్తున్నందుకు మనం సంతోషాన్ని వ్యక్త పరచాలి మరియు మన జీవితాల ద్వారా ప్రభుని మహిమ పరచాలి.

ఆత్మ ప్రేరణ చేత మరియమాత గర్భంనందలి క్రీస్తును గుర్తించిన బప్తిస్మ యోహానుగారు, తన తల్లి ఎలిజబెతమ్మ గర్భంలో గంతులు వేశారు

(లూకా 1:44). అలా సంతోషాన్ని వ్యక్తం చేసిన యోహానుగారు, తన జీవితంను దేవుని చిత్తానికి అంకితం చేశారు. దేవుని వాక్కును, హృదయ పరివర్తనను ప్రకటిస్తూ (లూకా 3:3), దైవ కుమారుడైన క్రీస్తు రాకకు మార్గం సిద్ధం చేయ పూనుకున్నాడు. మరొక, పర్యాయములో తన పాద రక్షలు విప్పుటకైనను యోగ్యుడనుకాను అని తనను తాను తగ్గించుకొని, తన జీవితం ద్వారా దేవుని మహిమ పరిచాడు (లూకా 3:16). అంతేగాక తన వలె తన శిష్యులు కూడ క్రీస్తును గుర్తించాలని, వారిని ఆయన చెంతకు పంపించాడు. వారు ఉదయం నుండి సాయం సమయం వరకు క్రీస్తుతో ఉండి, ఆయన జీవన విధానమును పరిశీలన చేసి, అయనే (క్రీస్తు) మెస్సయా అని గుర్తించారు. ఆనందంతో ఆయన్ను అనుసరించారు. వీరే క్రీస్తు ప్రభువు శిష్యులు. అందులో ఒకరు ఆంద్రెయ (యోహాను 1:35-42).

మరిముఖ్యంగ క్రీస్తును అనుసరించాలంటే తనను తాను తగ్గించుకొని తన సిలువను ఎత్తుకొని అనుసరింపవలెను అని క్రీస్తు తెలియజేశారు (మత్తయి 16:24). తనను తాను తగ్గించుకోవడం (త్యజించుకోవడం) అంటే, తనలో ఉన్న లోకవాంఛలు, శరీర సుఖాలకు స్వస్తి చెప్పి ప్రభుని మహిమార్థమై సిద్ధపడటం. తన సిలువను తాను ఎత్తుకొని అనగా, తనవలె, ఎన్ని కష్టా బాధలు, అవమానాలు ఎదురైనా ప్రభుచిత్తాన్ని నెరవేర్చుటకు పూనుకోవాలి. ఇలా చేస్తేనే క్రీస్తును సంపూర్ణంగా అనుసరించిన వారిమవుతాం. ఇలా మనందరిని తన కుమారుని బాటలో నడిపించుటకు దేవుని మహిమార్థమై మన జీవితాలను మలచుకొని, ప్రభు చిత్తాన్ని నెరవేరుస్తూ ఆయన రక్షణ ఫలాలకు మనలను అర్హులను చేయుటకే మరియమాత ఫాతిమాపురంలో దర్శనమిచ్చారు.

## 2. ఆత్మలకొరకు ప్రార్థన : (ఉత్తరించుస్థలం)

మరియమాత పిల్లలకి నేర్పిన ప్రార్థనలో, మొదటి భాగం వ్యక్తీకరణ శుద్ధి కొరకు అయితే, రెండవ భాగం, ఆత్మల శుద్ధి కొరకు ప్రార్థన. ఆత్మలకోసం ప్రార్థించే ముందు ఏ ఆత్మలకు కోసం మనం ప్రార్థించగలం అనే సత్యాన్ని మనం గ్రహించాలి.

**పరలోక ఆత్మలు :** వీరికి మన ప్రార్థనలు అవసరం లేదు. ఎందుకంటే తమ పవిత్ర జీవితం ద్వారా ముందుగనే దేవుని సన్నిధి చేరుకున్నారు. దేవ దూతలతో కలిసి ప్రభుని ఆరాధిస్తున్నారు. వీరినే పునీతులు అని పిలుస్తాం.

**నరకంలో ఉండే ఆత్మలు :** వీరిని మన ప్రార్థన సహాయం వల్ల ఎటువంటి ఉపయోగం లేదు. ఎందుకంటే వారి పాపక్రియలను బట్టి వారికి ప్రభు శిక్ష ఖరారైంది. కాబట్టి మనం చేసే ప్రార్థనలు వారి స్థితిగతులను మార్చలేవు (లూకా 16:24-26).

**ఉత్తరించుస్థలంలో ఉండే ఆత్మలు :** భూలోకంలో తాము చేసిన స్వల్ప పాపాలకు పరలోకం చేరలేకపోయిన ఆత్మలు ఉత్తరించు స్థలంలో ఉంటాయి. దీనినే శుద్ధీకరణ స్థలం అనికూడ అంటారు. ఇది తాత్కాలికమైది. ఇక్కడి ఆత్మలు, తాము ఇహలోకంలో చేసిన పాపములకు శిక్షను, బాధలను అనుభవిస్తూ ఉంటారు. వీరిబాధలు, నరకంలోని ఆత్మలు అనుభవించే శిక్షలు, వాటిద్వారా కలుగు బాధలతో సరిసమానంగా ఉంటాయని పునీత తోమాసు అక్వినాసు గారు పోల్చారు; వారి బాధలు మానవ ఊహకి కూడ అందని విధంగా ఉంటాయి అని పునీత అగస్టీనుగారు తెలియజేశారు. అన్ని బాధలలోను, శిక్షలతోను ఏదోక రోజు పరలోకం చేర్చబడతాము అనే ఆశతో ఎదరుచూస్తున్నారు. వీరు పరలోకం చేరాలంటే శుద్ధీకరణ పొంది పవిత్రం చేయబడాలి. ఎందుకంటే పరలోకం పవిత్రమైన దేవుని సన్నిధి. శుద్దీకరణకోసం తమకోసం తాము కూడ ప్రార్థించుకోలేని దీన స్థితిలో ఉండి మన సహాయాన్ని అర్థిస్తున్నారు. వారిలో మన తల్లిదండ్రులు, అన్నదమ్ముడు, అక్కచెల్లెలు, బంధుమిత్రులు కూడ ఉండి ఉండొచ్చు. అటువంటి దీనస్థితిలో ఉన్నవారి కోసం సహాయపడమని క్రీస్తే మనకు తెలియజేశారు. వారి శుద్ధీకరణతో పరలోకంలో సంబరాలు జరుగుతాయి. కాబట్టి వారికోసం ప్రార్థించడం మన భాధ్యత అని భావించాలి. వారి శుద్ధీకరణకోసం నిరంతర ప్రార్థనలు జరపాలి. అలా మన ప్రార్థనల వలన శుద్ధీకరణ పొందిన ఆత్మలు పరలోకం చేర్చబడతాయి. దేవుని సముఖంలో నీకోసం, నీకోసం సకల మానవాళి కోసం వారు ప్రార్థిస్తారు. ఇది తథ్యం.

అలా స్వల్ప పాపాలతో మరణించిన ఆత్మలు పరలోకం చేరలేక పడుతున్న బాధలు చూచి పరితపించిన మరియమాత దర్శనాల ద్వారా వారి కోసం ప్రార్థించమని పునీత ఫౌస్టినమ్మ మరియు పునీత పాద్రెపియోగారికి ఇది వరకు తెలియజేశారు. కానీ, వాని ఫలితం ఎక్కువగా లేదు. అందుకే మరియమాత తోనే స్వయంగ ఫాతిమా పురిలో పలుమార్లు కనిపించి, ఆత్మల శుద్ధికొరకు ప్రార్థించడంలోను మరియు మన ప్రార్థనల ద్వారా వారిని పరలోకం చేర్చుటతోను మన బాధ్యత ఎంతో ఉంది అని తెలియజేశారు. మనం వారి కోసం చేసే ప్రార్థనలు వృధాగ కాకుండా వారిని (ఆత్మలు) పరలోకం చేర్చుతుందని విశ్వసిద్ధాం ప్రార్థిద్ధాం.

## 3. జపమాల ప్రార్థన

ప్రార్థన అనగా దేవునితో సంభాషించడం, జపమాల ప్రార్థన అనగా మరియమాతతో కలిసి దేవున్ని ప్రార్థించడం. జపమాల ప్రార్థన, ప్రార్థించడం తెలియని వారికి అండగ నిలచి, వారిని పరలోకం చేర్చుటకు దోహదపడు తుందని మరియమాత తన దర్శనం ద్వారా సిస్టర్ లూసి గారికి తెలియజేసారు. మొదటి ప్రపంచ యుద్ధం వలన ప్రజలకు కలిగిన బాధలు, ఇబ్బందులు, కష్టాలను మరియు అధిక మరణాలను చూచి మరియతల్లి హృదయం పరి తపించిపోయింది. ఆ భయంకర యుద్ధంను అపి, ప్రపంచంలో శాంతి నెలకొల్పుటకు అనుదినం జపమాలను జపించమని తానే స్వయంగ ఫాతిమా పురిలో ప్రత్యక్షమై తెలియజేశారు. జపమాల ప్రార్థన ద్వారా ప్రపంచ శాంతి కోసం, మరియు మనందరి అవసరాల కోసం, అప్పటికే ప్రార్థనలో ఏకీభవమై ఉన్న మరియమాతతో మనం ఏకీభవిస్తాము. శోధనలకు గురికాకుండ ప్రార్థిస్తాము. అంతేగాక తనను తాను జపమాల మాతగ వ్యక్తీకరించుకొని, ప్రపంచ యుద్ధం అపుటకు రష్యాను తన నిష్కలంక హృదయానికి సమర్పించి ప్రార్థనలు జరపమనికోరారు. 6వ భక్తినాధ పాపుగారు మరియు రెండవ జాన్‌పాలు పాపుగారు యావత్తు ప్రపంచాన్ని ఆ తల్లి నిష్కలంక హృదయానికి సమర్పించి ప్రపంచ శాంతి కొరకు ప్రార్థనలు జరిపారు.

మరియమాత కూడ తన జీవిత కాలంలో శాంతి సూచికగా జీవించారు. అలా అని తన జీవితంలో ఎలాంటి బాధలు, కష్టాలు, ఆందోళలనలు లేవు అని కాదు. పరిశీలించి చూస్తే, దేవుని తల్లి అయినప్పటికీని మనకంటే ఆ తల్లే ఎక్కువ కష్టాలు, బాధలు అనుభవించింది. అవన్ని ఉన్న కూడ హృదయమున పదిలపరచుకొని, ప్రభువునకు సమర్పించుకొని, తాను శాంతియుతంగా జీవించింది. ఆ తల్లి జీవితమునే ఆ దర్శంగా తీసుకున్న పునీత రెండవ జాన్ పాల్ పాపుగారు తనను తుపాకితో కాల్చిన వ్యక్తిని మన్నించగలిగాడు. కరచాలనంతో వారివురి మధ్య శాంతిని నెలకొల్పాడు. తనకు పూర్తిగ నయం కావడానికి ఫాతిమా మాత ప్రార్థన ప్రధాన కారణం అని తలంచాడు. 13 మే 1989లో ఫాతిమా మాత పుణ్యక్షేతం చేరి ఆ తల్లి నిష్కలంక హృదయానికి కృతజ్ఞతలు తెలిపి, జపమాలను ప్రార్థించారు. మన కష్టాలు, బాధలను చూచి పరితపించి అనునిత్యం మనకొసం ప్రార్థించే తల్లి మరియమాత అని సూచిస్తూ తనకు తగిలిన బుల్లెట్ (Bullet)లో ఒకదానినికి ఆ తల్లి కిరీటంలో అమర్చారు. మనం కూడ ఆ తల్లి జీవితం ఆదర్శంగ తీసుకుందాం. అనునిత్యం జపమాలను జపిస్తూ, శాంతి స్థాపకులుగా రూపాంతరం చెందుదాం.

## ముగింపు : నవజీవనానికి అన్వయింపు

నవసమాజం సాంకేతిక పరిజ్ఞానంతో పరుగులు తీస్తుంది. ప్రకృతి మానవాళి స్వార్ధానికి దాసోహం అవుతుంది. అనునిత్య పాపక్రియలతో, దుష్ట వాంఛలతో మానవాళి దైవానికి దూరం అయింది. తాను బాగుపడాలి, తాను మాత్రమే బాగుపడాలి అని తన దుష్టక్రియుల ద్వారా ఎందరినో బాధపెడుతున్నాడు. ఆధ్యాత్మిక చింతన లేక, ఆర్థికంగా ఎదగాలనే ఆశతో తప్పటడుగులు వేస్తున్నాడు. కానీ తాను వేసే ప్రతి ఆడుగు ఇతరులపై చెడు ప్రభావం చూపెడుతున్నాయి అని తెలుసుకోలేక పోతున్నాడు. తెలిసినా, ప్రయాత్నాన్ని విరవించుకోవడానికి సిద్ధంగా లేడు. భావి తరాలకు అండగ ఉండాల్సిన ప్రకృతిని సైతం తన స్వార్థం కోసం నాశనం చేస్తున్నారు. అనునిత్య అణుయుద్ధాలు, భూప్రకంపనలు సంభవిస్తున్నాయి (సిరియా, టర్కీ భూకంపం). వాటి ద్వారా ఎందరో అమాయకులు ప్రాణాలను కోల్పోతున్నారు. మానవాళి

స్వార్థంతో బంధాలు విడిచి, సహోదర ప్రేమను మరిచాడు. దైవవే లేదు అన్నట్లుగ పాపానికి దాసోహం అవుతున్నాడు.

అత్యల్ప కుటుంబ స్థాయి నుండి అత్యధిక సామాజిక స్థాయి వరకు అను నిత్య కలహాలు, గొడవలు, యుద్ధాల వలన సమాజంలో పాపం పెరిగిపోతున్న ఈ తరుణంలో, మరియమాత ఫాతిమాపురిలో దర్శన మిచ్చి పలికిన సందేషాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవాలి. పాపాన్ని విడచి క్రీస్తును అనుసరించాలి. శాంతి నెలకొల్పు క్రీస్తు సాధకులుగా మనందరం రూపాంతరం చెందాలి. అదియే సంపూర్ణ జీవనం. అదియే, తన దివ్య కుమారుడై క్రీస్తును అనుసరించడానికి సకల మానవాళికి మరియమాత పిలుపు.

❊ ❊ ❊ ❊

# 6. క్రీస్తు మోక్షారోహణ మహోత్సవము

**(మహిలో మహిమను నిల్పి మహోన్నతుని సింహాసనం చేరిన మహిమాన్వితుడు)**

**– బ్రదర్ చాట్ల అలెగ్జాండర్**



## ఉపోద్ఘాతం

మహిమోన్నతుడు, మహిమాన్వితుడు, మరణము గెలిచిన మృత్యుంజయుడు, అద్వితీయుడు, అతిసుందరుడు, మహిలో మహిమను నిల్పి తన తండ్రి కుడి ప్రక్కన ఆశీనుడైన సుగుణజ్ఞానాల సంపన్నుడు. చరిత్రలో కనీ వినీ ఎరుగని ఒక సంఘటన చోట చేసుకుంది. అది కన్నీళ్ళకు కూడ కన్నీరు తెప్పించే సంఘటను, కరుడుగట్టిన హృదయాలు కరుణను చూచిన సంఘటన, కరుణించమని వేడిన సంఘటన, అదేమిటంటే, శ్రమలను అనుభవించి, సిలువ మీద కఠినమైన మరణం పొందిన క్రీస్తు, మరణాన్ని జయించి పునరుత్థానుడై, మూడవనాడు, సజీవుడై లేచిన దగ్గర నుండి నలువది రోజులు తన శిష్యులకు దర్శనమిస్తూ, వారిని నడిపిస్తూ, తాను సజీవుడనని వారి సందేహమును తొలగునట్లు ఋజువు చేసుకొనెను. దైవరాజ్యము గురించి వారికి బోధించి, అందరు చూచుచుండగ యేసు మోక్షారోహణమై తన తండ్రి కుడిప్రక్కన ఆశీనుడయ్యాడు. ఇది ఒక పరమరహస్యం మనకున్న జ్ఞానంతో తెలుసుకోలేం, కాని విశ్వాసంతో మాత్రమే గ్రహింపగలం. ఇది పెదాల పై పలికే పదాలతో వర్ణించలేనిది. క్రీస్తు ప్రభువు, ఈ లోకానికి చెందినవాడు కాదని, పరలోకానికి చెందిన వాడని నిరూపించిన రోజు, దైవ కుమారునిగ, తన తండ్రి కుడిప్రక్కన ఆశీనుడయ్యాడు. కావున ఈ పవిత్ర దినాన మనం మహోన్నతుడైన క్రీస్తుని మోక్షారోహణ పండుగను

జరుపుకుంటున్నాం. దేవుని బిడ్డలుగ మరో మహోన్నతమైన మలుపును దిద్దేపండుగ. క్రీస్తుని శ్రమలను, మరణాన్ని చూచి చలించి, జాలువారిన కన్నీటి బొట్టులు, ఈరోజు మహోన్నతునికి మహిమ అని గళమెత్తి స్తుతించుచున్నాయి. ఎంత మహోన్నతం ఎంత పవిత్రం ఈ దినం.

## క్రీస్తు ప్రభువుకి తన తండ్రీ కుడిపార్శ్వాన ఆశీనార్హత ఎలా వచ్చింది

మత్తయి 26:36, లూకా 22:39-46 చదివితే ఇందులో యేసు గెత్సెమని తోటలో ప్రార్థించుటను గురించి ఉంటుంది. యేసు తన శిష్యులతో గెత్సెమని తోటకువచ్చి, "నేను ప్రార్థనచేసికొని వచ్చువరకు మీరు ఇచట కూర్చుండుడు, అని చెప్పెను. ఆయన వారితో నా ఆత్మ మరణవేదన పడుచున్నది. మీరు ఇచటనే ఉండి జాగరణచేయుడు అని పలికెను. ఆయన కొంత దూరమువెళ్ళి, నేలపై సాగిలపడి, సాధ్యమైనయొడల ఆ గడియ తన నుండి తొలగింపమని తన తండ్రిని ప్రార్థించెను. ఈ గెత్సెమని తోటలో తండ్రి కుమారుల మధ్య సంభాషణ జరిగింది. తండ్రీ నీ చిత్తమైనచో ఈ పాత్రను నా నుండి తొలగించు అని తన తండ్రికి ప్రభు ప్రార్థించినప్పుడు. తండ్రి తన కుమారునితో "నీవు భూలోకంలో నా ఆజ్ఞలకు అనుగుణంగ జీవించినందున నాతోపాటే పరలోకారంలో జీవిస్తావు" అని చెప్పాడు. అప్పుడు యేసుప్రభు తన తండ్రి చిత్తానికి శిరమువంచి శ్రమల పాత్రను సీకరించాడు. ఈ సంఘటన గురించి, సంభాషణ గురించి ఎక్కడ కూడ లిఖించబడలేదు. ఇది దేవునిపై ఉన్న అచంచల విశ్వాసంతో గ్రహింపబడింది. తన ఈ శ్రమల పాత్రను స్వీకరించిన తరువాత, తన రక్త ప్రోక్షణ ద్వారా మాత్రమే, ఈలోక పాపపు ద్వారాన్ని పగులగొట్టి, రక్షణ ద్వారాన్ని తెరచాడు. క్రీస్తు ప్రభువు శ్రమల పాత్రను స్వీకరించిన గడియ దగ్గర నుండి, సిలువలో తన తండ్రితో పలికిన మాట. "తండ్రీ నా ఆత్మను నీ చేతుల్లోకి అప్పగిస్తున్నాను అనే చివరి మాట వరకు, అడుగడుగును తననే మనకై బలిగ అర్పించాడు. క్రీస్తు ప్రభువు ఎంచుకున్న ఈ ఇరుకైన మార్గమే ఈనాడు తనను తండ్రి కుడిసార్శ్వాన ఆశీనుడుని చేసింది. క్రీస్తునకు తన తండ్రి కుడి ప్రక్కన కూర్చునే అర్హత ఊరికే వచ్చిందా? కాదు శ్రమించాడు, తనును తాను త్యజించుకున్నాడు, ఆయనను తన తండ్రికి అర్పించుకున్నాడు,

ప్రార్థించాడు, భరించాడు, అవమానాలను పడ్డాడు. లోకమే తలక్రిందులైన ఊపిరి ఆగే వరకూ తన తండ్రి చిత్తానికై నిలబడ్డాడు, కట్టుబడ్డాడు. విజయిభవుడై, తండ్రి సింహాసనానికి కుడి ప్రక్కన ఆశీనుడమ్యాడు. ఇది ఆయన అర్హత క్రీస్తుని శ్రమలు చూస్తే, ఒక మానవుని ఈ విధంగ హింసిస్తారా అనే విధంగ ఉంటాయి. ఎంతలా అంటే అతి క్రూరంగ క్రీస్తుని శరీరం నుండి చిందిన రక్తపు బొట్ట, రక్షణకు తొలిమెట్టు. ఇదే ఆయనను ఆశీనుడిని చేసింది.

**సజీవుడైన దేవుని కుమారుడు :-** క్రీస్తు ప్రభువు మూడవరోజు ఉత్థానం అయ్యాడు. ఆయన చెప్పినట్లే సమాధి నుండి లేచెను (మత్తయి 28:6). ఇక ఇహపరములకు సర్వాధికారి ఆయనే (మత్తయి 28:18). ఇక మీరు వెళ్ళి సకల జాతి జనులకు పిత, పుత్ర, పవిత్రాత్మ నామమున జ్ఞానస్నాన మొసగుచు వారిని నా శిష్యులను చేయుడు అని యేసు పలికెను (మత్తయి 28:19). లోకాంతంవరకు నేను మీతో ఉంటాను అని యేసు అభయమొసగెను (మత్తయి 28:20). క్రీస్తు ప్రభువు నలువది రోజుల పాటు దర్శనమిస్తునే ఉన్నారు. ఆయన ఉత్థానమైన తరువాత మొట్టమొదటిగ తాను ఏడు దయ్యములను వెళ్ళగొట్టిన మగ్ధలామరియమ్మకు దర్శనమిచ్చెను (మార్కు 16:9). క్రీస్తు ఆమెకు దర్శనమిచ్చాడని ఆమె చెప్పిన మాటలు దుఃఖసాగరంలో ఉన్న శిష్యులు నమ్మలేదు. తరువాత ఒక గ్రామమునకు వెళ్ళుచున్న ఇద్దరు శిష్యులకు వేరొక రూపమున దర్శనమిచ్చెను (మార్కు 16:12). వారు చెప్పిన మాటలు కూడ ప్రజలెవ్వరు నమ్మలేదు తదుపరి పదకొండుగురు శిష్యులకు ప్రత్యక్షమై, సజీవుడై లేచివచ్చిన తనను చూచిన వారి మాటలును నమ్మనందున వారి అవిశ్వాసమునకును హృదయకాఠిన్యమునకును వారిని గద్దించెను (మార్కు 16:14). సాక్ష్యాత్తు క్రీస్తు దర్శనమిస్తే తన స్వంత ప్రజలు కూడ నమ్మలేదు. అందుకే ఆయన ఈ విధంగ దర్శన మిస్తు. ఆయన సజీవుడని నిరూపిస్తూ, అవిశ్వాసమునకు, హృదయ కాఠిన్యమునకు లోబడిన తన శిష్యులకు, ప్రజలకు, విశ్వాసాన్ని నింపడానికి ఆయన ఈ నలువది రోజులు దర్శనాలు ఇస్తు వారిని బలపరచి, సకల జాతి జనులకు సువార్తను బోధింప వారిని సిద్ధపరచెను.

యేసు ఒక నిర్ణీతమైన గడియలో ఈ లోకంలో మనుష్యునిగ అవతరించినట్లే

ఆయన నిశ్చిత సమయంలో ఈ లోకాన్ని వీడిపోవాలి. తాను సజీవుడనని నిరూపించడానికి నలువది రోజులు పాటు యేసు శిష్యులకు భౌతికంగ కనిపిస్తూనే ఉన్నారు. కాని ఆయన శాశ్వితంగ ఈ లోకం విడిచి వెళ్ళవలసిన గడియ రానే వచ్చింది. అదే క్రీస్తుని మోక్షారోహణము. ఆయన చివరి మాటలుగ తన శిష్యులతో "మీరు ప్రపంచ మందంతట తిరిగి, సకలజాతి జనులకు సువార్తను బోధింపుడు. విశ్వసించి జ్ఞానస్నానము పొందువాడు రక్షింపబడును. విశ్వసింపని వానికి దండన విధింపబడును. విశ్వసించువారు ఈ అద్భుత శక్తులను కలిగియుందురు. నా నామమున దయ్యములను వెళ్ళగొట్టెదరు. అన్య బాషలను మాట్లాడెదరు పాములను ఎత్తి పట్టుకొందురు. ప్రాణాపాయకరమైనది ఏది త్రాగినను వారికి హాని కలుగదు. రోగులపై తమ హస్తములానుంచిన వారు ఆరోగ్యవంతులు అగుదురు (మార్కు 16:15-18). ఈమాటలు అన్నీ ఆయన వారితో చెప్పి పరలోకునకు కొనిపోబడి దేవుని కుడిప్రక్కన కూర్చొని ఉన్నాడు. ఆ తరువాత శిష్యులు ప్రపంచమందంతట సువార్తను ప్రకటించి నజరేతుడును మృత్యుంజయుడను అయిన యేసు నామంలో అద్భుతములను చేయుచున్నారు. ఆయన గురించి అన్య బాషలలో భోదించుచు అనేకులను బప్తిస్మం ద్వార దేవుని బిడ్డలుగ చేయుచున్నారు. దైవ రాజ్యాన్ని స్థాపించటంలో నిమగ్నమయ్యారు.

**తరగని ప్రేమతో అలుపెరుగని ఆశతో :-** క్రీస్తు ప్రభువు తన తండ్రి కుడిపార్శ్వాన ఆశీనుడైన క్షణము నుండి, తన శిష్యులకు దైవరాజ్య నిర్మాణానికి శక్తినిస్తు, వచ్చే ఆటంకాలకు ఎదురువెళ్ళి నిలబడే ధైర్యాన్నిస్తూ, భౌతికంగ కాకపోయిన, తన ఆత్మ ద్వారా వారిని బలపరుస్తూ దైవరాజ్య స్థాపనలో, తరగని ప్రేమతో అలుపెరుగని ఆశతో, అడుగులు వేశారు, ప్రాణాలు కూడ పణంగ పెట్టి క్రీస్తును గురించి బోధించి విశ్వాస బీజాన్నినాటారు. కాలాలు మారినా కష్టాలు వచ్చినా, కన్నీటి బొట్టు కనురెప్ప దాటి రాకుండ, దేవునివైపు చూస్తు, మనస్సులను దేవుని మీదలగ్నము చేసి, శిష్యులు వారి గుండెగుడిలో ఒక అందమైన మందసం ఏర్పరచి అందు ప్రభుని నిల్పి, సర్వాన్ని దేవునికి అర్పించి సర్వస్వం ప్రభువే అని తలచి, మరణాన్ని జయించి, విజయీభవుడై తండ్రి కుడి ప్రక్కన ఆశీనుడైన ఆ మహోన్నతుని నమ్మి అడుగులు ముందుకు వేశారు.

ఈనాడు ఆయన విజయిభవుడు. కాని శ్రమలను అనుభవించినప్పుడు, ద్వేషించిన వారు ఎందరో. ఇన్ని మాటలు పడినా కూడా ఏ ఒక్కరిని ఒక్కమాట కూడ అనలేదు. ఎవ్వరిని బాధపెట్టలేదు. ఏ చేతులైతే ఆయనను కొట్టాయో అదే చేతులు ఆయన ముందు జోడించి క్షమించమని వేడాయి. ఏ వ్యక్తులైతే ఆయనను ఇంత పరితాపకరమగు స్థితికి తీసుకోచ్చారో అదే వ్యక్తులు ఆయన ముందు మోకరించి కరుణించమని వేడారు. ఆయన తన రాజ్యానికి రాజుగ తిరిగి వెళ్తునప్పుడు "రాజా! నీ రాజ్యంలో నన్ను కూడ గుర్తుపెట్టుకో" అని వేడారు. క్రీస్తుని చూచిన వారు, ఈయన ఒక సామాన్య వ్యక్తి అని తలంచారు. కాని వారికి తెలియనిది ఏమిటి అంటే క్రీస్తు సామాన్యుడు కాదు, అసమాన్యుడు. ఈ విషయాన్ని మనం అనగ నీవు నేను గ్రహించాలి. ఆయన ఎదుట మోకరించి, శిరమువంచి, కరముచాచి, హృదయాన్ని ఆయన పాదాలకు అంటగొట్టి, క్రీస్తుని అంటిపెట్టుకుని జీవించాలి. క్రీస్తుని మోక్షరోహణం. క్రైస్తవునికి ఒక నిధి. ఇది ఎందుకు నిధి అంటే, చరిత్రలోనే ఇది ఒక నూతన అధ్యాయం, ఈ భుప్రపంచంలోనే ఇది కనివిని ఎరుగని సంఘటన. కేవలం క్రైస్తవంలోనే ఇది మనం చూస్తాం. కేవలం క్రీస్తు ద్వారా మాత్రమే జరిగింది. అది ఏమిటంటే, మరణించిన ఒక వ్యక్తి మూడవనాడు సజీవుడై సమాధి నుండి లేవడం, సజీవుడై లేవడం మాత్రమే కాదు, నలువది రోజుల తన దివ్య దర్శనాలతో, భౌతికంగ కన్పించడం. భౌతికంగ కన్పించడం మాత్రమే కాదు, మోక్షారోహణమై, తన తండ్రి కుడి ప్రక్కన ఆశీనుడవ్వడం. అందుకే క్రీస్తు మోక్షారోహణం క్రైస్తవానికి విలువైన నిధి.

**పరమున పట్టాభిషేకం :–** ఇది క్రీస్తుప్రభువు రాజుగ పట్టాభిషేకం చేయుగడియగ, రాజ్యాధికారం స్వీకరించు గడియగ, మనం చూడవచ్చు. క్రీస్తు ప్రభుని తండ్రి దేవుడు ప్రేమగ ఆహ్వానిస్తున్నాడు. తాను సృష్టించిన ఈ సృష్టిలో తండ్రిని మోసం చేయకుండా, ఆయన చిత్తాను సారం జీవించిన ప్రాణి ఒక్కటే. ఆయానే క్రీస్తుప్రభువు పరమున పట్టాభిషేకం పొందుచున్న ఆ సింహాసన సీనుని ఆరాధిద్దాం, మన జీవితాలను సార్ధకంగ మలచుకుందాం. ఆయన పై ఆధారపడి జీవిద్దాం. శాంతిని చూడని కనుల శాంతిని చూచేలా, ప్రేమను చూచేలా, దేవుని అద్భుత కార్యాలు అనుభవించేలా, ఆయనను అనుసరించి, జీవిద్దాం. సింహాసనాసీనుని దీవెనలతో వెలుగొందుదాం.

సజీవుడు, ఉత్తాదును అయిన క్రీస్తు, ఇహలోకంలో తన పనిని దిగ్విజయంగ పూర్తిచేసి పరలోకంలో తన తండ్రి యుదుట ధీరోత్తముదులాగా నిలిచియున్నాడు. తన చిత్తానికి తలవంచి, చెప్పిన మాటకు కట్టబడి విజయాభవుడై తన యొదుట నిలిచియున్న తన కుమారుని చూచి తండ్రి ఎంతగానో సంతోషిస్తున్నాడు. ఆయన తన కుమారుని సింహాసనంపై కూర్చుండబెట్టి ఇహపరలోకాలకు రాజుగా పట్టాభిషేకం చేయుగడియలు ఇవి. ఈ పవిత్ర గడియలో తండ్రి దేవుడు బహిరంగంగ క్రీస్తు ప్రభువుని ఇహపరలోకాల్ని పాలించే అధిపతిగ ఈ పట్టాభిషేకం ద్వారా అధికారాన్ని పొందాడు. సర్వాధికారాన్ని క్రీస్తుకు ఇస్తూ "నేను నీ శత్రువులను నీ పాదములకు పీఠముగా చేయు వరకు నా కుడి ప్రక్కన కూర్చుండుము" అని యావే ప్రభువు పలుకుచున్నాడు. తుది తీర్పు వరకు క్రీస్తుప్రభువు పాలన చేసి, చివరికి ఆ రాచరికాన్ని పితయగు తండ్రి దేవునికి అప్పగిస్తాడు. అనగా అప్పుడు ముగింపు వచ్చును అని అర్థం పరిపాలకులను, అధికారులను, శక్తులను, అందరిని క్రీస్తు జయించి రాజ్యమునకు పితయగు దేవునికి అప్పగించును. దేవుడు శత్రువుల నందరను ఓడించి ఆయన పాదపీఠము క్రింద వుంచు వరకును క్రీస్తు పరిపాలింపవలెను. క్రీస్తు సమస్తమును తన పాలనలోకి వచ్చిన తరువాత, సమస్తమును తనకు ఇచ్చిన దేవునకు తననుతాను అప్పగించుకుంటాడు. అప్పుడు దేవుడు సమస్తమును పాలించును. (1 కొరింతీ 15:24-28).

**మహిమను పొందిన వేళ :-** మన అందరికి తెలుసు, క్రీస్తు మనవలె మానవ స్వభావం గలవాడు, అన్నిటినిమించి ఆయన మన సోదరుడు అని మనకు తెలుసు. ఈ మానవాళి అంతా ఆయనయందు ఇమిడి ఉంది. అందుకే ఈ పవిత్ర దినం మనసోదరుడును, తననే మనకై బలిగ అర్పించి. రక్తాన్ని చిందించి, ఈ లోకాన్ని రక్షించి, మరణాన్ని జయించి, పునరుత్థానుడై, తన తండ్రి కుడి ప్రక్కన ఆశీనుడై పరలోకంలో మహిమను పొందాడంటే అది మనకు కూడ వర్తిస్తుంది. క్రీస్తుయందు మానవ స్వభావం ఉన్నతస్థితికి ఎత్తబడి దైవిక గౌరవ సన్నాహాల్లో పాలుపంచుకుంటుంది. క్రీస్తుని శిరస్సు, క్రైస్తవ సంఘం ఆయన దేహం. ఇది మన విశ్వాసం. మన నమ్మకం, ఇదే నిజం. దివ్య సంస్కారాల ద్వార మనం క్రీస్తుతో ఏకమవుతున్నాం. ఆయనతో మనం ఐక్యమై సజీవ

అవయవాలుగ సత్ప్రవర్తనతో జీవించినట్లు క్రీస్తుని మహిమలో మనం భాగస్తులం కాగలం. ఇదే విశ్వాస సత్యం. పౌలుగారు ఎఫెసియులకు వ్రాసిన లేఖలో (1:6) మనలను అప్పుడే పరలోకంలో ఉన్నట్లుగ భావించి ఇట్లు పలుకుచున్నాడు. "క్రీస్తు యేసుతో ఐక్యమొందుట వలన ఆయనతో పాటు మనలను లేవనెత్తి ఆయనతో పాటు మనకు దివ్యలోక పరిపాలనాధికారమును అనుగ్రహించెను. నిజంగ పౌలుగారు మాటలు వింటే, కళ్ళవెంట కన్నీళ్ళు వస్తయి". ఆయన చెప్పే ప్రతి యొక్క మాట నిజం. అందుకే క్రీస్తు మనలో నాటబడాలి.

**పరలోక సౌధమే :-** క్రీస్తు బాధల్లో మనం పాలుపంచుకున్నప్పుడే క్రీస్తుని మహిమలో కూడ మనం బాగస్తులం అవ్వగలం. క్రీస్తుని శ్రమలలో మనం పాలుపంచుకోవాలి. మనం దేవుని బిడ్డలం కనుక దేవుని వారసులం, వారసు రాండ్రం కూడ. క్రీస్తుతో వారసులం. క్రీస్తు బాధలలో మనం పాలుపంచుకొనిన యెడల ఆయన వైభవంలో కూడ మనం భాగస్తులమగుదుము (రోమీ 3:17).

మన ఈ ఇహలోక జీవితంలో క్రీస్తుకు దగ్గరగ జీవించాలి అప్పుడు మన జీవితం పరలోక సౌధమవుతుంది. అనుదినం సిలువను మోసుకుని క్రీస్తుని అడుగుజాడల్లో నడవాలి. ఈలోక ఆశలకు, వ్యామోహాలకు లొంగి పోకుండ, దేవున్ని చిత్తాన్ని అనుసరించాలి. కోపం, క్రోధం, మోహం, స్వార్థం, ఇలాటి చెడులను జయించి త్యాగానికి, ప్రేమకు, క్షమాపణకు, స్థానాన్ని ఇవ్వాలి. ఈ చెడులను జయించడంలో మన జీవితం ఒక బలిగ రూపొందాలి.

మోక్షారోహణమైన క్రీస్తువైపుచూడు. ఆయన వైపే మన దృష్టిని సారించి మన జీవితాన్ని ముందుకు గడపాలి. మహిమాన్వితుడైన ఆ ప్రభునివైపు మన హృదయాలను లగ్నము చేయాలి. ఎందుకంటే ఆయన సజీవుడైన దేవుడు. మీరు క్రీస్తుతోబాటు సజీవులుగా లేవనెత్తబడితిరి. కనుక మీ హృదయములను పరలోక మందలి వస్తువులవైపునకు మరల్పుడు. క్రీస్తు, దేవుని కుడి ప్రక్కన తన సింహాసనముపై అధిష్టించియుండును. మన మనస్సులను ఇచట భూమిపైగల వస్తువుల మీద కాక అచ్చట పరలోకమందు గల వస్తువులపైన లగ్నము చేయుడు అంటాడు పునీత పౌలు (కొలస్సీ 3:1-2). దేవుడు మానవుని ఈలోకంలో, కష్టించి ప్రగతిని సాధించమన్నాడు. భూలోక వస్తువుల వైపు

గాక పరలోక వస్తువులపైన ఎలా మనస్సునులగ్నం చేయగలడు? ఇచట పరలోకమంటే ఏమిటో, పరలోక వస్తువులంటే ఏమిటో సరిగా అర్థం చేసుకోవాలి. పరలోకం లేదా మోక్షం అంటే ఒక ఉన్నత ప్రదేశం కాదు, కాని అది ఒక వ్యక్తి ఉన్నత జీవిత స్థితి. మోక్షం అంటే తనను తాను, లేదా తనతో తాను జీవించే సంపూర్ణ జీవితం. దైవానికి చేరువలో ఉండి ఆయనతో కలిసి అడుగులు వేసి, ఆయన జీవంలో సంపూర్ణంగ జీవించడం. మోక్షారోహణ క్రీస్తు అత్యున్నత సింహాసన అదిష్ఠుడు మనలను దీవించి, నడిపించాలని ప్రార్థిద్ధాం.

# 7. పెంతెకోస్తు మహోత్సవము

- బ్రదర్ బాపనపాటి అలెక్స్



## ఉపోద్ఘాతం

పూర్వవేదంలో యూదులు పండుగలెన్నో జరుపుకొనేవారు. వానిలో ప్రధానమైనవి మూడు పండుగలు. ఈ మూడింటిని తీర్థయాత్రల పండుగలు అని అంటారు. అవి ఏమనగా

**1. పాస్కా పండుగ**

**2. పెంతెకోస్తు పండుగ**

**3. గుడారాల పండుగ**

ఈ తీర్థయాత్రల పండుగలకు ప్రతి యొక్క యూదుడు హాజరు కావలయును. అనగా ప్రతి పురుషుడు యెరూషలేము పట్టణములో వున్న దేవాళయమునకు వెళ్ళి ప్రభువునకు బలులు, కానుకలు సమర్పించవలెను. వీటిని సంవత్సరంలో మూడు సార్లు వారం రోజులపాటు ఎంతో వైభవముగా జరుపుకుంటారు. ఈ వ్యాసమునందు మనము రెండవ ముఖ్యమైన పండుగను గురించి తెలుసుకోబోతున్నాయి. ఈ పండుగ మనము "పవిత్రాత్మ అపోస్తులపై వేంచేసిన రోజు" అనీ, "శ్రీసభ జన్మదినోత్సవం" అనీ, "క్రీస్తు ప్రభువు సువార్తా పరిచర్యకు శిష్యులను పంపించిన రోజని" మాత్రమే తెలుసు. కాదు, ఇది పాతనిబంధన పండుగ; యిస్రాయేలీయులు ఐగుప్తు దేశ బానిసత్వం నుండి తరలివచ్చిన తర్వాత దాదాపు యాభైరోజులకు పెంతెకోస్తు పండుగను జరుపుకునేవారు. పెంతెకోస్తు అంటే ఒక పండుగ కాదు, ఇది ఒక దినం, 50 రోజులు లేదా 50వ రోజు.

**యూదులు:** పాస్కాపండుగ తర్వాత వచ్చే 50వ రోజున ఈ పండుగను ఆచరించేవారు.

**క్రైస్తవులు :** యేసు పునరుత్థాన పండుగ తరువాత వచ్చే 50వ రోజున ఈ పండుగను పెంతెకోస్తు పండుగగా ఆచరిస్తున్నాము.

## పుట్టు పూర్వోత్తరాలు

పాస్కా పండుగతో పాటు పులియని రొట్టెల పండుగను జరుపుకొనేవారు. పులియని రొట్టెల పండుగ కోతకాల ప్రారంభాన్ని సూచిస్తుంది. అది యవధాన్యపు కోతకాల తొలి గడియ. ఈ కోతకాలం ఏడువారాలు ముగిసిన తర్వాత దేవునికి కృతజ్ఞతగా మరో పండుగను జరిపేవారు. దానినే పెంతెకోస్తు పండుగ అని అంటారు. అనగా 50వ రోజు. ఈ పండుగ రోజున పండిన పంట ప్రథమ ఫలములను దేవునికి కృజ్ఞతగా అర్పించేవారు. కాల క్రమేణా యూదులు వ్యవసాయ సంబంధమైన పండుగల్ని తమ రక్షణ చరిత్రకు వర్తించేలా చేశారు. పులియని రొట్టెల పండుగ తర్వాత యాభైరోజులకు పెంతెకోస్తు పండుగను జరుపుకునే వారిని తెలుసుకున్నాం కదా! ఇస్రాయేలీ ప్రజలు ఐగుప్తు దేశంనుండి తరలివచ్చిన తర్వాత దాదాపు యాభై రోజులకు సీనాయి పర్వతం వద్ద యావే ప్రభువు మోషేకు పది ఆజ్ఞలను ఇచ్చాడు. కనుక పెంతెకోస్తు పండుగను ఈ సీనాయి సంఘటను సూచించే పండుగగా జరుపుకోవడం మొదలు పెట్టారు.

## నాడు - నేడు పెంతెకోస్తు పండుగ

నాడు పెంతెకోస్తు పండుగను దేవుడు సీనాయి పర్వతం మీద యిస్రాయేలీయులతో చేసుకొన్న ఒడంబడికను జ్ఞాపకం చేసుకొంటూ జరుపుకొనేవారు. నేడు పవిత్రాత్మ శిష్యుల మీదకు దిగిరావడంతో నూతన ఒడంబడికను దేవుడు చేస్తున్నాడు.

నాడు యూదులు పెంతెకోస్తు పండుగను దేవుడు వారికి ఇచ్చిన పది ఆజ్ఞలను జ్ఞాపకం చేసుకొంటూ జరుపుకొనేవారు. నేడు దేవుడు శ్రీసభకు ఇచ్చిన నూతనచట్టమును అనగా ప్రేమ అను చట్టమును జ్ఞాపకం చేసుకోమని, ధ్యానించమని తిరుసభ ఆహ్వానిస్తుంది.

నాడు యూదులు పెంతెకోస్తు పండుగ రోజున కోతల ముగింపుగా జరుపుకునేవారు. నేడు ఈ పండుగ రోజున పేతురు ప్రసంగంతో 3000 మంది రక్షింపబడి జ్ఞానస్నానం స్వీకరించారు. దీనిని ఆత్మల సంపాదన పండుగ అని చెప్పవచ్చు. దేవుడు ఆత్మలను రక్షించాల్సిందిగా / కాపాడాల్సిందిగా మనల్నందరిని కోరుతున్నారు.

శిష్యులు యేసు ప్రభువును సిలువ వేసినపుడు పారిపోయారు. ఇప్పుడు రహస్యంగా ఒక గదిలో చేరి, తలుపులు మూసి ప్రార్థన చేస్తున్నారు. అలా ప్రార్థన చేస్తుండగా "ఒక బలమైన గాలి వంటి ఒక ధ్వని ఆకాశము నుండి అకస్మాత్తుగా వారు కూర్చుండి వుండిన ఇల్లంతయూ నిండెను. అప్పుడు అగ్నిజ్వాలలు నాలుకల వలె వ్యాపించి అక్కడవున్న ఒక్కొక్కని మీద నిల్చాయి. వారు పవిత్రాత్మతో నింపబడ్డారు" (అ.కా. 2:2-4).

## పెంతెకోస్తుదినం - శ్రీసభ జన్మదినం

దేవుడు మొదటి మానవుణ్ణి ధూళి నుండి రూపొందించి, తన ఆత్మతో నింపాడు. అలాగే నూతన సంఘము అయిన శిష్యులలో నూతన జీవాన్ని ఊది ఒక జీవము కలిగిన సంఘముగా మార్చడం చూస్తున్నాం. ప్రభువు వాగ్దానము చేసినట్లుగా "నేను వెళ్ళి మీ వద్దకు ఆదరణ కర్తను / ఓదార్చువాడు పంపుతాను. ఒక వేళ నేను వెళ్ళనిచో అతడు మీ యొద్దకు రాడు అని చెప్పారు (యోహాను 16:7). ఆ ఆత్మ మీ యొక్క విశ్వాసాన్ని బలపరుస్తుంది. కతోలిక శ్రీసభ సత్యోపదేశం ప్రకారం, సంఖ్య 738-741లో, పవిత్రాత్మ ఏ విధంగా సహాయపడుతుందో తెలుసుకుంటున్నాం. "మనం దేవుని విధేయించడానికి, ఆయన చిత్తం ప్రకారం జీవించడానికి పవిత్రాత్మ సహాయం చేస్తారు. కష్ట సమయాల్లో వున్నపుడు మనకు తోడుగావుంటారు, ఆదుకుంటారు. పవిత్రాత్మ అనేది మన ఆత్మలో మౌనంగా సంచరించే అతిథి అని పునీత అగస్తీను గారు అంటారు. ఎవరైనా పవిత్రాత్మ సన్నిధానాన్ని అనుభవించాలంటే ముందుగా మౌనం వహించాలి. మౌన అతిథి మనతో మౌనంగా సంభాషిస్తుంటారు. అంతరంగంలో ఉన్న పవిత్రాత్మ సహవాసంలో జీవించడం, మనలో వున్న దేవుని సన్నిధానంలో జీవించడం. పవిత్రాత్మ సర్వేశ్వరుడు మనకు అనేక

కృపావరాలను అనుగ్రహిస్తారు. సత్య స్వరూపియగు ఆత్మ మనల్ని సంపూర్ణ సత్యమునకు నడిపిస్తుంది (యోహాను 16:13). ఆ గదిలో భయంకరంగా, అధైర్యం చూపిన అపోస్తులులు, పవిత్రాత్మ నడిపింపు తరువాత అధైర్యవంతులను ధైర్యవంతులుగా చేశారు. అవివేకులను వివేకులుగా మార్చారు.

## ఎవరు ఈ పవిత్రాత్మ

పవిత్రాత్మ త్రిత్వంలో ఒక వ్యక్తి. పరిశుద్ధమైన వ్యక్తి. పరిశుద్ధాత్మ వ్యక్తి అనడానికి కొన్ని ఋజువులు కూడా వున్నాయి. అవి.

1. పరిశుద్ధాత్ముడు బోధిస్తాడు (He teaches) – యోహాను 14:26
2. పరిశుద్ధాత్ముడు సాక్ష్యమిస్తాడు (He testifies) – యోహాను 15:26
3. పరిశుద్ధాత్ముడు నడిపిస్తాడు (He guides) – యోహాను 16:16
4. పరిశుద్ధాత్ముడు మాట్లాడుతాడు (He speaks) – అపో.కా. 13:2
5. పరిశుద్ధాత్ముడు ఆజ్ఞాపిస్తాడు (He commands) – అపో.కా. 16:6
6. పరిశుద్ధాత్ముడు నియమిస్తాడు (He appoints)– అపో.కా. 20:28
7. పరిశుద్ధాత్ముడు వెళ్ళమంటాడు (He leads) – అపో.కా. 8:29

పరిశుద్ధాత్ముడు దైవీకమైన వ్యక్తి, పరలోక వాసి. పెంతెకోస్తు దినాన పరిశుద్ధాత్మ సర్వేశ్వరుడు ఆయన సంఘము మీదకు వచ్చారు. ఎల్లప్పుడూ వారితో వుండుటకు వచ్చారు. వారిని ఓదార్చుటకు, నడిపంచేందుకు వచ్చారు.

## పరిశుద్ధాత్మ మనలను నడిపిస్తుంది

శిష్యులు ప్రభువుతో కలసి జీవించారు. ప్రభువు అద్భుతాలు చూచారు, బోధనలు విన్నారు. ఐనా వాళ్ళలో పెద్ద మార్పేమి కలుగలేదు. క్రీస్తు మరణించి, వాళ్ళ మధ్యనుండి వెళ్ళిపోయాక కూడా వాళ్ళు అర్థం చేసుకోలేదు. కానీ, అలాంటి వాళ్ళుకూడ పవిత్రాత్మ దిగిరాగానే పూర్తిగా మారిపోయారు. ప్రభువు తన మరణ, పునరుత్థానాల ద్వారా పాపక్షమాపణ చేకూర్చి పెట్టాడని తెలుసుకున్నారు. ఆ యాత్మే శిష్యులను మార్చివేసింది. ప్రభువు ప్రసాదించే ఈ ఆత్మ ఆ తొలినాటి శిష్యులకే కాదు, మనకూ లభిస్తుంది. జ్ఞానస్నానం

పుచ్చుకునే సమయముందు మనము ఆత్మను పొందుతాం. జ్ఞానస్నానం వలన కలిగే ఫలితాలు రెండు: పాపక్షమాపణ మరియు ఆత్మ స్వీకారం (అ.కా. 2:38). మనము ఆత్మను పొందాం. ప్రభులోనికి ఐక్యమయ్యాం. అనే ఈ సత్యాన్ని ఎప్పుడూ మరచిపోకూడదు. ఆ పరిశుద్ధాత్మ తనలో ఐక్యమైన మనల్నందర్నీ ప్రభు మార్గంలో, సన్మార్గంలో ముందుకు నడిపిస్తుంది.

## ఆత్మవలన దేవుని పుత్రులౌతాం

సీనాయి పర్వతం దగ్గర జరిగిన ఒడంబడిక ద్వారా పూర్వవేదపు యూదులు యావే ప్రజలయ్యారు. కానీ ఆ ప్రజలు యావేను తండ్రీ! అని పిలవడానికి భయపడిపోయి "ప్రభూ!" అని మాత్రం పిలిచేవాళ్ళు. యూదులు ప్రభువుని చూచి జంకేవాళ్ళు అనగా భయపడేవాళ్ళు. కనుక అతని పేరైనా ఉచ్చరించే వాళ్ళు కాదు. నూత్నవేదపు ప్రజలమైన మనం కూడా జ్ఞానస్నానం ద్వారా దేవుని ప్రజలమయ్యాం. కాని మనం దేవుణ్ణి 'ప్రభూ' అని పిలవడానికి బదులుగా 'తండ్రీ' అని పిలుస్తున్నాం. ఈ స్వాతంత్ర్యం, చనువూ మనకు ఎక్కడ నుండి లభించింది?. దేవుని ఆత్మవలన (రోమీ 8:14-16). ఒక్క ఆత్మ ద్వారా మాత్రమే మనము దేవుణ్ణి తండ్రీ / అబ్బా అని పిలువగలుగుతున్నాం. మనం బానిసలం కాదు పుత్రులం, వారసులం. ఆ యాత్మ ద్వారా మనం దేవుని దత్త పుత్రులమయ్యాం. క్రీస్తునకు తమ్ముళ్ళుగాను, చెల్లెళ్ళు గాను మారిపోతాం. క్రీస్తులాగే మనం కూడా పరలోకంలోని పితను "అబ్బా" లేక "తండ్రీ" అని పిలుస్తున్నాం. పరలోకంలోని తండ్రికి ఏకైక పుత్రుడు యేసు ప్రభువు. క్రీస్తులోనికి జ్ఞానస్నానం పొందిన మనం ఆ తండ్రికి దత్త పుత్రులం.

## ఆత్మఫలాలు మరియు ఆత్మవరాలు

### (i) ఆత్మఫలాలు

దేవుని బిడ్డలు ప్రభువు చూపించిన మంచి మార్గంలో నడుస్తూ పోతుంటే సాతాను మనలను అనేక విధాలుగా బాధిస్తుంది. అనేక శోధనలొస్తాయి. ఈ శోధనలనే పునీత పౌలు శరీర కార్యాలు అని పిలుస్తున్నారు. ఈ శోధనల నుండి మనలను కాపాడటానికి, భగవంతుణ్ణి మన అనుభవానికి తీసుకొని రావడానికి ఆత్మ కొన్ని ప్రత్యేక వరాలనిస్తుంది, వీటినే ఆత్మఫలాలు అని పిలుస్తాం.

వీటిని పౌలు గలతీయులకు వ్రాసిన లేఖలో పొందుపరచారు. (గలతీ 5:22). అవి ప్రేమ, సంతోషం, శాంతి, సహనము, దయ, మంచితనము, విశ్వసనీయత, సాత్వికత, ఇంద్రియ నిగ్రహము.

**(a) ప్రేమ:** ప్రేమ, దీని ద్వారానే మనలను క్రీస్తు అనుచరులుగా గుర్తించేది (యోహాను 3:35). ఈ ప్రేమ దైవప్రేమ మరియు సోదరప్రేమ. దైవ ప్రేమ అంటే క్రీస్తు ప్రభువునీ, అతని ద్వారా తండ్రి దేవుని ప్రేమించి ఆరాధించడం. సోదరప్రేమ అంటే మన తోటి సహోదరీ, సహోదరులను ఆదరించడం. ఈ ప్రేమ శక్తిని ప్రసాదించేదే పవిత్రాత్మ. ఈ ఆత్మ ద్వారా తండ్రి కుండతో నీళ్ళు పోసినట్లుగా ప్రేమశక్తిని మన హృదయంలోకి కుమ్మరిస్తాడు (రోమీ 5:5).

**(b) సంతోషం:** క్రీస్తుని అంగీకరించే వాళ్ళకు ఆత్మ ఓ విధమైన సంతోమును ప్రసాదిస్తుంది. ఈ సంతోషాన్ని అనుభవించే భక్తులు ప్రభుని స్తుతించి కొనియాడుతారు. ఆనందంతో పాటలు పాడతారు.

**(c) శాంతి:** పరిశుద్ధాత్మ శాంతిని అనుగ్రహిస్తుంది. ఈ శాంతి కూడా రెండు విధాలుగా వుంటుంది. మొదటిది, దేవునికీ మనకీ పొత్తు కుదురుస్తుంది. తండ్రి దేవుడు క్రీస్తు ద్వారా మన పాపాలను పరిహరిస్తాడు. అప్పుడు పాపమనే అడ్డుకూడ తొలగిపోయి మనము దేవునితో ఐక్యమై, శాంతిని పొందగలుగుతాం. రెండవదిగా తోడి ప్రజలకూ, మనకూ సంబంధం కుదురుతుంది. పరిశుద్ధాత్మ క్రైస్తవ సమాజాన్నంతటినీ ఒక్కటిగా బంధిస్తుంది. అనగా మనలో మనకు ఐక్యత సిద్ధిస్తుంది.

**(d) సహనము (లేక) ఓర్పు:** దేవుడు చాలా ఓర్పుకలవాడు (రోమీ 15:5) అతను తొందరపడి పాపాత్ములను శిక్షించేవాడు కాదు, ఓర్పు కలిగివుంటాడు. ఇతరుల పట్ల ఖచ్చితంగా మెలగడం సులభం. దేవుడు మన పట్ల ఓర్పు చూపినట్లే మనము కూడా తోడి వారితో ఓర్పుగా మెలగాలి. దీనిని మనకు ప్రసాదించేది ఆత్మ.

**(e) దయ:** పరలోకంలోని తండ్రి దయ, కనికరం గలవాడు (లూకా 6:36). ప్రభువులాగే మనం కూడా తోడి మానవుల పట్ల దయ కలిగియుండాలి (కొలోసీ 3:12) ఇతరుల పట్ల దయగా మెలగడం కష్టం, కానీ, దయగా వుండగలం. దానిని ఆత్మే ప్రసాదిస్తుంది.

**(f) మంచితనం:** మనం చేసే పనులు ధర్మబద్ధంగానూ, న్యాయ సమ్మతంగానూ ఉండాలి. ఆత్మ ఈ శక్తిని ప్రసాదిస్తుంది.

**(g) విశ్వసనీయత:** ప్రభువు నమ్మదగినవాడు, అతడు ఆడినమాట తప్పేవాడు కాదు. నేను మిమ్ము రక్షిస్తాను అంటే క్రీస్తు ద్వారా రక్షించి తీరుతాడు. మనం కూడా ప్రభువులాగే నమ్మదగిన వాళ్ళముగా వుండాలి (2 కొరింతీ 1:18-20).

**(h) సాధుశీలత:** ఈ గుణం కలవాళ్ళు ఇతరులతో మృధువుగా సౌమ్యంగా వుంటారు. క్రీస్తులో ఈ గుణం సమృద్ధిగా వుంది. అతడు సాధుశీలుడు, వినమ్ర హృదయుడు. మనలో కూడా ఈ గుణం వుండాలి.

**(i) ఇంద్రియ నిగ్రహం:** మానవులు బలహీనులు, పాపస్వభావం కలిగినవారము. కామకోరికలు, ఇతర ప్రాపంచిక ఆశలకు తరచూ లోనవుతూవుంటాము. మన నిగ్రహాన్ని కోల్పోతుంటాం. శారీరక, ఆత్మీయ నిగ్రహం కలిగిన వ్యక్తి ఒక్క క్రీస్తు ప్రభువే. మనము కూడా ఇందియ నిగ్రహం కలిగియుండేలా ఆ పవిత్రాత్మ సర్వేశ్వరుని వేడుకుందాం.

**(ii) ఆత్మవరాలు:** ఆత్మ క్రైస్తవ సమాజానికి వరాలనిస్తుంది. ఎందుకిస్తుంది? ఎందుకిస్తుందంటే సంఘ క్షేమాభివృద్ధికొరకు ఇస్తాడు. ఆత్మ వరములున్న వ్యక్తిలో స్వార్థం ఏ కోశాన వుండకూడదు. వాక్యమును బోధించడం ఒక వరము, ప్రవచించడం ఒక వరము, స్వస్థపరచడం ఒక వరము, భాషల వరం మరొకటి. ఈ వరములన్నింటికీ కర్త పరిశుద్ధాత్మ. సంఘము యేసు శరీరానికి పోల్చబడింది. అందులో ఎన్నో అవయవాలు, ఎన్నో ఆత్మవారలు. ఏ ఒక్కటి లేకున్నా శరీరం పనిచేయదు. ఏ వరమున్నా అది సంఘ క్షేమాభివృద్ధి కొరకే అని గ్రహించాలి. శరీరమందలి అవయవములు పరస్పరం అవగాహనతో పనిచేయునట్లు, సంఘ సభ్యులు ఆత్మవరములను పరస్పరం సదవగాహనతో ఉపయోగించాలి. ఆత్మవరంలేని తలంపులు, కార్యములు దేవునికి పనికిరాని చెత్త చెదారం వంటివి.

ఈ ఆత్మఫలాలు, ఆత్మవరాలు అనుదినము, క్రీస్తు దేహమైన శ్రీసభ నిర్మాణానికి తోడ్పడాలి. ఆదరించువాడు, ఓదార్చువాడు, నడిపించువాడు, పవిత్రీకరించువాడు సత్యమును తెలియజేయువాడు, ఉత్సాహపరచువాడు అయిన పవిత్రాత్మ దేవుని మీద నిత్యం ఆధారపడి జీవించాలి. యేసు ప్రభువు

ఆరంభించిన రక్షణ కార్యమును పవిత్రాత్మ దేవుడు ప్రకటించి కొనసాగిస్తాడు (యోహాను 15:26). ఆత్మ వరాలు మనకోసం కాదు వాటిని పంచుకోవాలి. వీటి ద్వారా క్రైస్తవ జీవితం పటిష్టమౌతుంది. పరిశుద్ధాత్మ మన అంతరాత్మతో మాట్లాడుతుంది. ఆ స్వరాన్ని వినే అలవాటు కలగజేసుకోవాలి. ఆ యాత్మ ప్రబోధాలను పెడచెవిని పెట్టకుండా వుండేలా చూస్తుండాలి. పునీత జాన్ పాల్ పాపుగారు ఈ విధంగా చెప్పేవారు. "హృదయంలో వినిపించే ఆత్మస్వరాన్ని ఆలిస్తూ వుండాలి". అప్పుడు మనం విజయాలను సాధించగలుగుతాం. ప్రభు చూపించిన బాటలో నడవగలుతాం.

## క్రీస్తు రూపం

ఆత్మ మన తరపున ఇన్ని మంచి పనులు చేస్తుంది కదా! వీటన్నింటనీ ఒకే పనిగా భావించవచ్చు. "క్రీస్తుకు మనకు సంబంధం కలిగించడం, క్రీస్తు వైపునకు మనలను ఆకర్షించడం". ఇదీ ఆత్మ చేసే పని.

ప్రభువు మోక్షానికి వెళ్ళిపోయాక ఈ భూమీద ప్రభువు ప్రారంభించిన పనిని కొనసాగించుకుంటూ పోయేది పవిత్రాత్మ. కావుననే ప్రభువు వెళ్ళిపోయాక ఆత్మ వేంచేసి వచ్చింది. ప్రభుస్థానాన్ని పొందింది. ఆత్మ ప్రభు కార్యాన్ని కొనసాగిస్తుంది. ఈ ఆత్మ సహాయం లేనిదే మనము ఏమీ చెయ్యలేము. క్రీస్తు మరణం, పునరుత్తానం, పాపపరిహారం, రక్షణం దేవుడు తన మదిలో సంకల్పించుకున్న రక్షణప్రణాళిక. దీన్నే రహస్యం అని పిలుస్తుంటాం. పిత నిర్ణయించుకున్న రక్షణ ప్రణాళికను అనగా క్రీస్తు మరణోత్థానాలను మనంతట మనం అర్థం చేసుకోలేం. మనంతట మనం క్రీస్తును ప్రేమించలేం. పరిశుద్ధాత్మ మన హృదయం మీద పనిచేసి, మనం క్రీస్తు మరణోత్థానాలను అర్థం చేసుకొనేలా చేస్తుంది (1 కొరింతీ 2:13-15).

కనుక పరిశుద్ధాత్మ సహాయం లేనిదే మనం క్రైస్తవులం కాలేము. క్రైస్తవుల్లా జీవించలేము, క్రీస్తును అనుసరించలేము.

తొలి మానవునిలో దేవుని పోలిక వుండేది. కాని అతని పాపం ద్వారా ఈ పోలిక మాసిపోయింది. క్రీస్తు మరణం ద్వారా యీ పోలిక మరలా మానవునిలో నెలకొంటుంది. నూత్న వేద ప్రజలమైన మనలోను జ్ఞానస్నానంతోనే

క్రీస్తు పోలిక నిలుస్తుంది. ఆత్మ మన హృదయాల్లో క్రీస్తు రూపాన్ని చిత్రిస్తుంది. కావున మనం క్రీస్తుని పోలివుండాలనీ, క్రీస్తు రూపురేఖలు మన హృదయంతో ప్రస్ఫుటం కావాలని ఆ యాత్మను అడుగుకుందాం. ఆత్మతో నిండిన వాళ్ళు సంతోషంతో ప్రభువును గానం చేస్తుంటారు. దేవునికి కృతజ్ఞతలు అర్పిస్తుంటారు. తోటి వారిని ఆదరిస్తుంటారు.

## కానీ హృదయాన్ని ఆత్మతో నింపుకోవడం ఎలా ?

ఉదాహరణకు ఒక గ్లాసులో మనం పాలునింపాలి. ఆగ్లాసు ఎలా వుండాలి? గ్లాసులో పాలు పొయ్యాలంటే ముందుగా దానిలోని నీళ్ళను పారబోయాలి. ఆ మీదట ఖాళీ అంతా నిండేలా దాన్ని పాలతో నింపాలి. అలాగే మన హృదయాన్ని ఆత్మతో నింపుకోవాలంటే, మొదట హృదయంలోని పిశాచాన్ని, పాపాలను, చెడును మొత్తం నిర్మూలించాలి. ఆ పిమ్మట ఏ ఖాళీ మిగలకుండా హృదయాన్ని పూర్తిగా ఆత్మతో నింపుకోవాలి.

## మన బాధ్యతలు

మనం పుట్టి జ్ఞానస్నానం పొందేది మొదలుకొని, చనిపోయి మోక్షంలో అడుగు పెట్టిందాకా ఆత్మ వెట్టి చాకిరి చేస్తుంది. మనపట్ల దాదిలా మెలగుతుంది. అందుకే Greek Fathers ఈ ఆత్మను "తల్లి లేక దాది" అని పిలిచేవాళ్ళు. అనగా ఓ తల్లిగా ఈ ఆత్మ మనలను సాకుతుంది. ఓ దాదిలా పెంచి పెద్దజేస్తుంది. తెరచాప పడవను నడిపించుకొని పోయినట్లుగా మనలనూ ఆధాత్మిక జీవితంలో ముందుకు నడిపించుకొని పోతుంది. ఈ ఆత్మ పట్ల మనం బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తుండాలి. ఈ ఆత్మను తల్లిలా గౌరవిస్తుండాలి. ఈ పవిత్రాత్మను ఎప్పుడూ దుఃఖపెట్టకూడదు (ఎఫెసీ 4:30).

పాపం చేసినప్పుడల్లా ఈ ఆత్మను హృదయం నుండి గెంటి వేస్తుంటాం. పిశాచానికి హృదయంలో ప్రవేశం కలిగిస్తుంటం. పిశాచాన్ని ఆహ్వానిస్తుంటాం. ఇది ఎలా వుంటుందంటే తన విరోధికి స్థానమిచ్చి, తన్ను ఇంటిలోనుండి తరిమివేసిన దానిలా వుంది. దీన్నిచూసి ఆయాత్మ తల్లిలా బాధపడుతుంది. దుఃఖిస్తుంది. పవిత్రాత్మ, అపవిత్రమైన పిశాచాన్ని, పాపాన్ని ఎంతమాత్రము సహింపలేదు.

మన హృదయంలో వెలుగుతున్న ఆత్మను ఆర్పివేయకుడదు. (1 తెస్స 5:19). ఆత్మ మనం ఏ పని చెయ్యాలో, ఏ పని మానుకోవాలో తెలియజేస్తుంది. కానీ మనం అంతరాత్మ ప్రకారం ప్రవర్తించినపుడెల్లా బుద్ధిపూర్వకంగా, చెడు త్రోవలు త్రొక్కినపుడెల్లా హృదయంలో వెలిగే యీ వెలుగును ఆర్పివేస్తుంటాం. గృహిని దీపాన్ని ఆర్పివేసినట్లుగా హృదయంలోని ఈ దీపాన్ని గుప్పున ఆర్పివేస్తుంటాం. ఆత్మను పోగొట్టుకున్న క్రైస్తవులు ఆధ్యాత్మికం జీవితం జీవించలేక అలమటించి కృశించి నశించిపోతారు. తల్లి తండ్రీ లేని బిడ్డలుగా అనాథలుగా మిగిలిపోతారు. మనం ఎప్పుడైతే పరిశుద్ధంగా వుంటామో అపుడే ఆత్మ మనలో వసించగలుగుతుంది. ఆత్మ ద్వారా వృద్ధి చెందగలుగుతాం. ఒకరినొకరు అంగీకరించి, ఆదరించి ప్రేమించగలుగుతాం.

## ముగింపు

శ్రీసభకు దేవుడిచ్చిన అపురూపమైన కానుక పవిత్రాత్మ. క్రీస్తు దేహంగా, పవిత్రాత్మ ఆలయంగా వ్యవహరించబడిన శ్రీసభలో క్రీస్తు, పరిశుద్ధాత్మ కలిసి జరిపిన కృషి పరిపూర్తి అయింది. క్రీస్తు వైపుకు మనుషులను ఆకర్షించేందుకు ఆత్మ తన వరాలతో మానవుల వద్దకు వెళ్తుంది. వాళ్ళను సిద్ధం చేస్తుంది. పునరుత్థానుడైన క్రీస్తును నరులకు తెలియజేస్తుంది (క.శీ.స 737).

పరిశుద్ధాత్మ చేత నింపబడటం అనేది ఆనాడు ఎంత వాస్తవికమైన అనుభవమో ఈనాడు కూడా అంతే వాస్తవికమైన అనుభవం. ప్రతి క్రైస్తవునికి ఈ ఆత్మ నింపుదల వుండాలి, వుంటుంది. ఈ ఆత్మ నింపుదల, ఎప్పుడైతే మారుమనస్సు పొంది దేవునివైపు తిరుగుతామో అపుడు జరుగుతుంది. ఈ ఆత్మ నింపుదల మనస్ఫూర్తిగా ఇష్టపూర్తిగా కోరుకుంటేనే జరుగుతుంది. ఆయన ఆహ్వానించకుండా మనలోకి రాడు. ఏ పవిత్రాత్మ శక్తితో మరియమ్మ గర్భము ధరించి యేసు ప్రభువుకు జన్మనిచ్చినదో, ఏ పవిత్రాత్మ శక్తితో యేసుక్రీస్తు జ్ఞానస్నానం స్వీకరించిన వెంటనే నింపబడ్డాడో, ఏ పవిత్రాత్మ శక్తితో యేసుక్రీస్తు అద్భుతాలను చేశాడో, ఏ పవిత్రాత్మ శక్తితో భయము చేత బిక్కుబిక్కుమంటూ తలుపులు మూసివేసి దాక్కున్న శిష్యులకు ధైర్యమును ప్రసాదించాడో ఆ పవిత్రాత్మ చేత మనము కూడా నింపబడాలని ఆశిద్దాము.

# 8. త్రియేక సర్వేశ్వరుని మహోత్సవము

- బ్రదర్ బడిపాటి జాకబ్



## ఉపోద్ఘాతం

లాటిన్ భాషలో త్రిత్వాన్ని trinitas అంటారు - అంటే దానికి అర్థం మూడంతలు. ఇక్కడ దేవుడు ఒక్కడే కాని ఆయన ముగ్గురు వ్యక్తులుగా మనుగడలో ఉంటారు. ఆగ్లంలో త్రిత్వాన్ని వ్యక్తం చేయడానికి రెండు పదాలు ఉపయోగిస్తారు. మొదటిది, Triune, దీనిని తెలుగులో త్రిత్వేక సర్వేశ్వరుడు లేక త్రిత్వైక దేవుడు అంటున్నాం. రెండువది Trinity దీనిని తెలుగులో త్రిత్వము అని చెప్పకుటుంన్నాం. మొదటి పదం దేవుని ఏకత్వన్ని నొక్కిచెబుతుంటే, రెండవ పదం. దేవునిలోని ముగ్గురు వ్యక్తుల ఉనికిని చాటి చెబుతుంది. అంతే కాకుండా త్రిత్వం ఒక నిగూఢమైన పరమరహస్యమన్న సత్యం కూడ మనకు బోధింపబడుతుంది. యోహాను 16:12-15 ఈ యెక్క వచనములో చూసుకుంటే మనకు అర్థం అవుతుంది. త్రిత్వేక సర్వేశ్వరుడు అనగా దేవుడు ఒక్కడే ఎందుకంటే ఆయన తనను తాను మూడు రూపాలుగా కనిపిస్తున్నాడు; తండ్రి రూపముగా కుమారుని రూపముగా పరిశుదాత్మగా వ్యక్త పరుస్తున్నాడు. ఇక్కడ పరలోక తండ్రి సృష్టికి మూలమై, సృష్టిని కలగజేస్తే, ఆ సృష్టి పాపందకారంములో క్షీణించి దేవునికి దూరమై సైతానుకి బానిసై నరకానికి పోవుచుండగ, తండ్రి భగవానుడు తన కుమారున్ని లోకానికి పంపడం చూస్తున్నాం.

తండ్రి సృష్టకి కర్త అయితే కుమారుడు రక్షకుడు అయ్యాడు. పవిత్రాత్మ మనల్ని తండ్రి ప్రేమలో ఉంచేటటువంటి, బలపరచేటటువంటి, ఓదార్చేటటువంటి, తోడుగా ఉండేటటువంటి పరిశుద్ధాత్మ దేవునిగా, మనకు

దర్శనం ఇస్తున్నాడు. ఒక వేళ దేవుడు ఒంటరివాడుగా ఉన్నట్లయితే ఆయన ఎన్నడు ప్రేమించగలిగేవారు కారు. ప్రేమమూర్తిగా వర్ధిల్లేవారు కారు. యేసుప్రభు చేసిన సత్య విస్కరణను బట్టి ఆలోచిస్తే పూర్వపు నిబంధనలో కూడ పవిత్ర త్రిత్వానికి తగిన ఆధారాలు మనకు కనిపిస్తాయి (ఉదా: ఆది 1:2,18:2; 2 సమూ 23:2). నిజానికి సృష్ట, సర్వస్వాన్ని తరచి చూస్తే దేవుని త్రిత్వేక స్వరూపం దర్శనిమిస్తుంది. ఆది 1:1–2లో ఆదిలో దేవుడు ఆకాశమును భూమిని సృష్టంచేను. అంధకారము అగాధ జలముల మీద వ్యాపించెను. ఇక్కడ చూస్తే దేవుని యెక్క ఆత్మ నీటిపై గుండ్రముగా తిరుగాడుచుండెను, అని స్పష్టముగా మనకు తెలుస్తుంది.

## తత్వశాస్త్రం

ఒక పునీతుడు ఈ విధంగ వివరిస్తున్నాడు. మనకు సూర్యుడు ఉన్నాడు, వేడి ఉంది, కాంతి ఉంది ఈ మూడు ఒక్కటేనా లేక పోతే వేరు వేరా, అని ప్రశ్నించాడు. నిజానికి ఇవి మూడు కూడ ఒకటే ఆ మూడు వేరు వేరు అయితే సూర్యుడు లేక పోయినా వెలుగుండాలి. సూర్యుడు లేకపోయినా వేడి వుండాలి. కాని మనం చూసే విధానాన్ని బట్టి సూర్యుడు–కాంతి–వేడి ఈ మూడు కూడ ఒక్కటే, కాని వీటిని మూడు పేర్లుతో పిలుస్తున్నాం. అందుకే తత్వశాస్త్రం ఆధ్యాత్మిక శాస్త్రం అంతాకుడా బోధించేది తండ్రి కుమారుడు పవిత్రాత్మ ఈ ముగ్గురు అన్నిటిలో సరి సమానులు, ఎటువంటి బేదము లేదు అన్ని అయితే భేదము ఉన్నది ఒక్కటే, తండ్రి తత్వం మాత్రం ఆ ఇద్దరితో పంచుకోడు. ఎందుకంటే అది ఆయనకు మాత్రమే పరిమితం. కుమారుడు తనకు మాత్రమే పరిమితం పరిశుద్ధాత్మ పరివుద్ధాత్మకే పరిమితం. తండ్రి కుమారుడు కాలేడు, ఆత్మ కుమారుడు కాలేడు.

నూతన నిబంధనలో తండ్రి దేవుడు మరియమాత దగ్గరికి దూతను పంపినప్పుడు, మనకు త్రిత్వం కనిపిస్తుంది అసలు వారు ఎలా ఉన్నారు, అని పరిశీలిస్తే దేవ దూతను పంపించినది తండ్రి దేవుడు. ఆ తర్వుత గర్భంలో శిశువుగా అవతరించనున్నది కుమారుడైన క్రీస్తు. పవిత్రాత్మ ప్రభావము వలన నీవు గర్భం దరిస్తావు అని దూత చేప్పింది. కాబట్టి ముగ్గురు వ్యక్తులు కూడ ఆ సన్నివేశంలో ఉన్నారు. ప్రభు జ్ఞానస్నానం పొందే సమయంలో కూడా ఆ

ముగ్గురు ఉన్నారు. ఆత్మ దేవుడు ఉన్నాడు కుమారుడు ఉన్నాడు. తండ్రి దేవుడు పావురరూపంలో ఆత్మను దిగివచ్చునట్లుగా చేసాడు. తండ్రి స్వరాన్ని ఆలకించారు అక్కడి ప్రజలు. ఆ జ్ఞానస్నాన సన్ని వేశంలోను కూడా ముగ్గురు ఉన్నారు. అదే విధంగా ఈ త్రిత్వేక దేవుడు కుటుంబాలకు ఆదర్శం, ఏ విధంగా త్రిత్వంలో ముగ్గురు వ్యక్తులు ఉన్నారో కుటుంబం కూడ పరిపూర్ణం కావలంటే స్త్రీ, పురుషుడు, బిడ్డలు ఉన్నపుడే కుటుంబం పరిపూర్ణం అవుతుంది. ఆ త్రిత్వంలో ముగ్గురు వ్యక్తులవల్లే ఈ కుటుంబ సభ్యులు ప్రేమ అన్యోన్యత కలిగి ఉండాలి, అదే దేవుడు కోరుకునే విషయం.

## తండ్రి అంటే ఎవరు ?

## ఎందుకు పిలుస్తున్నాం

తండ్రి ప్రేమ మనకు కంటికి కనబడదు, చెవులకు వినబడదు. ఎందుకంటే ఆయన అనునిత్యం తన పిల్లలకోసం తపిస్తూ ఉంటాడు వారి భవిష్యత్తును చక్కదిద్దటానికి తనను తానే మర్చిపోయి శ్రమించేవాడే తండ్రి. తోటలో నాటిన విత్తనం సహజం. కాని అది చెట్టుగా మహా వృక్షంగా మలచడం తోటమాలి యొక్క గోప్పతనం. విత్తులాంటివాడు కొడుకు. అయితే అది మహా వృక్షంగా అవడానికి శ్రమించేది తన తండ్రి ఒక్కడే.

అదే విధముగా తండ్రి దేవుడు మనుజులను ప్రేమించి వారి తప్పిదాలను మన్నించడానికి తానే ఈ లోకంలోకి మనుష్యుడై పుట్టాడు. వారి పాపల రక్షణ పరమార్ధముగా తండ్రి భగవానుడు తన కుమారున్ని సిలువ మ్రానుపై బలి చేసి ఆయన ద్వారా లోకమంతా చేసిన పాపములను కడిగివేయడానికి తనను తానే బలియైనాడు. కనుక మానవ జాతి ప్రేమకలిగి జీవించాలి అని తెలియపరిచాడు ప్రేమను మించిన పెన్నిది లేదని జగమంతా చాటలి అని ఆయన వివరిస్తున్నాడు.

దేవున్ని మనం తండ్రి అని గౌరవించడానికి మొదటి కారణం, ఆయన ఈ లోకాన్ని సృష్టంచిన సృష్ట కర్త. అందుకే ఆయన మనందరినీ ప్రేమతో పోసిస్తూ రక్షిస్తున్నారు. అంతే కాదు సాక్షాత్తు దేవుని కుమారుడైన యేసు ప్రభువే – దేవుడు మన తండ్రి అని చెప్పారు. తన తండ్రి భగవానుడిని మనకు తండ్రిగా ప్రకటించాడు. సృష్ట కర్తని తండ్రియని నోరార పిలువమన్నారు.

తండ్రి దేవుని స్వరుప స్వభావాలు ఎలా ఉంటాయో యేసు ప్రభువే మనకు వెల్లడించారు. నన్ను చూచినవాడు నా తండ్రిని చూచి ఉన్నాడు (యెహోను 14:9). సామెతల్లో మానవులందరూ ఎదురుచూచేది ప్రేమగల తండ్రి దేవుడేనని యేసుప్రభువు బోధించియున్నారు.

## పవిత్రాత్మ పరమ రహస్యం

ఒకసారి అరేబియా ఎడారిలో ఒక వ్యక్తి దేశసంచారిగా ఉండేవాడు. అప్పుడు అ ఎడారి అందాలను చూడటానికి కొంత మంది యాత్రికులు వచ్చినప్పుడు అక్కడ ఉన్న ప్రదేశాలు అన్ని చూపించేవాడు. అటువంటి సందర్భంలో వారు తిరగిన ప్రదేశాలు అన్నీ కూడ క్రొత్తగా కనిపించేవి. ఎందుకంటే ఇసుక అంతయు ప్రదేశలను కప్పివేసేది వచ్చిన దారిని మరిచిపొయ్యేవారు. ఇటువంటి అనుభూతి ఎదురవుతుందని సంచారునికి ముందే తేలుసు. అందుకే ఆయన ఒక పావురము సహాయమును కోరుకునేవాడు. దాన్ని పెంచాడు ఎంతో చక్కగా మచ్చిక చేసుకున్నాడు ఒక ఆయుదంలా దాన్ని తయారు చేసాడు. ఒక మార్గాన్ని తప్పినపుడు ఆ పావురమును వదిలేవాడు అది వారి అందరినీ గమ్య స్థలానికి చేరుకునేలా తీసుకెళ్ళేది.

అదే రీతిగా మానవాలి జీవనం పరిపరి విధాలుగా ప్రయానిస్తుంటుంది. అటువంటి సమయంలో తండ్రి భగవానుడు పాపురమువలే పరిశుద్ధాత్మతో మనలను నడిపిస్తున్నాడు. దేవుని ఆత్మ ప్రపంచమంతటినీ ఆవరించియున్నది. నరులు పలుకే ప్రతి పలుకు ఆ ఆత్మకు తెలియును. మానవుడు చేసే ప్రతి క్రియ, ఆ ఆత్మ దేవునికి తెలుసు ఆయన అన్నివేళలా మనమధ్య మనతో నివాసమై ఉంటాడు. ఆయన అంతర్యామి మన అంతరంగములను అన్నియును ఎరిగినవాడు. ఎందుకంటే సాక్షాత్తు దేవుడే తన కుమారుని ఆత్మను మన హృదయములందు ప్రవేశపెట్టాడు (గలతీ 4:6). పవిత్రాత్మ ద్వారానే దేవుడు మనలో నిండుగా కొలువుదీరి ఉండగలుగుతున్నారు. పవిత్రాత్మ ద్వారానే మానవులు అపారమైన ఆనందాన్ని, అంతరంగిక శాంతిని సంపూర్ణ స్వేచ్ఛను పొందగలుగుతున్నారు. "ఏలయాన దేవుని నుండి మీరు స్వీకరించినది మిమ్ము భయకంపితులను చేయు బానిసత్వపు ఆత్మకాదు. మీకు దత్త పుత్రత్వము

నొసగు ఆత్మను మీరు స్వీకరించితిరి. ఆ ఆత్మ ద్వారా మనము దేవుని “అబ్బా! తండ్రీ” అని పిలుతుము (రోమీ 8:15). అవును జ్ఞానస్నానం, పవిత్రాత్మ ధ్రువీకరణ సంస్కారాల ద్వారా మనము స్వీకరించిన పవిత్రాత్మ వలననే లోకమంతయు కూడ దేవున్ని తండ్రి భగవానుడు అని పిలవగలుగుతున్నాం. మూడవ వ్యక్తియైన పవిత్రాత్మను కూడా మనం గౌరవించాలి. పితకు, పుత్రునకు పవిత్రాత్మకు మహిమ కలుగును గాక, అని ప్రార్థన చేస్తుంటాం. అనగా ముగ్గురికి సమానంగా గౌరవం చెల్లిస్తున్నాం. మన రక్షణకు, పవిత్రికరణకు కావలసిన వరప్రసాదలన్నీ పవిత్రాత్మ నుండే మనకు లభిస్తాయి. ఆయన మనయందుండి మనకు జ్ఞాన జ్యోతి ప్రసాదిస్తూ శోధనలను జయించటానికి బలాన్ని ఒసగుతూ, మనలను పరిశుద్ధ పరుస్తూ క్రీస్తును పోలినట్లుగా చేస్తాడు.

పవిత్రాత్మ మన అంతఃకరణం ద్వారా, పెద్దల ద్వారా, జీవిత సంఘటనల ద్వారా మనకు ఎన్నో హెచ్చరికలనిస్తుంటాడు. వాటిని మనం స్వీకరించాలి. సంస్కరాల ద్వారా పవిత్రాత్మ మనలను పవిత్రపరుస్తుంటాడు. కనుక ఆ సంస్కారాలను మనం భక్తితో స్వీకరించాలి. ముఖ్యంగా పవిత్రాత్మ మనలో తన నివాసాన్ని ఎర్పరుచుకొంటాడు. మీరు దేవుని ఆలయమనియు, దేవుని ఆత్మకు నివాసమనియు మీకు తెలియదా? (1 కొరింతీ 3:16), అని పౌలుగారు హెచ్చరిస్తున్నారు. కనుక పాపంతో దేవుని ఆలయాన్ని కళంక పరచకుండా చూచుకోవలి. ఎందుకంటే పవిత్రాత్మ సాక్షాత్తూ జీవాత్మ విశ్వాసుల అంతరంగంలో ఉప్పొంగి ప్రవహించే జీవనది. ఆత్మ ద్వారానే తండ్రి దేవుడు పాపం కారణంగా మృతి చెందినవారికి పునర్జీవం ప్రాసాదిస్తున్నాడు. లోకాత్యంనాడు క్రీస్తు ప్రభువు ద్వారా వారి శిథిల దేహాలకు సైతం పునరుత్థాన భాగ్యాన్ని అనుగ్రహించేవరకు వారికిలా పవిత్రాత్మ ద్వారా జీవదానం చేస్తూనే ఉంటాడు (రోమీ 8:10-11). పవిత్రాత్మ దేవుడు శ్రీసభలో కొలువుదీరి ఉంటాడు. అలాగే విశ్వాసుల హృదయ మందిరాలలోను నివసిస్తూ ఉంటాడు (1 కొరింతీ 3:16; 6:9). వారిలో కొలువుదీరి వుండే పవిత్రాత్మ ప్రభువు నిరంతరమూ వారి కోసం ప్రార్థిస్తూ ఉంటాడు. వారు దేవుని దత్తపుత్రులన్న సత్యానికి తానే సాక్షిగా నిలుస్తుంటాడు (గలతీ 4:6; రోమీ 8:15-16,26). అందుకే మన క్రైస్తవ జన్మ త్రిత్వైక సర్వేశ్వరుని నుండి వచ్చినది. అనగా త్రిత్వైక సర్వేశ్వరుని జీవితంవలె మన జీవితం కుడా పురోగమించాలి. ముగ్గురు వ్యక్తుల

మధ్య పరస్పర ప్రేమ, ఐక్యత, అవగాహన సమిష్టి కార్యం ఉన్నాయి. అలాగే మన క్రైస్తవ జీవితం కూడా రూపొందాలి. మనం దివ్యసప్రసాదాన్ని స్వీకరించి నపుడెల్లా త్రిత్వైక సర్వేశ్వర జీవితాన్ని పొందుతున్నాం. కనుక అది మన అనుదిన జీవితంలో కనిపించాలి.

## కుమారుడు దేవుడా? త్రిత్వములో ఒకరా?

కుమారుడైన యేసు పవిత్ర త్రిత్వంలోని రెండవ వ్యక్తి, పుత్రుడైన సర్వేశ్వరుడు. "పిత, పుత్ర పవిత్రాత్మ నామమున ఆమెన్!" అంటూ మనం ప్రార్థించేటప్పుడు ఇదే సత్యాన్ని స్మరించుకుటున్నాం. ఎందుకంటే ఆయన పితతో సరి సమానుడు. సుతునకు కూడ అదే గౌరవం చెల్లించాలి. "మీరు నన్ను బోధకుడనియు, ప్రభుడననియు పిలుచుచున్నారు. మీరు అట్లు పిలుచుట సముచితమే. ఏలయన, నేను మీ బోదకుడను, ప్రభుడైనైయున్నాను" (యోహాను 13:13). యేసు ప్రభువు మానవుల పాపములను క్షమించిన సందర్భంలో మతాధికారులు ఇలాగే ప్రశ్నించారు. ప్రభువుపైన నిందలు మోపారు. యేసు తనను తాను సబ్బాతుకు ప్రభువుగా ప్రకటించుకున్నా, మోసగాడు అన్నారు, దేవునికి మాత్రమే వర్తించే ప్రభువు అనే సంబోధనతో తనను పిలుచుకున్నాడని ఆరోపించారు. యేసు నిజంగా దేవుడేనా అని కొందరు తమలోతాము తర్కించుకున్నారు. ఇలా ఒక మానవమాత్రుడు దేవుడనని చెప్పుకోవటం యేసు సమకాలీన సమాజంలో మరణదండనకు అర్హమైన నేరం. అయితే యేసు ప్రభువు చేసిన అద్భుతకార్యాలు, సూచన క్రియల వలన, ముఖ్యముగా ఆయన పునరుత్థానం వలన యేసు దైవత్వాన్ని ఆయన శిష్యులు గుర్తించగలిగారు. ఆయనను ప్రభువుగా ఆరాధించారు. యేసు ప్రభు యదార్థముగా దేవుడు. అందువలననే దేవుడు ఆయనను అత్యున్నత స్థానమునకు లేవనేత్తైను. అన్ని నామముల కంటే శ్రేష్టముగు నామమును ఆయనకు ప్రాసాదించెను. అందుకే కుమారున్ని త్రిత్వములో ముగ్గురు వ్యక్తులలో ఒకరన్నది నిగూఢ సత్యం, శ్రీసభ విశ్వాసం. అందుకనే మనంకూడా దేవునికి ఇష్టమైన పుత్రులుగా ఉంటూ ఆయన ప్రేమలో నడుస్తూ, మన సోదరులను ప్రేమించి వారికి అన్ని విధాలా తోడ్పడాలి. క్రీస్తువలే మనంగూడ మన శత్రువులను ప్రేమించి, దేవునికి సన్నిహితులమై జీవించాలి.

# 9. క్రీస్తు శరీర రక్తముల మహోత్సవము

– బ్రదర్ కొమ్మెర పవన్



## ఉపోద్ఘాతం

"ఆయన మీకు అణుకువ నేర్పెను. మిమ్ము మొదట ఆకలితో బాధించి అటు పిమ్మట మన్నా బోజనము అను గ్రహించెను. ఇట్టి భోజనమును మీరుగాని మీ పితరులుగాని ఏనాడునారగించి యెరుగరు. నరుడు కేవలము భోజనము వలనే జీవింపజాలడు. కాని ప్రభువు సెలవిచ్చు ప్రతి వాక్కు వలన కుడా జీవించుననియు తెలిజేయుటకే ఆయన అట్లు చేసేను" (ద్వితియో 8:3).

ఆహారం శరీరాన్ని మాత్రమే బలపరుస్తుంది. కాని ప్రభుని మాటలు అలించి పాటించిన యెడల మనము అయన శాంతి, భద్రతలలో జీవింపగలము. దేవుని నోటినుండి వచ్చిన వాక్కు అతి పవిత్రమైనది, బలమైనది. సృష్టిని కలిగించినది అ దైవవాక్కు ఆదిలో మొదటి మానవునికి ప్రాణము పోసినది. ఇప్పుడు అ వాక్కే ప్రాణము పోసుకున్నది. మనుష్యావతరమెత్తి మనమధ్య నివాసము ఉండుటకు వేంచేసింది. అయన వచ్చినది జీవమును ఇచ్చుటకు, దానిని సమృద్ధిగ ఇచ్చుటకు వచ్చియున్నారు (యోహాను 10:10). జీవము మానవాళియైన మనకు ఇచ్చుటకు వచ్చియున్నారు. ప్రతి ఒక్కరికి జీవము వారి నెత్తురులో ఉన్నది అని లేవియుల గ్రంథం 17:11లో చెబుతుంది. క్రీస్తు ప్రభువు కూడా తనను తాను బలిగ అర్పించుకుంటూ తన శరీర, రక్తాన్ని సిలువ యాగం చేశారు. ఎందుకంటే "మీరు మనుష్యకుమారుని శరీరమును భుజించే, ఆయన రక్తమును త్రాగిననే తప్ప, మీలో జీవము ఉండదని ప్రభువే

నిశ్చయముగా చెప్పియున్నారు (యోహాను 6:53). అయన మనకు నిత్య జీవమును ప్రసాదించుటకే, మానవాళి కొరకు ఒక ప్రసాదముగ, దివ్య వరప్రసాదముగ మారారు. ఆదిలో ఇశ్రాయేలీయులు మన్నాను భుజించి మరణించిరి. కాని పరలోకములోని తండ్రి వాక్కుయైన క్రీస్తును భూజించువాడు మరణింపడు. ఎందుకంటే పరలోకమునుండి దిగివచ్చిన జీవాహారము ఆయనే. ప్రభుని శరీరము నిజమైన ఆహారము. ఆయన రక్తము నిజమైన పానము. ప్రభు ఇట్లునుడువుచున్నారు "నా శరీరమును భుజించి, నా రక్తమును పానము చేయువాడు నా యందును, నేను వాని యందును ఉందుము" (యెహాను 6:56). ఇంతటి మహా గొప్పదైన క్రీస్తుని శరీర, రక్తములను లోకొనుటకు, కొనియాడుటకు మనము చేసుకున్న మహాభాగ్యము ఇది. పునీత పదవ భక్తినాద పాపుగారు ఇలా అంటున్నారు: "దేవదూతలు, అసూయపడగలిగితే వారు పవిత్రమైన క్రీస్తు శరీర, రక్తముల కోసం అసూయపడతారు".

**ఉద్భవన**

'కార్పస్ క్రీస్తి' (Corpus Christi) అనేది పాశ్చాత్య కథోలికుల విందు. ప్రతి సంవత్సరం పెంతకోస్తు తర్వాత రెండవ గురువారం నాడు నిర్వహించబడుతుంది. ఈ వేడుక యేసు సిలువ వేయబడటానికి ముందు అతని అపోస్తులలతో చివరి భోజనం చేసిన జ్ఞాపకార్థ సంబంధం కలిగి ఉంటుంది. ఏది ఏమయినప్పటికీ, కార్పస్ క్రీస్తి యొక్క దృష్టి యేసు క్రీస్తు యొక్క అభిరుచి, మరణం కాదు, కాని అతను అన్ని సమయాలలో మన మధ్య ఉంటాడు. ఇది దివ్యబలిపూజ యొక్క ముఖ్యమైన అంశం. కథోలిక విశ్వాసం ప్రకారం హెూస్ట్ అని పిలువబడే పులియని రొట్టెయెక్క పవిత్రమైన విరువబడిన రొట్టె క్రీస్తు శరీరానికి పర్యాయపదంగా ఉంటుంది. ఈ పండుగకు ప్రధానం దివ్యబలిపూజ. ఈ పర్వదినాన యావత్ ప్రపంచం యెదుట క్రీస్తు ప్రభుని శరీర, రక్తాల్ని గౌరవ ప్రధమైన ప్రార్థనలతో, విశ్వాసాన్ని అందరికీ తెలియజేస్తారు.

**ఐక్యతను ఏర్పరిచే పండుగ :** వీరు అపోస్తలుల బోదయందు, సహవాస మందు, రొట్టె విరచుటయందు, ప్రార్థించుట యందు నిమగ్నమై ఉండిరి (అపో.కా. 2:42) మనం ప్రదానంగ చర్చించుకుంటున్న క్రీస్తు శరీర, రక్తములను

ఒక దివ్యబలిపూజలో మాత్రమే అనుభవిస్తాము. అపోస్తలులు అందరును ఐక్యముగ గుమికూడి క్రీస్తు ప్రభువు కడరాత్రిన పలికిన మాటలు, పలుకుతూ విందును స్వీకరిస్తారు. క్రీస్తు ప్రభువు మరణానంతరం శ్రీసభను తన శరీరంగ మార్చుకున్నాడు. అలనాడు ఆఖరి పాస్కా విందులో ఎలాగైతే ఐక్యతతో ఉండి, విందులో పాల్గొన్నారో, నేడు మనము కూడా దివ్యబలిపూజ ద్వారా ఒకే సంఘంగ, ఒకే శ్రీసభగ ఐక్యతను చాటుతున్నాం. దీనికి ప్రత్యేక కారణం మనమందరము క్రీస్తు శరీర రక్తాల్ని భుజించి, పానము చేయడమే! ఇదియే ఐక్యపరచే విందు. ఎక్కడైతే ఐక్యతలో ప్రభు పేరిట కూడుదురో అక్కడ అయన ఉంటానని వాగ్దనాము చేసియున్నారు. ఇటీవల కాలంలోనే శ్రీసభ ఒక నూతన అధ్యాయానికి నాంది పలికింది అదే 'కలిసిపయనించుట' (సినడాలిటి). ఇది మనలను ఏకం చేయడానికి ఏర్పరచిన బృహత్తర సమావేశం. ఈ సమావేశం వివిధ రకములైన ప్రజలు చర్చించినను, చర్చించే విషయం మాత్రము ఒక్కటే అదియే ఏకతాటిపై నడువడం. మనిషికి రకరకాల అవయవములు ఉన్ననూ శరీరము ఒక్కటే. క్రీస్తుని శరీరం రక్తము ఒక్కటి మనము అయన శరీరంలోని భాగాలము. మనమందరము ఏకమైతేనే శ్రీసభ అని అంటారు. ఇలా ఐక్యతతో మనలను ముందుండి నడిపించేది క్రీస్తుని శరీరరక్తాలు. ప్రభుని శరీర రక్తాలు స్వీకరించిన మనము అయన వలె మారుతాము కాబట్టి, మనము ఐక్యతతో నడిస్తే ప్రభు ముందుండి నడిచినట్లే.

## దివ్యసత్ర్పసాదంలోని నాలుగు ఫలాలు

**నిత్యజీవం:** "నా శరీరమును భుజించి, నా రక్తమును పానము చేయువాడు నిత్యజీవము పొందును" (యోహాను 6:54). దివ్య బోజనంలో లభించిన కృపానుగ్రహము కడవరకు విశ్వాసిని నడిపిస్తుంది. దైవ జీవమును, అనగా దేవునిలో ఐక్యతను ప్రసాదించునంత వరకు, శాశ్వత జీవితమును ఇచ్చునంతరకు ఈ భోజనం ఆగిపోదు.

**పునరుత్థానము:** "నేను అతనిని అంతిమ దినమున లేపుదును" అని ప్రభువు వాగ్దానము చేసియున్నారు. అయన మాటను తప్పని దేవుడు. తాను ఒసగిన వాగ్దానము నెరవేర్చి. విశ్వాసులను మరింత పటిష్టంగ తన మహిమను

ఎరుక పరిచే వారినిగ చేయువాడు. మన మరణానంతరం ఉత్థాన మహిమతో మనలను లేవనెత్తి పరలోక బహుమానమైన 'కిరీటమును' మనకు అందించువరకు ఈ దివ్యసత్ప్రసాద వరప్రసాదం మనలో తన ప్రభావం, మహిమ చూపిస్తునే ఉంటుంది.

**ప్రభువులో సహజీవనం:** "నా శరీరమును భుజించి, నా రక్తమును పానము చేయువాడు నా యందును, నేను వాని యందును ఉందును" అని క్రీస్తు ప్రభువు పలికియున్నారు. భక్తి శ్రద్ధలతో, అపారమైన విశ్వాసంతో ప్రభు శరీర రక్తలను లోకొనిన యెడల ప్రభువు శరీరం మన శరీరంగ మారుతుంది. ప్రభుని రక్తము మన రక్తముగా మారుతుంది. పరస్పరముగ నీవు అయన యందును, అయన నీయందును ఏకమగును. దివ్యసత్ప్రసాద రూపంలో క్రీస్తు మనలోనికి వేంచేసినప్పుడు ఇరువురము ఏకమౌతున్నాము. ప్రభువుతో పాటు మనమూ జీవిస్తాము. అంతకుమించి ప్రభువే మన ద్వారా జీవిస్తాడు. ఇలా ప్రభువే మన ద్వారా జీవించినపుడు అయనతో సహజీవనం సన్నిహిత సంబంధం సాధ్యమౌతుంది. పునీత పౌలుగారు ప్రభుని సానిధ్యాన్ని అనుభవించి, అయనలో ఎకమై ఇలా అంటున్నారు: "ఇక జీవించునది నేను కాదు, క్రీస్తే నా యందు జీవించుచున్నాడు" (గలతీ 2:20).

**క్రీస్తు ద్వారా జీవితం:** "నేను తండ్రి మూలమున జీవించుచున్నాను. అట్లేనన్ను భుజించువాడు నా మూలమున జీవించును" (యోహాను 6:57). క్రీస్తు ప్రభువు దివ్యసత్ప్రసాదం ద్వారా అణువణువులో ప్రవేశిస్తాడు. విశ్వాసి క్రీస్తు ద్వారా, క్రీస్తు మూలమున, క్రీస్తు కొరకు జీవించును. తన జీవితం క్రీస్తు కొరకైన జీవితముగా మారిపోతుంది. క్రీస్తు ద్వారా జీవించు వ్యక్తి తన శరీరమును నాశనమును చేయువానికి భయపడుడు. తన శరీరాన్ని పరమ పవిత్రుడైన ప్రభునికి ఆహుతిగా, హారతిగా అర్పించుకుంటాడు. అలా దివ్యసత్ప్రసాద ఫలములను పొంది తమ జీవితాలను, ప్రాణత్యాగం చేసినవారు ఎందరో పునీతులు మనకు శ్రీసభ చరిత్రలో దర్శనమిస్తారు.

## దివ్యసత్ప్రసాదము తరుచులోకొను బాగ్యము

పునీత 10వ భక్తినాథ పాపుగారు 'దివ్యసత్ప్రసాద' పాపుగారిగా ఎంతో

ప్రఖ్యాతిని పొందినవారు. ఇప్పుడు మనమందరం ప్రతిరోజు క్రీస్తుని శరీర రక్తములను లోకొంటున్నాము అంటే అయన చేసిన కృషి, సాధన చాలా గొప్పది. అయన శ్రీసభలో అనేక మార్పులను తీసుకొనివచ్చి, అయన జీవిత నినాదమైన 'క్రీస్తులో నూత్నీ కరణను' చేసి చూపారు. 10వ భక్తినాధ పాపుగారు 1903 నుండి 1914 వరకు శ్రీసభను పాలించారు వీలైనంత వరకు తరుచుగా దివ్యసత్ప్రసాదన్ని స్వీకరించడానికి విశ్వాసులందరినీ ప్రోత్సహించారు. ప్రత్యేకించి అయన 'క్వామ్ సింగులారి' అనే డిక్రి ద్వారా ప్రతి ఒక్కరు తరుచుగ ప్రభు శరీర రక్తలను పొందేలా చేశారు. అయన సమయంలో, కథోలికులు సంవత్సరానికి ఒకసారి మాత్రమే పవిత్ర వరప్రసాదలను స్వీకరించేవారు. చాలా కొద్దిమందికి మాత్రమే వారానికి ఒక్కసారి లోకొనే అవకాశం ఉండేది. సాదారణంగ గురువులు మాత్రమే తరచు సత్ప్రసాదాన్ని స్వీకరించేవారు. ఈ పద్ధతిని నూత్నికరించడానికి 10వ భక్తినాధ పాపుగారు కంకణం కట్టుకున్నారు. ట్రెంట్ మహాసభ వాస్తవానికి దివ్యసత్ప్రసాదం గూర్చి ఇలా చేబుతుంది: "మన రోజువారి లోపాల నుండి విముక్తి పొందే విరుగుడు మరియు మర్త్యపాపముల నుండి సంరక్షించే విరుగుడు" అని బోధిస్తుంది. దీనిని అధారంగ చేసుకొని పదియవ భక్తినాద పాపుగారు మొదటి దివ్యసత్ప్రసాదాన్ని స్వీకరించు వయస్సును "కారణవయస్సు"కి తగ్గించారు. ఇది సాధారణాంగా ఏడు సంవత్సరాల వయస్సు, ఆ సమయంలో దాదాపు 12 సంవత్సరాల వయస్సు నుండి పిల్లల అమాయకత్వం మరియు దేవునికి సామీప్యత యొక్క వాస్తవికతను బలపరుస్తూ, పదియవ భక్తినాధ పాపుగారు ఇలా వ్రాశారు: "పురాతన కాలంలో పవిత్ర జాతుల యొక్క మిగిలిన క్షణాలు పాలిచ్చే శిశువులకు కూడా ఇవ్వబడ్డాయి, అనే వాస్తవం ఇప్పుడు పిల్లల నుండి అసాధారణమైన తయారీని కోరుకూడదని సూచిస్తుంది. ఆత్మయొక్క అమాయకత్వం మరియు స్వచ్ఛత యొక్క సంతోషకరమైన స్థితిలో ఉన్నారు. ప్రస్తుకాలంలో అనేక ప్రమాదాలు మరియు సమ్మోహనాలు మధ్య, ఈ స్వర్గపు ఆహారం యొక్క ప్రత్యేక అవసరం ఉంది". అయన చేసిన బలమైన కృషియే నేడు దివ్యసత్ప్రసాదాన్ని తరుచులోకొనుటకు శ్రీసభ ద్వారాలను తెరిచింది. చివరిగ పదియవ భక్తినాధ పాపుగారు దివ్యసత్ప్రసాదం గుర్చి ఇలా పేర్కొన్నారు : "పవిత్ర దివ్యసత్ప్రసాదం పరలోకమును చేరుటకు అతి చిన్నదైన, సురక్షితమైన మార్గము".

## దివ్యసత్ప్రసాద అద్భుతాలు

1. **ఫ్లోరిపెస్ డి జిసస్:** లోలా అని పిలువబడే 'ఫ్లోరిపెస్ డి జీసస్ (దైవసేవకురాలు) 60 సంవత్సారాలు కేవలం ప్రభుని శరీర రక్తాలను స్వీకరిస్తు తన జీవితాన్ని గడిపింది. ఈమె బ్రెజలియన్ సామాన్యురాలు (విశ్వాసి). లోలాగారు బ్రెజిల్‌లోని మినాస్ గెరైస్ రాష్ట్రంలో 1913లో జన్మించారు. పదహారు సంవత్సరాల వయస్సులో అనూహ్యంగ చెట్టునుండి పడిపోయింది. ఆ ప్రమాదం అమె జీవితాన్ని మార్చేసింది. అమె పక్షవాతంలో పడిపోయింది అప్పటినుండి ఆకలి, దాహం, నిద్ర అనిపించలేదు. అప్పటి నుండి లోలాగారు రోజుకు కేవలం పవిత్ర దివ్యసత్ప్రసాదంతో తనను తాను పోషించుకోవడం ప్రారంభించింది. ఈ యొక్క మహాద్భుతమును బ్రెజిల్ మత గురువులు గురుశ్రీ విలావేర్దెగారు ఆనందంగ పంచుకున్నారు. ప్రభుని శరీర రక్తలతో 60 సంవత్సరాలు పోషించబడి ఎప్రిల్ 1999న జీవమును విడిచారు. అటు తరువాత 2005 వ సంత్సరంలో శ్రీసభ అమెను దైవసేవకురాలిగ ప్రకటించింది.

2. **పునీత కత్తరీనమ్మ:** ఈమె సియన్న నగానికి చెందిన కత్తరినమ్మగ ప్రసిద్ధి చెందింది. దివ్యసత్ప్రసాదాన్ని మాత్రమే లోకొంటూ ఒక మహావ్రతాన్ని చేపట్టి, సాధువు వలే కఠోర దీక్షలో నిమగ్నులైనవారు కత్తరీనమ్మగారు. సియన్నలో కత్తరినమ్మగారు మరణించేవరకు ఇరవై ఐదు సంవత్సరాలు పాటు క్రీస్తు శరీర రక్తాలమీదనే అదారపడి జీవించింది. అమె ఎనిమిదేళ్ళ వయస్సులో దీన్ని ప్రారంభించిందని మరియు పవిత్ర సత్ప్రసాదాన్ని భుజిస్తు జీవనం సాగించిందని చరిత్ర పుటలు చెబుతున్నాయి. అమె చివరి శ్వాస వరకు కూడా కేవలం ప్రభుని శరీర రక్తాలతో పోషింపబడి ముప్పైమూడు సంవత్సరాల వయస్సులో లోకాన్ని విడిచి పరమున చేరింది.

3. **పునీత కుపెర్తీనో యోసేపు:** కుపెర్తీనోలోని పునీత యోసేపుగారు ఐదు సంవత్సరాలు ఏమీ తినకుండా గడిపాడు మరియు పదిహేను సంవత్సరాలు ఏమీ తాగకుండ గడిపాడు కాని చాలా సంవత్సరాలు పవిత్ర శరీర రక్తాలను స్వీకరిస్తూ జీవించాడు. 1663, సెప్టెంబర్ 18న కాలంచెందారు.

4. **థెరిస్సా న్యూమాన్:** ఈమె మఠకన్యక. పునీత అస్సిసిపుర ఫ్రాన్సిస్‌గారి సభలోని మూడవ అర్డర్‌లోని కన్యస్త్రీ. 1926 నుండి 1962 వరకు ప్రభుని దివ్య శరీరమును, రక్తమును స్వీకరిస్తూ జీవించింది. వీరు కనీసం ఆహారం లేదా నీరును సైతం తీసుకోలేదు. అమె ప్రతిరోజు దివ్యసత్ప్రసాదాన్ని స్వీకరించు వరకు చనిపోతున్నట్లు భావించేది. పవిత్ర శరీర రక్తల మీదనే అదారపడి జీవించినవారిలో ఇంకా చాలా మంది గురువులు, కన్యస్త్రీలు, సామాన్య విశ్వాసుల అనేక మంది ఉన్నారు. కొందరు మాత్రమే ఈ ప్రపంచానికి బాహ్యంగ కనిపించారు. శ్రీసభలో ఇంక ఎంతో మంది పవిత్ర జీవితాన్ని జీవిస్తూ క్రీస్తుని శరీర రక్తములతో పోషింపబడుతున్నారు. ఈ దివ్య అహారంలో ఎదో రహస్యం దాగి ఉంది. ఆరహస్యమే సిలువలో మరణించి, విరవబడిన, నలగగొట్టబడిన గోదుమగింజ, రసము తీయబడిన ద్రాక్షపండు క్రీస్తునాధుడు. మనం ఎల్లవేళలో అయనను స్వీకరించు తరుణంలో ఎంతో భక్తిభావాలతో, పరిశుద్ధ హృదయంతో, ప్రభుని స్వీకరించాలి. అప్పుడే అయన మన ఆత్మకు దివ్యభోజనమై అధ్యాత్మిక ప్రయాణంలో మనతో కలిసి, మనలో ఉండి నడుస్తారు, నడిపిస్తారు.

## దివ్యసత్ప్రసాద హతసాక్షులు

తనను అప్పగించుటకు నమ్మక ద్రోహం చేసిన రాత్రి, కడరాత్రి భోజనంలో, మన రక్షకుడు తన శరీర రక్తాల కృతజ్ఞార్చన బలిని స్థాపించాడు. తాను తిరిగి వచ్చేవరకు, అన్నియుగాలలో సిలువబలి శాశ్వతం కావటానికి ఆయన స్థాపించాడు. ఆ బలిని తన ప్రియురాలైన శ్రీసభకు అప్పగించాడు. అది అయన మరన ఉత్థానాల స్మారకం ప్రేమ సంస్మారకం, సమైఖ్యతా చిహ్నం, ప్రేమబంధం, పాస్కవిందు. ఆ విందులో క్రీస్తునే భుజిస్తారు. క్రీస్తు ప్రభువు మనలను తన స్నేహితులుగ ఎంచి మన కొరకు బలి అర్పన గావించారు. "తన స్నేహితుల కొరకు తన ప్రాణమును ధారపోయువాని కంటే ఎక్కువ ప్రేమగలవాడు ఎవడును లేడు (యోహాను 15:13). శ్రీసభలో కొంతమంది మాన్యులు, మహనీయులు క్రీస్తు ప్రభుని శరీర రక్తాలను సంరక్షించుటకు తమ ప్రాణాలను అర్పించారు.

## చైనిస్ అమ్మాయి (సామాన్య క్రైస్తవురాలు)

అగ్రమేత్రాణులు ఫుల్టన్ షీన్ గారిలో దివ్య సత్ర్పసాద భక్తిని పెంపొందించుటకు, అయనను ప్రేరేపించిన వాస్తవ సంఘటన. 20వ శతాబ్దం ప్రారంభంలో చైనాలో జరిగిన బాక్సర్ తిరుగుబాటు సమయంలో, సైనికులు కథోలిక దేవాలయంలోకి చొరబడి, మతగురువును అరెస్టుచేసి, దివ్యమందసాన్ని ధ్వంసం చేశారు. అందులో ఉన్న 32 దివ్యసత్ర్పసాద ముక్కలను చెదరగొట్టారు. ఆ రాత్రి, విచారణలో ఉన్న ఒక యువ చైనీస్ అమ్మాయి, దొంగ చాటుగా వచ్చి దివ్యసత్ర్పసాద ముక్కల ముందు ఆరాధన చేసింది. అలా 32 పవిత్రమైన ముక్కలను, రోజుకు ఒక్కటి చొప్పున స్వీకరించేది. చివరి రాత్రి దివ్యసత్ర్పసాదాన్ని స్వీకరించిన తరువాత, ప్రేషిత కార్యం ముగియగానే అమె సైనికులుకు దొరికిపోయింది. అమెను చిత్రవధ చేసి చంపేశారు.

## జోన్ రోయిగ్ డిగ్లె (దైవ సేవకుడు)

దైవ సేవకుడు రోయిగ్ డిగ్లే 1936లో స్పానిష్ అంతర్యుద్ధంలో విశ్వాసంపై ప్రేమ కోసం చంపబడ్డాడు. బార్సిలోనాలోని దేవాలయలు మూతపడటం, కాల్చడం లేదా ధ్వంసం చేయబడిన సమయంలో ఆ యువకుడు దివ్యసత్ర్పసాదం పట్ల తనకున్న భక్తికి ప్రసిద్ధిచెందాడు, కాబట్టి ఒక మతగురువు జోన్ రోయిగ్‌కు అత్యంత అవసరమైన వారికి పవిత్ర సత్ర్పసాదాన్ని పంపిణీ చేయడానికి, దివ్యసత్ర్పసాదం ఉన్న పాత్రను అప్పగించారు. దివ్యబలిపూజకు హాజరు కావడం సాధ్యం కాని వారికి ఇళ్ళ దగ్గరికి వెళ్ళి ప్రసాదాన్ని పంపినీ చేసేవారు. ఇలా చేస్తున్న సమయంలో రెడ్ మిలాషియాలు (ఆర్మీ) వారిని చంపాలని యత్నించారు. అయినను భయుం లేకుండ ప్రభుశరీర రక్తాలను తీసుకొనివెళ్ళేవాడు. ఒకరోజు అబర్టేరియన్ యూత్ పెట్రోలింగ్ అంతన్ని శీంటా కొలమా స్మశానవాటికకు తీసుకెళ్ళారు. అక్కడ అయనను గుండెపై ఐదు షాట్‌లతో మరియు తలపై బుల్లెట్లతో కాల్చారు. అది సెప్టెంబరు 11, 1936. అయన పలికిన చివరిమాటలు "నేను మిమ్మల్ని క్షమించినట్లు దేవుడు మిమ్మల్ని క్షమించును గాక".

## దివ్యసత్ప్రసాదం పట్ల భక్తి ప్రపత్తులు

"మిమ్ము పిచిన దేవుడు పవిత్రుడు. కనుక మీ ప్రవర్తనయందు. మీరును పవిత్రులై ఉండుడు. నేను పవిత్రుడను. కనుక మీరును పవిత్రులై ఉండవలెను". (1 పేతురు 1:15-16) మనం స్వీకరించు ప్రభువు పరమ పవిత్రుడు, కనుక మనము కూడా పవిత్రంగ జీవిస్తూ, పరిశుద్ధ హృదయం కలిగి జీవించాలి. అప్పుడే ప్రభుని శరీర రక్తాలను మనం గౌరవించి, అరాధించిన వారమౌతాము. క్రీస్తుని శరీర రక్తములను పరమ పవిత్రంగా భావించడం అతిశయోక్తి కాదు. ఎందుకంటే మొదటగ "ఈ శరీర రక్తములు క్రీస్తునవి, అనగా క్రీస్తు ప్రభువే స్వయంగా అప్పద్రాక్షరస రూపములలో ఇమిడియున్నాడు, అనగా త్రియేక దేవునిలోని రెండవ వ్యక్తి అయిన 'పుత్రదేవునికి చెందిన స్వరూపము. రెండవది, క్రీస్తు శరీరములు, పరలోక ఆహారం, మానవాళికి త్రియుకదేవుని మహెూనత్నమైన ప్రేమ మాధుర్యముతో నిండిన బహుమానం. కావున క్రీస్తు శరీర రక్తములు పరమ పవిత్రములు, అవియే మనకు జీవనాధారములు.

కనుక, అయోగ్యముగా ప్రభువు యొక్క రొట్టెను ఎవడైన తినినను, ఆయన పాత్రనుండి త్రాగినను అతడు ప్రభువు శరీరమునకు, రక్తమునకు వ్యతిరేకముగ పాపము చేయుచున్నాడు (1 కొరింతీ 11:27). కనుక, ప్రతి వ్యక్తియు ఆత్మ పరిశీలనము కావించుకొని రొట్టెనుతిని, పాత్రమునుండి త్రాగవలెను (1 కొరింతీ 28). క్రీస్తు శరీరానికి మనం చాలా భక్తిపూర్వమైన గౌరవం ప్రదర్శించాలి. ఎందుకంటే ప్రభువు నలగగొట్టబడి, మన కొరకై తనను తాను దివ్యభోజనంగా సమర్పించుకున్నాడు. చాలా మంది పాపసంకీర్తనము చేయక ఎన్నో సంవత్సారాలు ప్రభుని ప్రసాదమును స్వీకరిస్తూ ఉంటారు. అలాంటి వారిని పౌలుగారు హెచ్చరిస్తున్నారు: "ఏలయన, ఎవడైనను రొట్టెను తినుచు, పాత్రము నుండి త్రాగుచు అది ప్రభువు శరీరము అని గుర్తింపనిచో, అతడు తినుటవలన, త్రాగుటవలన తీర్పునకు గురియగును (1 కొరింతీ 11:29). అందుకే దివ్యబలిపూజలో ప్రభు శరీర రక్తములు లోకొనుటకు ముందు గురువు "ఇది క్రీస్తు శరీర రక్తములు అని అన్నప్పుడు", స్వీకరించు వ్యక్తి తాను అట్లే అగునుగాక అని విశ్వసించి "అమెన్" అని చెప్పాలి. అటుల కాకుండ అగౌరవంగాను

అమార్యదపూర్వకంగాను స్వీకరించిన వారు ఎమౌతారు అని కొరింతీ ప్రజలకు పౌలుగారు ఇలా వివరించారు: “మీలో పెక్కుమంది వ్యాధిగ్రస్తులై బలహీనముగా ఉన్నారు. కొందరు మరణించిరి” (1 కొరింతీ 11:30). కావున ప్రతి ఒక్కరము ప్రభువు ఉచితముగ ఒసగిన దివ్య అహారాన్ని ఆత్మకు దివ్యభోజనంగ స్వీకరిస్తూ అధ్యాత్మిక ప్రయాణంలో ప్రభువు మనతో ఉండి నడిపించాలని అశిద్దాం.

## ముగింపు

దప్పిక గొనినవారెల్లరును నీటి చెంతకు రండు. ధనము లేనివారును వచ్చి ధాన్యముగొని ఆరగింపుడు. రండు, ధనమీయకయే ద్రాక్షరసమును, పాలను కొనుడు (యొషయా 55:1). యావే ప్రభువు పిలుచుచున్నాడు. నేటి నూతన నింబంధనలో అర్పనతానై, అర్పించుకొనువాడు తానై తమను తాను రిక్తుని చేసుకొని తానే దివ్యభోజనమై మనల్ని అందరినీ స్వీకరించుటకు అహ్వానిస్తున్నారు. అంగి అంచును అంటగానే అద్భుతాలు జరిగాయి, తన ఒంటి నీడ తాకగనే వ్యాధులు నయమయ్యాయి, తాను చేతితో తాకగానే ప్రాణాలు లేచి వచ్చాయి. మనం అయోగ్యులము, అనర్హలము అయినను మనలను మన్నించి స్వయంగ తానే శరీర రక్తములతో మనలో ప్రవేశిస్తున్నాడు. ఇది ఎంత అదృష్టం. చివరికి దేవదూతలు సహితం మానవులపై అసూయ కలగేది, ఒక్క దివ్యసత్ర్పసాదముకై మాత్రమే ఇది మహావిందు. జీవపు ఊటలు జలజల పారే హృదిని చేరు ప్రసాదం. దివ్యసత్ర్పసాదం ప్రతిరోజు దివ్యబలిపూజలో స్వీకరించాలి. శ్రీసభ మనకు ఇచ్చిన గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలి. అలాగే ఎల్లప్పుడు భక్తి బావాలతో దివ్యసత్ర్పసాద ప్రభుని మందసం వైపుమనస్సును మరల్చి, ఆరాధించాలి. నేటి తరం జాన్స్ప్యాంట్ పునీతుడిగ ముద్దుగ పిలువబడి పునీత కార్లో అకుతీసుగారు సాంఘిక ప్రసార మాధ్యమాల ద్వారా దివ్యసత్ర్పసాద అద్భుతాలను ప్రచురిస్తూ ప్రభుని పట్ల అమిత భక్తిని కనబరిచారు. మనం కూడా మనకున్న పరిస్థితులనుండి ప్రభుని ప్రతి ఒక్కరికి ప్రకటించాలి. క్రీస్తు ద్వారా, క్రీస్తుతోను, క్రీస్తునందు ఏకమై పరమ పవిత్ర శరీర రక్తముల మాహెూత్సవమును ప్రభుని ఎలుగెత్తి చాటుదం, ప్రకటించుదాం.

# 10. పునీత పాదువపురి అంతోని స్మరణ

- బ్రదర్ పాగుర్ల భాను ప్రసాద్



## ఉపోద్ఘాతం

ఒకసారి ఆర్చిబిషప్ పుల్టున్ జె షీన్ గారు ప్రసంగిస్తున్న సమయంలో ఒక విశ్వాసి ఈ విధంగా ప్రశ్నించారట: "పునీతులు కావడానికి ఎంత సమయం కావాలి" అని. అందుకు పీఠాధిపతులు "ఎంతో సమయం కాదుగాని ఎంతో ప్రేమ, ఓర్పు, సహనం కావాలి" అని సమాధాన మిచ్చారట. బహుశా! అది నిజమే కాబోలు! అందుకే ఈ రోజుకి కూడా పునీత అంతోని వారు విశ్వాసుల హృదయాలలో "అద్భుత కారుడు"గా అలరారుతున్నారు.

అసలు ఎవరు ఈ అంతోనివారు అని ధ్యానిస్తే ఆయన దైవానుగ్రహంతో ప్రదర్శించిన అద్భుతాలు మనకి ఆలోచన లోకొస్తాయి. దేవునిపై ఆయనకున్న భయ భక్తులు, దైవసేవపై ఆయనకున్న మక్కువ, ముఖ్యంగా దైవవాక్కు పట్ల ఆయనకున్న శ్రద్ధ ఇవన్నీ ఆయనను గూర్చి మనకి వివరిస్తాయి. ఈ విధంగా దైవ సేవలో ఉంటూ, దైవ శక్తిని కనులారా గాంచి, దైవ ప్రేరణ పొందిన మహానీయుడే పునీత అంతోనివారు. అంతోని వారి జీవితం ఏ విధంగా ముందుకు సాగింది అని ఆలోచిస్తే:

"శిల్పికి స్వేచ్ఛనిచ్చిన శిల్పం"లా "కుమ్మరి చేతుల్లో తయారు కాబడే ఒక కుండ"లా దేవుడు తనను ఇష్టానుసారం మలచడానికి అంతోనివారు తనను తాను సంపూర్ణంగా సమర్పించుకున్న వ్యక్తి.

అధేవిధంగా ఆయన బోధించిన సత్యానికి అనుగుణంగా దేవుడు చేసిన అద్భుత క్రియలు, నిరంతర ప్రార్థన ద్వారా దేవునితో ఏర్పరుచుకున్న స్నేహ బంధం, సమాజంలో చేసిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు ఇవన్నీ కూడా దేవుడు ఏ విధంగా అంతోనివారి జీవితాన్ని మలుపుత్రిప్పారో తెలుపుతాయి.

## 1. పునీత అంతోనివారు : జననం

పునీత అంతోనివారు పోర్చుగల్ దేశంలోని లిస్బన్ పట్టణంలో 1195 ఆగష్టు 15వ తేదిన జన్మించారు. పోర్చుగల్ రాజైన 2వ అల్ఫోన్యో కొలువులో సైనిక ఉన్నతోత్యోగిగా వీరి తండ్రి పని చేసేవారు. ఉత్తమ క్రైస్తవ కుటుంబం. ఈయనకు “ఫెర్డినాండు” అని జ్ఞానస్నానంతో పేరు పెట్టబడింది. పాఠశాలలో అద్యాపకులుగా విధ్యాబ్యాసం పూర్తి చేశారు. అంత మంచి ఆధ్యాత్మిక వాతావరణంలో వున్న అంతోని వారికి తండ్రి అనేక విద్యలు నేర్పించారు. కత్తిపోరాటం, గుర్రపుస్వారీ, నేర్చుకున్నారు.

## 2. దైవ పిలుపు : ఓ మలుపు – గెలుపు

దైవ పిలుపు మానవ జీవితంలో ఓ మలుపు. అది మనలను అలుపు, సొలుపు లేకుండా పని చేయిస్తుంది. చివరికి గెలుపును తీసుకొస్తుంది. ఇదే జరిగింది సాక్షాత్తు అంతోనివారి జీవింతంలో. అంతోనివారు తమ 15వ ఏట దైవ పిలుపుపొంది లిస్బన్ పట్టణంలోని పునీత ఆగస్టీన్ వారి సభకు చెందిన పునీత విన్సెంటుగారి ఆశ్రమంలో మఠాధిపతి “డాన్ గొంజాగ” గారి ఆధ్వర్యంలో చేరారు.

అయితే మఠవాసులను కొన్ని ప్రశ్నలు ఇంకా పీడిస్తున్నాయి అవి ఏంటంటే “సంపన్న కుటుంబంలో పుట్టి పెరిగిన వాడు కటోరమైన తపో జీవితాన్ని ఎందుకు కోరి వచ్చాడు. అంత అల్లారు ముద్దుగా పెరిగిన వాడు ముచ్చటగా మూడు నాళ్ళయినా మఠంలో ఉంటాడా, చెప్పకుండా పారిపోతాడా? అని. కాని వారిలో వున్న ఆలోచనలను విరిచి వారందరికీ తన పిలుపు ద్వారా సమాధానం చెప్పారు అంతోనివారు. హఠాత్తుగా ఒకరోజు మఠాధిపతి వద్దకు

వెళ్ళి నన్ను "లిస్బన్ పట్టణానికి దూరంగా పంపండి అని విజ్ఞప్తి చేశారు. కారణం, లిస్బన్ పట్టణంలో తమ బంధుమిత్రులు తరచుగా తనను కలవడం, తన ఏకాంత ప్రార్థన జీవితానికి ఆటంకం కల్పించడం. ఈ విధంగా అనేక శోధనలు ఎదుర్కున్నారు అంతోని వారు. ఎట్టకేలకు పోర్చుగల్ రాజధాని 175 కి.మీ దూరంలో "కొయిబ్రా" పట్టణంలో పరిశుద్ధ సిలువ మఠంలో క్రీ.శ. 1212లో చేరారు. 1220లో పవిత్ర గురుపట్టాభిషిక్తులయ్యారు.

## 3. అంతోనివారి పరిచయమే పరవశం

అది 1219లో అంతోనివారు గురుపట్టం పొందాక మఠ నియమం ప్రకారం వచ్చి పోయే అతిథుల మంచి చెడులు, భోజన వసతి చూసుకోవడం అంతోనివారి బాధ్యత. ఒకరోజు రాత్రి ఎవరో వచ్చి తలుపుతట్టారు. అంతోనివారు తలుపుతీయగా ఎదురుగా అయిదుగురు మఠవాసులు ఉన్నరు. వారు అంతోని వారికి నమస్కరించి వారి అవసరతను, సహాయాన్ని అర్థించారు. వారే ఫ్రాన్సీస్కన్ మఠవాసులు, వెంటనే వారిని లోపలికి ఆహ్వానించి, అతిథి సత్కారాలు చేశారు అంతోనివారు. ఈ విధంగా అంతోనివారి పరిచయం "ఒక పరవశంగా" మారింది మఠవాసుల హృదయాల్లో. అలాగే ఆ రాత్రంతా అంతోని వారి మర్యాదను రుచి చూశారు.

వారి విధివిధానాలను చూచి అంతోని వారికి ఆశ్చర్యం వేసింది. వారి కాళ్ళకు చెప్పుల్లేవు అంటే దాదాపు లిస్బన్ పట్టణం నుండి 200 కిలోమీటర్లు కాలినడక రావడం తెలుసుకున్నారు అంతోనివారు. వారు ధరించిన వస్త్రధారణ ప్రార్థించే విధానం, పలకరించే విధానం ఇవన్నీ అంతోని గారిని కట్టిపడేసాయి. ఇక ప్రార్థనలు ముగించుకుని మఠవాసులు నిద్రకు ఉపక్రమించారు. మరునాడు ఉదయమే అయిదుగురు మఠవాసులు మొరాకోకు తమ ప్రయాణాన్ని కొనసాగించారు. వారి సువార్త ప్రచారానికి అంతోనివారు అన్ని ఏర్పాట్లు చేసి దగ్గరుండి వారి ప్రయాణాన్ని సాగనంపారు.

అప్పటినుండి అంతోని వారిలో ఎదో తెలియని కోరికను కూడా క్రీస్తు సువార్తని పటుచోట్ల చాటాలని, అవసరమయితే క్రీస్తు కోసం మరణించాలని వారిలో ఉద్దేశ్యం నెలకొంది. అయితే ఇంతలోనే అంతోని వారి చెవిలో

బాధాకరమైన వార్త మొరాకో దేశం వెళ్ళి సువార్త భోధించిన మఠవాసులు హతసాక్షులయ్యారని. వార్త విన్న వింటానే అంతోనివారి కళ్లల్లో నీళ్ళు కమ్ముకొచ్చాయి. అప్పటినుండి విశ్వాసం మరింత ఎక్కువయింది. తనను కూడా వేదసాక్షిగా మార్చమని దేవుని అర్ధించారు ఈ పునీతుడు. వెంటనే 1221లో ఫ్రాన్సీస్ సభకు మారాడు. అప్పుడే “ఫెర్దినాండు” కాస్త “అంతోని”గా మారారు. పేదరికం, పవిత్రత, విధేయత, అనే పుణ్యవ్రతాలు తీసికొని పూర్తిగా ఫ్రాన్సీస్కన్ గురువుగా మారారు. అలాగే 1221లో ఇటలీలో అస్సిస్సిలో వారి బ్రదర్లకు, గురువులకు గొప్ప సమావేశం జరిగింది. అంతోనివారి సభకు హాజరై ఫ్రాన్సీస్‌గార్ని కలిసికొని ఆనందభాష్పాలు రాల్చారు. తన సువార్త ప్రచారానికి పూర్తి అనుమతి పొందిన అంతోనివారు మారు ఆలోచించక సువార్త సాధనను మొదలుపెట్టారు.

## 4. సువార్తలోని సుమధురమైన మాటలు అంతోని వారివి :

“సువార్తను బోధించు వారి పాదములు సుందరమైనవి” ధన్యమైనవి అని విశ్వాసుల నమ్మకం. ఆ విశ్వాసాన్ని కాపాడుతు వచ్చారు అంతోనివారు. అంతోని వారికి దేవుడిచ్చిన జ్ఞానం, వాక్య పరిచర్య పట్ల పట్టుదల ఎంతో గొప్పవని చెప్పాలి. క్రైస్తవత్వం మరియు క్రైస్తవులన్నా ముఖ్యంగా క్రీస్తుని సాక్షం పలకడం ద్వేషించే ఆ రోజుల్లో తమ సుమధురమైన మాటలతో ఎంతో మంది క్రీస్తు ద్వేషుల్ని క్రీస్తు స్నేహితుల్లాగా మార్చరు. అంతోని వారి ప్రసంగం వినడానికి ఎంతో మంది విశ్వాసులు తరలి వచ్చేవారట. వారు ప్రసంగిస్తే కూర్చొన్న చోటనుండి కదలేవారు కాదట విశ్వాసులు. అంటే ఆయన వాక్య బోధనలో ఎంతటి తీపి దాగివుందో చూడండి మరీ!

ఇది ఇలా ఉంటే, ఈయన చెప్పే బోధలు ప్రకృతిలో కూడా కదలికలు పుట్టించేవి. ఈ విధంగా మనుషుల హృదయాలలో వున్న కఠినత్వాన్ని చెరిపి నిర్మలత్వాన్ని తీసుకొచ్చేది ఈయన వాక్కు. అంతోని వారి వాక్య పరిచర్యను, వారి జీవిత విధానాన్ని, ప్రార్థన శైలిని చూసిన 30 సం॥ల దుర్మార్గుడు కూడా చెడు జీవితం వదిలి మంచి జీవితాన్ని అందుకున్నాడు. ఒకసారి అంతోనివారు సమీపంలో వున్న “మరేఖియా” నది వద్ద ఒంటరిగా ప్రసంగిస్తుండగా చేపలన్ని

శిరములెత్తి ప్రసంగాన్ని ఆలకించాయి ఆశీర్వదించి వెళ్ళిమన్నాకే వెళ్ళాయి.

అంతోనివారి వాక్య పరిచర్యలో మరొక అద్భుతం ఇటలీలోను ఫోర్లి అనే పట్టణంలో గురుపట్టాభిషేకం ఒకటి జరగబోతోంది. ఆ ఉత్సవ పూజలో ఫాదర్ ఆంతోని వారు సందేశం ఇవ్వ ఆహ్వానింపబడ్డారు. వారి మధుర ప్రసంగం స్వర్గం నుండి జాలువారే సెలయేరులా సాగిపోయాయి. శ్రోతలు మైమంచిపోయారు. పూజ అనంతరం అందరూ అభినందించారు.

మరొకసారి ఒక బహిరంగ స్థలంలో అంతోని వారు ప్రసంగం ఏర్పాటు చేయబడింది. వారు ప్రసంగిస్తుండగా ప్రజలు ఎవరి భాషలో వారికే చెప్తున్న అనుభూతి ప్రత్యక్షంగా గమనించారు. ఇంతలో పెనుతుపాను, ఉరుములు, మెరుపులు, వాన ప్రారంభమైంది. వెంటనే ప్రజలు ఆందోళన పడగా, అంతోనివారు ఆశీర్వదించి వారిని కూర్చొపెట్టి ప్రసంగం కొనసాగించారు. ఆశ్చర్యం, సభప్రాంగణంలో తప్ప చుట్టూర వర్షం. దేవుని పనికి సైతాను చెడగొట్టాలని ప్రయత్నించిన దేవుడు మన చేయివిడువడని దీని భావం. దీనితో విశ్వాసులు అద్భుతాన్ని గాంచి మరింత పరవవులయ్యారు. పాపాత్ములు సన్మార్గులయ్యారు.

క్రీ.శ. 1226లో తమసభ పెద్దయిన ఫ్రాన్సీస్‌గారు చనిపోయారు. క్రీ.శ. 1227లో పాపుగారి దూత ఒక మహాసభ ఏర్పాటు చేయగా వందలాది మంది పీఠాధిపతులు, గురువులు ఆ సభలో పాల్గొన్నారు. ఫాదర్ అంతోనివారు ప్రసంగింస్తుండగా స్వర్గం నుండి పునీత ఫ్రాన్సీస్ అస్సిసిగారు తమ హస్తాలు చాచి సభను ఆశీర్వదించిన దివ్య దర్శనంను చూచి తరించారు. ఇక క్రీ.శ. 1230లో అంతోనివారు ఇటలిలో పాదువ అనే పట్టణంలో నివాసం చేశారు. ప్రదేశం, అందంగా, ప్రశాతంగా, పవిత్రంగా ఉండేది. అక్కడే ఉంటూ తన సువార్త ప్రచారాన్ని కొనసాగించారు. తను అక్కడే సమాధి కావాలని ఆశించారు. చుట్టు ప్రక్కల గ్రామాల్లో పూజలర్పించి సందేశాలిచ్చేవాడు. ముఖ్యంగా గ్రీకు, లాటిన్, స్పానిష్ భాషలు అనర్గలంగా మాట్లాడేవారు. మంచితనం మానవత్వం ఉండాలని విన్నవించేవారు. ధనం ఒక ముళ్ళ కంప అనేవారు. 40 రోజులు ఏకదాటి ప్రసంగాలిచ్చేవారు.

## అద్భుతాలు చేయుటలలో అగ్రగణ్యుడు: అంతోనివారు

మానవ మేథస్సుకు (mind) ఆశ్చర్యం కలిగించే సంఘటనే "అద్భుతం". అద్భుతాలు ప్రదర్శించడం ఒక్క దేవునికే సాధ్యం, అని మనం అనుకుంటాం. కాని ఆ దేవుణ్ణి అప్యాయంగా ప్రేమించి, సేవించే ప్రతి ఒక్కరికీ అటువంటి భాగ్యం లభిస్తుంది. మనిషి అద్భుతాన్ని చేస్తున్నాడు అంటే ఖచ్చితంగా ఆది దేవుని "వరం" అని గుర్తించాలి. అద్భుతాలు ప్రదర్శించే వ్యక్తులలో పునీతులు మనకు గొప్ప ఉదాహరణ. ప్రతి యొక్క పునీతుడు ఏదో ఒక్క అద్భుతాన్ని విశ్వాసాన్ని చేసి చూపించిన వారే. అలాంటి వారిలో అగ్రగణ్యుడు అంతోనివారు. దేవుడు అంతోనివారికి తను ప్రసంగించే వాక్కు ద్వారా మాట్లాడే మాటలు ద్వారా అద్భుతాలు చేయు శక్తినిచ్చారు. అవి (1) అంతోని వారికి బాలయేసు దర్శనం, (2) సత్ప్రసాదం ఎదుట మోకరించిన గాడిద, (3) కాలు నరుకుకున్న యువకుడికి స్వస్థత, (4) ఒకే సమయంలో రెండు చోట్ల కనిపించడం, (5) జీవరాశులకు సందేశమివ్వడం, (6) అంతోని వారి పేరున దయ్యాలు వెళ్ళగొట్టడం.

## 1. అంతోని వారికి బాలయేసు దర్శనం

తొలిరోజుల్లో పాదువా పట్టణంలో ఫ్రాన్సిస్‌వారి మఠం ఉండేది కాదు. పాదువాకు వెలుపల ఉన్న ఆర్సెల్లాలో ఉండేది. అక్కడికి చేరుకోవాలంటే పాదువానుంచి ముప్పావుగంట నడవాలి. చీకటి పడ్డాక ఆదారిన వెళ్ళడం కష్టం. అందుకే కొన్నిసార్లు అంతోనివారి సువార్త ప్రచారం ఆలస్యం కాగా, స్నేహితులు ఇళ్ళలో రాత్రికి బస చేసే వారు. పొద్దున్నే మరలా మఠానికి వెళ్ళేవారు. ఈ విధంగా రాత్రి సమయాంలో తన ఇంట్లో బసచేయడానికి ఆహ్వానించే వారిలో అంతోని వారి స్నేహితుడు, "టిసో బోల్గిసు" ఒకరు. టిసో గారికి అంతోనిగారంటే అత్యంత అభిమానం, గౌరవం, ప్రేమ. ఎప్పటికైన అంతోనివారి మాటల్ని బట్టి చూస్తే, చేసే పనులను బట్టి చూస్తే ఎప్పటకైనా అంతోనిగారు ఒక మంచి పునీతుడవుతాడని నమ్మేవారు. అంతోనివారి ప్రార్థనలు చాటుగా వినేవారు టిసో గారు. ఒకరోజు అంతోనివారు పరిచర్య ముగించుకొని పాదువా చేరేసరికి చీకటి పడింది. అలవాటు ప్రకారం అంతోనివారు టిసో

బోర్గిసు గారి ఇంటికి వెళ్ళారు. మిత్రుడు టిసో ఎప్పుడు అంతోనిగారికి ఒక గదిని సిద్ధం చేసేవారు. అంతోనివారి గది దగ్గరలోనే టిసో గారి గది ఉండేది. అయిదే కొంత సేపటి తర్వాత అంటే రాత్రి సమయంలో టిసోకు మెలకువ వచ్చి కిటకిలోంచి బయటకు చూస్తే అంతోని వారి గదిలో ఇంకా దీపాలు వెలుగుతునే ఉన్నట్టున్నాయి. మళ్ళీ చూశాడు అది మామూలు వెలుగుకాదు చాలా పెద్ద వెలుగు. వెంటనే టిసో అటుగా పరుగెత్తి తొంగి చూడగా అంతా ఆశ్చర్యం! అంతోనివారి చేతిలో ఒక చిన్నబాలుడు కూర్చుని అంతోనిగారి నుదిటిపై మృదువుగా చిన్న హస్తంతో రుద్దసాగారు. ఇది చూచిన టిసో బోర్గిసు ఆశ్చర్యానికి అవధుల్లేవు. టిసో ఆ అద్భుత దృశ్యాన్ని తనివి తీరా చూస్తుండగనే అంతోనివారిని మరోసారి ముద్దాడి బాలయేసు అదృశ్యమయ్యారు. తక్షణమే వెలుగు కూడా అదృశ్యమైంది. ఈ విధంగా దేవునితో తనకున్న సంబంధ బాంధవ్యాన్ని వెలికి తీశారు అంతోనివారు.

## 2. దివ్యసత్రసాదం ఎదుట మోకరించిన గాడిద

సృష్టిలోని సమస్తము దేవుని ఆ దీనంలో ఉంటుందని, మానవులు, మరియు భూమిపై నివసించే భూజల చరజీవులు దేవుని సృష్టిలోని బాగమని మనకు తెలుసు. కాని ఆ రోజుల్లో "రిమిని" ప్రాంతంలో "ఆల్బిజెన్షియన్" అనే తెగవారు మాత్రం ఇందుకు పూర్తి వ్యతిరేకం. వారినే "పెడవాదులు" అని కూడా అంటారు. అయితే దివ్యసత్రసాదంలో క్రీస్తు నాథుడు నివసిస్తాడు అన్న సత్యాన్ని వీరు తృణీకరించారు. అయితే వీరు ఒకరోజు అంతోనివారిపై సవాలు విసురుతూ దివ్యసత్రసాదంలో క్రీస్తు ఉన్నాడని నిరూపించమని అంతోనివారిని హేళన చేశారు. అందుకు అంగీకరించిన అంతోనివారు, మూడు రోజులుగా తిండి పెట్టకుండా ఆకలితో ఉన్న గాడిదను తీసుకురమ్మని కోరారు. వారు అట్లే తీసుకొనిరాగా, ఎదురుగా గడ్డి, మరియు దివ్యసత్రసాద మందసం పెట్టి గాడిదను వదలగా, సరాసరి ఆ గాడిద ఎదురుగా ఉన్న గడ్డిని భుజింపక దివ్యసత్రసాద మందసం వైపుతిరిగి మోకాళ్ళపై వుండి తన శిరము వంచి దేవునికి వందన వచనం పలికింది. అది చూచిన "పెడవాదులు" అనేకులు అంతోనివారిని క్షమాపణ కోరారు. తమ తప్పు తెలుసుకొని, క్రీస్తు దివ్యసత్రసాద

రూపంలో కొలువైవున్న సత్యాన్ని నమ్మారు. అంతోనివారి ద్వారా దేవుడు తనను తాను ప్రత్యక్ష పరుచుకుంటున్నాడంటే ఆయనలో ఎంతటి విశ్వాసం, నమ్మిక, ప్రేమ అనే పుణ్యాలు దాగియున్నాయని మనం తెలుసుకోవాలి. క్రీస్తు భగవానుడు నిజంగానే దివ్యసత్ప్రసాదంలో దాగివుంటారని చెప్పడానికి అంతోనివారి చేసిన అద్భుతం ఒక గొప్ప ఉదాహరణ.

## 3. ఒకే సమయంలో రెండు చోట్ల కనిపించడం

మనిషి తన మేథాశక్తితో ఆలోచించిన ఇది ఎలా సాధ్యం, అనిపించే సంఘటనే "ఒకే మనిషి రెండు వేరు వేరు స్థలాలలో కనిపించడం". ఒక్క క్రీస్తుకు మాత్రమే సాధ్యం అయ్యే ఈ పనిని మామూలు వ్యక్తియైన అంతోనివారు ఎలా చేసారు, అని మనం ఆశ్చర్యపోవచ్చు. కాని అది నిజం. అంతోని వారికి దేవుడిచ్చిన వరం.

అది క్రీస్తు పునరుత్థాన మహోత్సవం దివ్యపూజలో అంతోనివారు నిలుచుండి ప్రసంగిస్తున్నారు. అలా ప్రసంగిస్తూ వుండగా మౌంట్ పెల్లియర్ మఠంలో జరిగే దైవార్చన కార్యక్రమంలో తానే ప్రత్యేకంగా అల్లెలూయ గీతం పాడుతానని మాట ఇచ్చారు. ఆ మాట గుర్తుకు రాగానే అంతోనివారు క్షణం ఆగి, కనులు మూసుకొని దేవుని సహాయం కొరుతూ ప్రార్థించారు. ఆశ్చర్యం ఆ క్షణంలోనే అంతోనివారు మౌంట్ పెల్లియరు మఠంలో ప్రత్యక్షమై అల్లెలూయగీతం ఆలపిస్తు కనిపించారు. మరో ప్రక్క పాదువా దేవాలయంలో తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ విధంగా ఇటు సత్యోపదేశం, అక్కడ భక్తి గీతాలాపన రెండు పరిచర్యలు ఒకేసారి జరిగడం నిజంగా దేవుడు చేసిన ఒక మహత్తర కార్యం అనే చెప్పాలి. వినడానికి వింత అనిపించినా ఒక క్రైస్తవుడు నమ్మడానికి సులువైన సంఘటన ఇది.

## 4. కాలునరుకుకున్న యువకుడికి స్వస్థతి

పాపం మనిషి జీవితాన్ని నాశనం చేస్తే పశ్చాత్తాపం ఆ మనిషిని పాపం నుండి రక్షిస్తుంది. అంటే పశ్చాత్తాపానికి అంత శక్తివుంది మరి (మత్తయి 5:29-30). దేవుడు ఇలా అంటారు. "నీ కుడికన్ను పాపకారణమైతే దానిని పెరికి వెయ్యి నీ కుడిచేయి పాపం చేస్తే దానిని నరికివేయి." అందుకు ప్రతీకగా జరిగినా సంఘటన ఈ స్వస్థత.

పాదువాపురిలో లియోనార్డో అనే యువకుడు అంతోనివారి వద్ద పాపసం కీర్తనం చేస్తూ తాను కోపంతో తన తల్లిని కాలతో తన్నాడని చెప్పాడు. చేసిన తప్పుకు పాపసంకీర్తనం చేసి క్షమాపణ కోరాడు. ఇందుకు అంతోవారు హితవాక్యాలు చెప్పడం ప్రారంభించారు. దేవుడిచ్చిన పది ఆజ్ఞలలో 4వ ఆజ్ఞగూర్చి హిత బోధచేస్తూ మంచి మాటలు చెప్పారు. ఈ మాటలకు మారు మనస్సు పొందిన లియోనార్డో, తాను చేసిన పాపాన్ని పదే పదే గుర్తు చేసుకుంటు ప్రాయశ్చిత్తంగా తన ఇంటికి వచ్చి తాను ఏకాలుతోనైతే తన తల్లిని తన్నాడో ఆ కాలి పాదాన్ని గొడ్డలితో నరికేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లి తల్లిడిల్ల వెక్కి వెక్కి ఏడ్చుకుంటూ అంతోనివారి దగ్గరకు వెళ్ళి సంగతి చెప్పింది. చేసిన ప్రాయశ్చిత్తం చేసు కొవాలనే తపనతో ఆ యువకుడు చేసిన పొరపాటును మన్నించి, అతన్ని స్వస్థపరచమని అర్థించింది. తెగిన పాదాన్ని యువకుని పాదం మునుపటిలా అతుక్కుంది. ఇది చూచిన వారందరు అంతోనివారిని వేనోళ్ళశ్లాఘించారు. యువకుడు చేసిన ఈ ప్రాయశ్చిత్తాన్ని దేవుడు మెచ్చాడనే చెప్పాలి. ఈ విధంగా పాపం ద్వారా మనిషి దేవునికి దూరమైన పశ్చాత్తాపం ద్వారా దగ్గరవుతాడనే చెప్పాలి.

## 5. అంతోనివారి పేరున దయ్యాలను వెళ్ళగొట్టడం

ఈ అందమైన ప్రపంచంలో మంచి ఉంటే చెడు ఉంది, నిజం ఉంటే అబద్దం ఉంది, అంతేకాక రూపాయి బిళ్ళకు ఒక ప్రక్క బొమ్మ ఉంటే మరో ప్రక్క బొరుసు ఉంది. అలాగే దైవ శక్తి ఉంటే దుష్టశక్తి కూడా ఉంది. ఇది సాక్షాత్తు క్రీస్తు ప్రభు ఉన్న రోజుల్లోనే నిర్ధారణమవుతుంది. అదే విధంగా చాలా మంది చాలా సార్లు అనేక ప్రాంతాలలో దుష్టశక్తి పట్ల వారికున్న అనుభవాల్ని సాక్ష్యాలు రూపంలో వెల్లడిచేయడం మనం వింటాం. దెయ్యం (Devil) అనే ఈ దృష్టశక్తి దేవుడికి, దేవుని పనికి, దేవుని విశ్వసించే ప్రతి భక్తునికి పూర్తి వ్యతిరేకం. మానవ జీవితాన్ని నాశనం చేయాలన్నదే దుష్టశక్తికున్న వాంఛ. మానవుల్ని, మానవ ఆలోచనలను అనేక రకాలుగా శోధించి, పీడించే శక్తి దుష్టశక్తి (Devil).

పవిత్ర గ్రంథంలో మనం క్షుణ్ణంగా పరిశీలిస్తే క్రీస్తు ప్రభువు 40 రోజుల ఉపవాస ప్రార్థనల తరువాత ప్రభువును 3 సార్లు శోధించడం మనం చూస్తాం (మత్తయి 4:4-9). అవి : (1) "రాళ్ళను రొట్టెలుగా మార్చమని, (2) పర్వతం మీదనుండి క్రిందికి దూకమని, (3) తనకు సష్టాంగ పడి నమస్కరించమని". దెయ్యం పట్టినవాడొకడు గెరాసీన్ ప్రాంతంలో యేసుకు ఎదురు పడినపుడు ప్రభువును చూడగానే భయంతో సాగిలపడి "సర్వోన్నతుడవగు దేవుని కుమారా! యేసుప్రభు! నా జోలి నీ కేలా? నన్ను హింసింప వచ్చితివా" అని కేకలు పెట్టాడు. ఈ విధంగా దృష్టశక్తి ప్రత్యక్షమవడం మనం చూస్తాం (లూకా 8:26-39).

దీపం వెలిగించగానే ఆ వెలుతురులో నిలువలేక చీకటి ఎలా పారిపోతుందో దేవుని పవిత్ర తేజస్సు ఎదురు పడినపుడు కూడా దుష్టశక్తులు వాటంతట అవే పారిపోతాయి. దేవునితో గాఢమైన ఆత్మీయబంధం గల అంతోనిగారు వంటి పునీతులు విషయంలో కూడా ఇదే జరుగుతుంది. ఉదాహరణకు పునీత పీటర్‌గారు (జూన్ 2 చూడండి) "యేసు నామంలో దుష్టదయ్యాలను వెళ్ళగొట్టె పునీతుడు".

యేసు పంపిన డెబ్బది ఇద్దరు శిష్యులు తిరిగి వచ్చి "ప్రభూ! మీ పేరిట పిశాచములు కూడా మాకు లోబడ్డాయి అని చెప్పినపుడు ప్రభువు "సైతాను ఆకాశం నుండి మెరుపువలె పడుట కాంచితిని" అంటారు. అవును "దేవుడు, దేవునితో గాఢాను బంధం గల వ్యక్తులు ఎదురు పడినపుడు ఖచ్చితంగా పిశాచాలు (దయ్యాలు) కుప్పకూలి పోతాయి. అంటే సైతానును ఓడించడానికి దేవుడే రానవసరం లేదు. దేవుని సేవకుడు ఎదురు పడినా చాలు. నిజంగా ఈ గొప్ప పరిణామానికి దేవుడే కారణం. దేవుని పవిత్రత ప్రభావం పునీతుల ద్వారా ప్రదర్శింపబడింది.

**అంతోనివారి అభయం ఆశీర్వాదకరమే !**

దేవుని పిలుపులోవున్న మహత్యం ఏమిటి, అని ఆలోచిస్తే, అది మనిషి మెదడుకు అంతుచిక్కదు. అర్థం అయ్యేలా చెప్పాలంటే "సాధారణమైన వ్యక్తిని అసాధారణ వ్యక్తిగా మార్చే ప్రక్రియ దైవ పిలుపు. పవిత్ర గ్రంథమే ఇందుకు

తగిన ఉదాహరణ. దేవుడు ఈ లోక రక్షణకు కొరుకు తయారుచేసిన ప్రణాళికను తాను ఎన్నుకొన్న సేవకుల ద్వారా నెరవేర్చారు. పాతనిబంధనలో ప్రవక్తలని, నూత్ననిబంధనలో క్రీస్తుచే ఎన్నిక చేయకబడిన పన్నిద్దరు శిష్యులు, మరియు పౌలుగారు ఈ ప్రణాళికను నెరవేర్చుటలో భాగము. అయితే క్రీస్తు మరణాంతరము కొందరు వ్యక్తులు తమ జీవితాలను క్రీస్తుకు అంకితం చేసుకుని ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, సత్యానికి సాక్ష్యం ఇచ్చారు. వారే పునీతులు. వీరు క్రీస్తుజ్యోతులుగా పిలువబడ్డారు.

వీరిద్వారా దేవుడు అనేక మేలులు, స్వస్థతలు, అనుగ్రహాలు జరిపించారు. వారిలో ఓ భాగమే పునీత అంతోనివారు. ఆయన జీవించిన రోజుల్లో ప్రజలకి ఇచ్చిన అభయం ఒక ఆశీర్వాదంగా మారింది. ఎంతోమంది ఆశీర్వదింపబడ్డారు, ఎంతోమంది పశ్చాత్తాపపడ్డారు, నిజమైన జీవితాన్ని తెలుసుకున్నారు. నిజదేవున్ని ఆరాధించడం ప్రారంభించారు.

దేవునిచే పిలువబడ్డ ప్రతి సేవకునికి దేవుడు ఇచ్చే అధికారం ఆశీర్వాదించడం (Blessing). అదే విధంగా దైవ పిలుపును పొందడం కూడా ఒక గొప్ప వరం. అందరికీ దక్కని ఒక అవకాశం.

## ముగింపు

చూశారా! ప్రియ సహోదరీ సహోదరులారా! మనం ఎంత గొప్ప పునీతున్ని కలిగియున్నామో! ఈ పునీతుడు ఎంతటి గొప్పజీవితాన్ని జీవిస్తేనే గాని ఈ రోజుకి మనందరి హృదయాల్లో గొప్ప అద్భుత వ్యక్తిగా స్థానం సంపాదించారు. ఈరోజు ప్రపంచ నలమూలలా పునీత అంతోనివారి భక్తిని ప్రతి మంగళవారాలలో కొనియాడుతున్నారు. అనేక మంది భక్తులు ఈ పునీతుని ప్రార్థన వేడుదల ద్వారా అనేక సమస్యలకు పరిష్కారాన్ని పొందుతున్నారు. ఇంత చేస్తున్న ఈ పునీతునికి శ్రీసభ అనేక బిరుదులతో గౌరవిస్తుంది. “భిన్నమతావ లంభికుల పాలిట సమ్మెట”, “మఠవాసాల పాలిట పెద్దఓడ”, “అద్భుతాల వ్యక్తి”, “పేదల పెన్నిది”, “అణగారిన ప్రజలకు ఆదరవు” ఈ బిరుదులతో అంతోని వారిని శ్లాఘిస్తారు.

దేవునిపై విశ్వాసంతో దేనినైనా సాధించ వచ్చని ఈ పునీతుడు నిరూపించాడు. ఈయన జీవించిన విశ్వాస జీవితం ఒక ఎత్తైతే దైవ కృపతో ఈయన జరిపిన అద్భుతాలు మరోఎత్తు. మన జీవితాల్ని దేవునికి అర్పిద్దాం. అంతోనివారి జీవితాన్ని ఉదాహరణంగా తీసుకొంటూ ఆయన ప్రార్థనా సహాయాన్ని అర్థిస్తు దేవాది దేవుడు మన జీవితాల్లో కూడా అనేక అద్భుతాలు జరిపించాలని కోరి ప్రార్థిద్దాం. దేవాది దేవుడు మనల్ని, మన కుటుంబాలను దీవించునుగాక! ఆమెన్.

❋ ❋ ❋ ❋

# 12. యేసు పవిత్ర తిరుహృదయ మహోత్సవము

- బ్రదర్ పెంటారెడ్డి సంజయ్



## పరిచయం

ప్రతిసంవత్సరం యేసు తిరుహృదయ మహోత్సవమును పెంతెకోస్తు పండుగ తరువాత వచ్చే రెండవ శుక్రవారము రోజున జరుపుకుంటాము. స్థానిక సౌలభ్యం కోసం ఈ పండుగను ఆదివారం రోజున జరుపుకుంటున్నాము. జూన్ మాసము మరియు నెలమొదటి శుక్రవారం యేసు తిరుహృదయానికి అంకితం చేయబడ్డాయి. యేసుతిరుహృదయ భక్తిఎప్పుడు మొదలైందంటే, యేసు కల్వరి కొండ మీద సిలువ వేయబడినప్పుడు సైనికుడు తన బల్లెంతో యేసుప్రభు దేహాన్ని పొడిచిన అప్పుడే యేసుహృదయాన్ని మనము కనుగొనగలిగాము.

## చరిత్ర

యేసుతిరుహృదయంపట్ల భక్తి భావములు మొదటగా పునీత బెనడిక్టు మఠవాసుల మధ్య ఆరంభమైంది. 1647-1690 ప్రాంతంలో జీవించిన, 'విజిటేషన్సభ' మఠవాసి 'పునీత మార్గరెట్మే మేరి అలకొకే' అనే సిస్టర్ ఈ భక్తి - వ్యాపకమునకు కృషిచేసారు. తాను చూచిన దృశ్యాన్ని అగ్నిజ్వాలలతో మండుచున్న యేసుహృదయం, దానిచుట్టూ ఒక ముళ్ళకిరీటం, దానిపైన ఒక సిలువను ఆమెచూచింది. అప్పుడు యేసుప్రభువు తన హృదయం వైపు చూపిస్తూ, భక్తిని వ్యాపకం చేయమని ఆమెకు ఆదేశించాడు. తదుపరి 1705వ సంవత్సరంలో హృదయం యెదల 13వ క్లెమెంట్ పొపుగారు, ఈ భక్తికార్యాన్ని ప్రారంభిస్తే ఆ తర్వాత 9వ భక్తినాథ పోపుగారు శ్రీసభయావత్తుకు ఈ పండుగను

వ్యాపింపజేశారు. చివరికి లియోపోవుగారు తన విశ్వలేఖ ద్వారా శ్రీసభ యావత్తును యేసుతిరుహృదయానికి అంకితంచేసారు. 'పునీత మార్గరెట్ మేరి అలకొకే' వారు దివ్యసత్ప్రసాద మందస సన్నిధిలో ప్రార్థించినప్పుడు, వారికి కలిగిన అనేక దర్శనములను గూర్చి ఇలారాస్తున్నారు: "ప్రభువు తన ప్రేమ యొక్క అద్భుతములను, వారి తిరుహృదయము యొక్కని గూఢ రహస్యములను నాకు బయలుపరిచారు. తన ప్రేమ ఎంతగొప్పదో, ఆ ప్రేమపట్ల మానవాళి ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య ధోరణి తన గాయములకు ఏ విధముగా కారణ భూతమవుతున్నదో" ప్రభువు ఆమెకు తెలియజేసారు.

నిజమైన భక్తిని కలిగి ఉన్నవారికి యేసు పన్నెండు వాగ్దానాలు చేశారని పునీత మార్గరెట్ మేరి అలకొకే అన్నారు. అవి: (1) వారి జీవితస్థితికి అవసరమైన అన్ని కృపలను నేను వారికి ఇస్తాను. (2) నేను వారి కుటుంబాలలో శాంతిని ప్రసాదిస్తాను మరియు విడిపోయిన కుటుంబాలను ఏకంచేస్తాను. (3) వారి కష్టాలన్నిటిలో నేను వారిని ఓదార్చుతాను. (4) జీవితకాలంలో మరియు అన్నింటి కంటే ముఖ్యంగా మరణంలో నేను వారికి ఆశ్రయంగా ఉంటాను. (5) నేను వారి అన్ని సంస్థలకు స్వర్గపు ఆశీర్వాదాలను ప్రసాదిస్తాను. (6) పాపులు నా హృదయంలో దయ మూలాన్ని మరియు అనంతమైన సముద్రాన్ని కనుగొంటారు. (7) నిస్సత్తువగా ఉన్న ఆత్మలు ఉగ్రరూపం దాల్చుతాయి. (8) ఆవేశపూరితమైన ఆత్మలు గొప్ప పరిపూర్ణతకు త్వరగా ఎదుగుతాయి. (9) నా హృదయం యొక్క చిత్రం బహిర్గతం చేయబడే మరియు గౌరవించబడే ప్రదేశాలను నేను ఆశీర్వదిస్తాను మరియు ఎవరైతే ఈ చిత్రాన్ని తమపై ధరిస్తారో వారి హృదయాలపై నా ప్రేమను ముద్రిస్తాను. నేను వారిలోని అన్ని క్రమరహిత కదలికలను కూడా నాశనం చేస్తాను. (10) నా దివ్యహృదయం పట్ల సున్నితమైన భక్తితో యానిమేషన్ చేయబడిన పూజారులకు, అత్యంత కఠిన హృదయాలను హత్తుకునే బహుమతిని ఇస్తాను. (11) ఈ భక్తిని ప్రోత్సహించే వారి పేర్లు నా హృదయంలో వ్రాయబడి ఉంటాయి, అవి ఎప్పటికీ చెరిపి వేయబడవు. (12) గొప్పవాగ్దానం - నా సర్వశక్తి మంతమైన ప్రేమవరుసగా తొమ్మిది నెలల్లో మొదటి శుక్రవారం నాడు ఎవరైతే ఈ భక్తిని ప్రకటిస్తారో వారందరికీ, చివరి పశ్చాత్తాపం యొక్క దయను ఇస్తాను. నా

హృదయం యొక్క అధికదయతో నేను మీకు వాగ్దానం చేస్తున్నాను: నా అవమానంలో చనిపోరు, లేదా వారి మతకర్మలను స్వీకరించకుండా, ఈ చివరి క్షణంలో నా దివ్యహృదయం వారికి సురక్షితమైన ఆశ్రయం ఇస్తుంది.

## ధ్యానము

కతోలిక శ్రీసభ సత్యోపదేశం యేసు తిరుహృదయం గురించి ఇలా బోధిస్తుంది. శ్రీసభ ప్రార్ధన యేసు పవిత్ర నామాన్ని వేడుకున్నట్లే యేసు హృదయాన్ని పూజించి గౌరవిస్తుంది. నరరూపవాక్కును, హృదయాన్ని బాధిస్తుంది. (యేసు తన) హృదయాన్ని మానవాళిపై గల ప్రేమవల్ల, మన పాపాలతో పొడవటానికి అనుమతిచ్చాడు. రక్షకుని, అడుగుజాడల్లో శిలువ మార్గాన్ని వెంబడించటం క్రైస్తవ ప్రార్థనకు అతి ప్రియం. పిలాతు మందిరం నుంచి గొల్గోత్తా మధ్యనున్న మజిలీలు, సమాధి యేసు మార్గాన్ని గుర్తిస్తాయి ఆయన తన పరిశుద్ధ శిలువ వల్ల ప్రపంచాన్ని రక్షించాడు. క్రీస్తు హృదయానికి మాత్రమే తండ్రి ప్రేమలోతులు తెలుసు. ఇంత సులభంగా, ఇంత అందంగా తండ్రి కరుణా సముద్ర లోతులను క్రీస్తు మాత్రమే బయలుపరచగలడు అనిమనకు తెలియజేస్తుంది. హృదయం అనగా నేమి? హృదయము ఒక మనిషికి కేంద్ర బిందువుగా పనిచేస్తుంది, ఒక మనిషి కావలసిన ఒక ముఖ్యమైన అవయవము. ఒక మనిషి ప్రేమించాలన్నా మరియు నిర్ణయాలు తీసుకోవాలన్నా హృదయము కేంద్రబిందువుగా పనిచేస్తుంది. మానవ సత్యానికి అది నిలయం. పరిశుద్ధ గ్రంథం ప్రకారము దేవుడు మన గుండెల్లో నివసిస్తూ ఉంటాడు. అలాగే మనల్ని నడిపిస్తూ ఉంటాడు. హృదయం నేను వసించే నివాస స్థలం, నేను బతికేచోటు. యూదుల లేదా బైబులు భావం ప్రకారం, నాకు నేనుగా ఉండిపోయే చోటు హృదయం, హృదయం మన రహస్య స్థావరం, మన మేధాశక్తికి గాని, ఇతరుల మేధాశక్తికిగాని అందనిది. దేవుని ఆత్మ మాత్రమే మానవ హృదయలోతును పరిశీలించి సంపూర్ణంగా తెలిసికోగలడు. హృదయం నిర్ణయం చేసే స్థానం, మన మానసిక ప్రవృత్తుల కంటే లోతైనది. అది సత్యం వసించే స్థానం, అక్కడ జీవాన్నో మరణాన్నో ఎంపిక చేసికొంటాం. అది సంయోగస్థానం, ఎందుకంటే దేవుని రూపులంగా మనం ఆ బాంధవ్యంతోనే

జీవిస్తాం. అది ఒప్పంద స్థానం అని శ్రీసభ మనికి బోధిస్తుంది. యేసు తిరుహృదయ పట్టము చూసినట్లయితే మనకు కనిపించేది ఒక గుండెకుముండ్ల కిరీటము, రగులుతున్న మంట, సిలువ మరియు ద్రవించుచున్న రక్తము నీరు. యేసు ఓలీవు పర్వతమున ప్రార్థించుచుండగా తన శిష్యులతో ఇట్లు అన్నాడు, 'నా హృదయము నిబ్బరముగా ఉన్నది మెలుకువ కలిగి ప్రార్థింపుడు'. ఒక కొడుకు తన తల్లిదండ్రులను కోల్పోతే తన బాధ హృదయం నిండా ఉండి ఉంటుంది. మన హృదయాల్లో ఏముందో మన క్రియల ద్వారా మనము తెలియజేస్తూ ఉంటాము. అలాగే యేసు ప్రభు తన హృదయంలోనీ బాధను రక్తచెమట ద్వారా కార్చడం మనం చూస్తున్నాం. అయినా కానీ యేసుప్రభు తన హృదయాన్ని తెరిచి అగ్ని రూపంలో తన ప్రేమను మనకు చూపిస్తున్నారు మరియు యేసు ప్రభువు ఆ అగ్ని ద్వారా చివరి మనిషి రక్షించబడేంత వరకు అగ్ని అలానే మండుతుంది అని మనకు తెలియజేస్తున్నాడు.

**ఈ సందర్భములో పునీత బెర్నార్డుగారు ఈ విధముగా పలుకుచున్నారు :**


'యేసు పొందిన గాయముల ద్వారా ఆయన హృదయ రహస్యం తెరువబడింది. మన భక్తి రహస్యం బయలు చేయబడింది. లోతైన ప్రభుని కారుణ్య భావాలు పెళ్ళుబికినవి'. నేను సాధుశీలుడుననియు, వినమ్ర హృదయుడననియు నా నుండి నేర్చుకొనుడు (మత్తయి 11:29). ఆయన రాజ్య పరమ రహస్యము ఈ మాటలలో వ్యక్తీకరించబడినది. వినమ్రత, సాధు శీలత ఇవే మన రక్షకుని హృదయ లక్షణాలు. వీటి ద్వారా ప్రభువుని తెలుసుకొని, అతనికి అత్యంత ఆరాధనలు, సలుపగలుగుతాము. జీవానికి, పవిత్రతకు మూలం హృదయం. మత్తయి 11:28లో ప్రభువు ఇలా పలుకుచున్నారు "భారముచే అలసిసొలసిన, సమస్త జనులారా! నా యెద్దకు రండు. నేను మీకు విశ్రాంతి నొసగుదును". కాబట్టి యేసు తిరుహృదయమును దేవుడు మానవాళి పట్లచూపించే అనంతప్రేమకు సంకేతం. తండ్రి, పరిశుద్ధాత్మలతో పుత్రుడైన యేసుప్రభువు పంచుకొనే ప్రేమను తిరుహృదయం చూపిస్తుంది. వాక్కు మనుష్యావ తారుడైనందున, యేసు ప్రభువు మానవ స్వభావమును అనగా ప్రేమ, ఆప్యాయతలు అనే హృదయ సంబంధిత భావాలను చాలా

స్పష్టంగా తిరుహృదయం మన అనుభవంలోనికి తెస్తుంది. ఇహలోకం నుండి పరలోకానికి వెళ్ళడానికి సహాయపడే ఒక ఆధ్యాత్మికనిచ్చెనగా తిరుహృదయాన్ని మనం భావించవచ్చు. యేసునాథుని హృదయం మనలను శుద్ధి చేసే ఆలయం. ప్రేమ అనే భావాన్ని హృదయం అనే చిత్రముతో వ్యక్తీకరిస్తాం. హృదయం లేక గుండె మానవ శరీరంలో ఉన్న ప్రతి అవయవానికి రక్తప్రసరణ చేస్తుంది. హృదయంలో మనమందరము నేర్చుకునే ఒక గొప్పగుణం కలదు. అది ఏంటంటే చెడును శుద్ధిచేసి మంచిని తిరిగి ఈస్తుంది. ఇది ఎలాగంటే, మనలోని చెడురక్తం మొత్తం గుండెల్లోనికి వెళ్తుంది. చెడుని స్వీకరించిన హృదయం చెడును తనలోనే ఉంచుకుంటుంది తన ప్రయత్నంగా చెడు రక్తంలోని చెడును తీసివేసి మంచి రక్తంగా మార్చి తిరిగి శరీరం మొత్తానికి పంపిస్తుంది. చూశారా మనలోనే ఉండే ఒక అవయము ఎంత గొప్ప మంచిని చేస్తుంది. ఈ విధంగా మన హృదయంలో నుండి స్ఫూర్తిని పొందిన మనం చెడును విడనాడి మంచిని మాత్రమే చేయాలి. ఇదే కదా మన క్రైస్తవ పిలుపు. ముందుగా చెప్పబడిన ఆ మంచి గుణానికి ఒకగొప్ప ఉదాహరణమన యేసు స్వామి మరియు తన పవిత్ర హృదయం.

యేసుని ప్రేమ ఎంతగొప్పది అంటే మన చెడును పాపమును స్వీకరించి మనలను ఒక పాపరహితంగా, తండ్రికి ప్రియమైన ప్రజలుగా తన ఎదుట మనలను నిలిపారు. ఇది ఏ విధంగా చేశాడంటే మోషే ప్రవక్త చెప్పినట్లు మన కోసం పాపంగా మారాడు. ఏ విధంగానైతే శరీరంలోని అవయవములు చెడురక్తంను శరీరానికి కేంద్రం అయినా హృదయముకి పంపిస్తుందో అదే విధంగా శ్రీసభ క్రీస్తుజ్ఞాన శరీరంలో మనం చేస్తున్న ప్రతిపాపం కూడా శ్రీసభ శిరసునైన క్రీస్తు కేంద్రమైన తన హృదయంలోనికి స్వీకరించి, చెడును తాను శుద్ధికరించి తిరిగి తన జ్ఞాన శరీరమైన శ్రీసభకు పవిత్రాత్మ ద్వారా పంపిస్తున్నాడు. ఈ విధముగా మనం ఎప్పుడూ పాపరహితులుగా మాలిన్యం లేని వారిగా కోపము, జారత్వము, అపవిత్రత, కలహము, అసూయ, క్రోధము, స్వార్థము మొదలగున విమనలో నుండి తీసివేయాలని జేసు తిరహృదయం కోరుతోంది. మనం ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటి అది ఏమిటంటే శరీరంలో ప్రవహించే రక్తంలో చెడు ఉన్న, అది గుండెను చేరినప్పుడే

అదిశుద్ధి పొందుతుంది. అట్లే మనలో చెడు గుణాలు ఉన్నా మనం మన పూర్తి స్వేచ్ఛతో యేసు తీరుహృదయాన్ని చేరినప్పుడే మనం శుద్ధిని పొందుతాము. మనం పరిశుద్ధులుగా మారాలన్నా ఆలోచన మన నుండి పుట్టినప్పుడే దేవుడు మనలను రక్షిస్తాడు. అందుకే యేసు క్రీస్తు 'పునీత మార్గరెట్మేరి అలకొకేలిలి గారికి తన పవిత్ర హృదయాన్ని చూపించి నప్పుడు తనకు చెప్పిన మాటలు ఏమిటంటే, "మిమ్మల్ని మీరు నా హృదయానికి అంకితం చేసుకోండి". కాబట్టి మన హృదయాలను ఆ పవిత్ర హృదయానికి అంకితం చేసుకుంటూ తనలాంటి హృదయాన్ని మనకు దయచేయమని యేసు తిరుహృదయాన్ని వేడుకుందాం. తిరుహృదయము నుండి పెల్లుబికే ప్రేమ, కారుణ్యాలు ప్రపంచ మంతటా ప్రవహించి, శాంతి సమాధానములను ఒసగును గాక! ఆమెన్!

❋ ❋ ❋ ❋





# భక్త యోహాను ప్రచురణలు

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం


రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 91-040-29561761, 29561762

e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing